నవచేతన పబ్లిషింగ్ హౌస్
దశాబ్దకాలం వెదజల్లిన విజ్ఞానం, సాహిత్యం
2015
11th Anniversary
NBH
www.navachethanabooks.in
Navachethana Vignana Samithi
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68. ఫోన్:040-29884453/54

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

ఐదు రాష్ట్రాలు, యుటిలకు కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీలు

ఏకగ్రీవ వార్డుల్లో మళ్లీ ఎన్నికలు పెట్టాలి

గాంధీ రాముడని... బిజెపి ప్రచారానికి వాడుకుంటోంది 05

సంపుటి 09, సంచిక: 38 | సోమవారం | 05-01-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



‘తెలంగాణ చరిత్ర మూలాలు’

## ఓ దిక్సూచి

‘తెలంగాణ చరిత్ర మూలాలు’తో తెలుగు రాష్ట్రాల చరిత్ర, భాష, సంస్కృతి కొత్త మలుపులు తిరుగబోతున్నాయని పుస్తకావిష్కరణలో పలువురు వక్తలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చరిత్ర అంటేనే కూర్పులతో కూడిందన్నారు. దేశంలో విజేతలు చరిత్రను రాసుకున్న ఆనవాయితీ కొనసాగడంతో అసలు చరిత్ర ఏమిటనేది నిత్య సత్యశోధనగా కొనసాగుతుందని తెలిపారు. 03



వెనిజులాను

# మేమే పాలిస్తాం

ట్రంప్ దురహంకార ప్రకటన
సామ్రాజ్యవాద నిజస్వరూపం బట్టబయలు

ఫ్లోరిడా : వెనిజులాలో చమురు నిక్షేపాలు అమెరికా దళాల అధీనంలో ఉంటాయని, సలహాదారుల ద్వారా తామే వెనిజులాను పరిపాలిస్తామని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దురహంకార ప్రకటన చేశారు. తన సామ్రాజ్యవాద నిజస్వరూపం బయటపెట్టారు. వెనిజులాలో సురక్షితంగా రాజకీయాధికార పరివర్త జరిగే వరకూ అమెరికా దళాలు వెనిజులాలోనే ఉంటాయని, వెనిజులా చమురు రంగాన్ని పునర్నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఫ్లోరిడాలోని సొంత మార్ ఎ లాగో ఎస్టేట్‌లో పాత్రికేయులతో ట్రంప్ మాట్లాడారు. వారు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. 2003లో ఇరాక్‌లో సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని కూల్చివేసి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత 22 సంవత్సరాలకు మళ్ళీ ట్రంప్ సారథ్యంలో అనేక నెలలు రహస్య ప్రణాళిక ద్వారా లాటిన్ అమెరికా దేశ ప్రభుత్వాన్ని ఆ దేశ దళం కూల్చివేసింది. ట్రంప్ పక్కా ప్రణాళికతో రాత్రికి రాత్రే మదురోను దేశం దాటించి అంతర్జాతీయ నేరస్థుడుగా మార్చారు. “వెనిజులా చమురు మాది, దానిని మేం సంరక్షిస్తాం, వాటిపై ఆంక్షలు కొనసాగిస్తాం, ఈ చమురును ఇతర దేశాలకు అమెరికా ప్రభుత్వమే విక్రయిస్తుంది, అక్కడ చమురు మౌలిక వసతులను పునరుద్ధరిస్తాం” అని ట్రంప్ తన ముందస్తు భవిష్యత్ వలసవాద ప్రణాళికను బహిర్గతం చేశారు. ఇరవైఏళ్ళ క్రితం హ్యూగో ఛావెజ్ వెనిజులా అధ్యక్షుడుగా ఉండగా అమెరికా చమురు నిక్షేపాలను జాతీయం చేసి ఆ దేశ ప్రైవేటు చమురు కంపెనీలను దేశం నుండి వెళ్ళగొట్టారు. ఇప్పుడు కమ్యూనిస్టు పాలకులపై డ్రగ్స్ ఆరోపణలు చేయడం ద్వారా తిరిగి ట్రంప్ ఆ చమురు నిక్షేపాలను తన అధీనంలోకి తరువాయి 2లో

వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు

## డెల్సీ రోడ్రిగ్జ్



- బాధ్యతలు చేపట్టాలని కోరిన ఆ దేశ సుప్రీంకోర్టు
- మదురో విడుదలకు రోడ్రిగ్జ్ డిమాండ్
- అధ్యక్షుడిని బందీగా అమెరికాకు తరలించడంతో పలుచోట్ల నిరసన ప్రదర్శనలు

కారకస్: వెనిజులాలో ఏర్పడిన సంక్షోభ పరిస్థితులనుండి తాత్కాలిక ఉపశమనం కలిగించేందుకు ఆ దేశ సుప్రీంకోర్టు తక్షణ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత దేశ ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ (56)ను తాత్కాలికంగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలని సుప్రీం కోర్టు కోరింది. ఐతే వెనిజులా ప్రభుత్వ టీవీ ఆమె ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఇంకా ప్రసారం చేయలేదు. అధ్యక్షుడు నికోలస్ మదురోతోపాటు ఫస్ట్‌లేడీ సిలియా ఫ్లోరెస్‌ను బ్రూక్లిన్‌లోని నిర్బంధ కేంద్రానికి తరలించక ముందునుండీ రోడ్రిగ్జ్ దేశంలో పరిస్థితులు చక్కదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజలు శాంతియుతంగా ఉండాలని, పరిస్థితులన్నీ తరువాయి 2లో





సిట్ ఎదుట ఎమ్మెల్సీ

## నవీన్‌రావు

సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆదివారం బిఆర్ఎస్ ఎంఎల్‌సి నవీన్ రావు సిట్ ఎదుట హాజరయ్యాడు. తన వెనుక ఎవరున్నారు? ఎవరితో చేయి కలిపారు? వంటి ప్రశ్నలు అధికారులు సంధించినట్లు సమాచారం. 03

ట్రంప్ చర్యకు ప్రపంచ నేతల దిగ్భ్రాంతి

నేడు భద్రతామండలి సమావేశం

చేతికి సంకెళ్ళు వేసి..

బ్రూక్లిన్ నిర్బంధ కేంద్రానికి మదురో తరలింపు 02

## నిశితంగా పరిశీలిస్తున్నాం

- భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడి
- అధ్యక్షుడు మదురో, ఆయన భార్యను యుఎస్ బంధించడంపై భారత్ తీవ్ర ఆందోళన

న్యూఢిల్లీ : వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను ఒక సైనిక చర్యలో యునైటెడ్ స్టేట్స్ బంధించడంపై ఆదివారం భారత దేశం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. చమురు సంపన్న దేశమైన వెనిజులాలో జరుగుతున్న పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలియజేసింది. వెనిజులా రాజధాని కారకాస్‌లో అమెరికా తీసుకున్న అనూహచర్యకు శనివారం తెల్లవారుజామున తన మొదటి స్పందనగా న్యూఢిల్లీ ఈ ప్రాంతంలో స్థిరత్వాన్ని నిర్ధారించడానికి సంభాషణ ద్వారా పరిస్థితిని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని తరువాయి 2లో

‘దేశవ్యాప్త’ నిరసనలకు

## వామపక్షాలు పిలుపు

- అమెరికా చర్య యుఎన్ చార్టర్‌ను ఉల్లంఘించి సార్వభౌమదేశంపై జరిపిన దాడిగా తీవ్ర ఖండన

న్యూఢిల్లీ : వెనిజులాపై అమెరికా దురాక్రమణను, అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన సతీమణి సిలియా ఫ్లోర్స్ కిడ్నాప్‌ను 5 వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఇది ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను స్పష్టంగా ఉల్లంఘించి సార్వభౌమదేశంపై జరిగిన దాడిగా ఆరోపించాయి. ఈ మేరకు ఆదివారంనాడు ఐదు వామపక్ష పార్టీలకు చెందిన అగ్రనాయకులు డి.రాజా (సిపిఐ ప్రధానకార్యదర్శి),ఎం.ఎ.బేబి (సిపిఐ(ఎం) ప్రధానకార్యదర్శి), దీపాంకర్ భట్టాచార్య (సిపిఐ(ఎంఎల్)ఎల్, మనోజ్ భట్టాచార్య (ఆర్‌ఎస్‌పి ప్రధానకార్యదర్శి), జి.దేవరాజన్ ( ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రధానకార్యదర్శి)లు ఇక్కడొక సంయుక్త తరువాయి 2లో

పోలవరం నల్లమల్ల సాగర్‌ను అడ్డుకునేందుకు

## సమర్థంగా వాదించండి

న్యాయనిపుణులకు సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచన

- సుప్రీంకోర్టులో నేడు రిట్ పిటిషన్‌పై విచారణ
- సీనియన్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో ముఖ్యమంత్రి, మంత్రి ఉత్తమ్ ప్రత్యేక సమావేశం
- ప్రాజెక్టులకు సంబంధించి అవసరమైన అన్ని ఆధారాలు సిద్ధంగా ఉంచుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

గోదావరి నదిపైన ఆంధ్రప్రదేశ్ తలపెట్టిన పోలవరం నల్లమల్ల సాగర్ ప్రాజెక్టును అడ్డుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ న్యాయ నిపుణులతో చర్చలు జరిపింది. ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే సుప్రీంకోర్టును ఆశ్రయించగా, రిట్ పిటిషన్‌పైన సోమవారం సుప్రీం కోర్టులో విచారణకు రానుంది. ఈ నేపథ్యంలో తరువాయి 2లో






## కదం తొక్కిన కమ్యూనిస్టులు

- సర్కస్ గ్రౌండ్ నుంచి రెవెన్యూ గార్డెన్ వరకు వేలాదిమంది పార్టీ కార్యకర్తలతో భారీ ర్యాలీ
- స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర ఎనలేనిది : సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

కరీంనగర్‌లో అంబరాన్నంటిన సిపిఐ వందేళ్ల సంబరాలు

ప్రజపక్షం/కరీంనగర్

భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ప్రస్థానంలో ప్రజాపోరాటాలు, ఉద్యమాలు, నిర్భంధాలు త్యాగాలతో కూడిన చరిత్ర అని, ప్రజల పక్షాన నిలబడి కొట్లాడిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో ఆదివారం కమ్యూనిస్టు పార్టీ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ శతవసంతాల ముగింపు ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ ర్యాలీ, బహిరంగ సభకు తరువాయి 12లో

ప్రపంచ పోలీసుగా


## ట్రంప్ వ్యవహారం

- ప్రజాస్వామ్య దేశాలపై విదేశీ శక్తులకు దాడిచేసే హక్కు లేదు
- వెనిజులాపై దాడి భారతదేశానికి నష్టం
- కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలి
- సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ



ప్రజాపక్షం/ ఖమ్మం

సంపద కోసమే అమెరికా వెనిజులాపై దాడి చేసిందని, ప్రజాస్వామ్య ప్రభుత్వాలపై ట్రంప్ దాడి చేయటాన్ని యావత్ ప్రజలు ఖండించాలని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ కోరారు. మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు పసలేనివని వెనిజులాలోని ఆయిల్ సంపదను తమ వశం చేసుకునేందుకే ట్రంప్ వెనిజులా అధ్యక్షున్ని, ఆయన భార్యను బందీలుగా చేశారన్నారు. ఆదివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ వెనిజులాలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వం ఉందని చర్చించే అవకాశం ఉన్నా ఆ పని చేయకుండా ట్రంప్ ప్రపంచ పోలీస్‌గా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. గతంలో అణు ఆయుధాల పేరు చెప్పి ఇరాక్‌పై దాడి చేసి సద్దాం హుస్సేన్‌ను తరువాయి 12లో




జిహెచ్‌ఎంసి విభజన

## శరవేగం

మూడు కార్పొరేషన్‌లుగా మహానగరపాలక సంస్థ !

- అధికారులు, సిబ్బంది విభజన ప్రక్రియ వేగవంతం
- ప్రస్తుత పాలకమండలి పదవీకాలం ముగిసేలోపు విభజన పూర్తి
- జిహెచ్‌ఎంసితో పాటు కొత్తగా మల్కాజిగిరి, సైబరాబాద్
- కొత్త కార్పొరేషన్‌లకు ఇద్దరు అదనపు కమిషనర్లు..
- అధికారులు, సిబ్బంది కేటాయింపు
- సర్కార్ నుంచి గెజిట్ నోటిఫికేషన్ వెలువడిన వెంటనే అమల్లోకి మూడు కార్పొరేషన్‌లు

ప్రజాపక్షం/హైదరాబాద్

మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) మూడు మహానగర పాలక సంస్థలుగా విభజించే దిశగా ప్రక్రియ వేగం పుంజుకుంది. అధికారికంగా మూడు కార్పొరేషన్లుగా ప్రకటించకపోయినా, ఆ దిశగా అధికారులు, సిబ్బంది విభజన ప్రక్రియను ఉన్నతాధికారులు పట్టాలెక్కించారు. వచ్చేనెల 10వ తేదీ వరకు ప్రస్తుత పాలకమండలి పదవీకాలం ఉండటంతో అప్పటిలోపు సిబ్బంది, ఇతరాత్ర విభజన ప్రక్రియను పూర్తి చేయాలనే స్పష్టమైన ఆదేశాలు ప్రభుత్వం నుండి అందడంతో అధికార యంత్రాంగం అందుకు సంబంధించిన చర్యలను వేగవంతం చేసింది. అధికారులు, సిబ్బంది, తరువాయి 2లో

ఇండోర్‌లో తాగునీరు కలుషితం..

## ‘వ్యవస్థ సృష్టించిన విపత్తు’

- ప్రముఖ జల సంరక్షకుడు రాజేంద్ర సింగ్ వెల్లడి
- ఈ విషాదానికి లోతుగా పాతుకుపోయిన అవినీతే కారణమని ఆరోపణ

ఇండోర్ : మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కలుషిత తాగునీటి కారణంగా పలువురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనను ప్రముఖ జల సంరక్షకుడు రాజేంద్ర సింగ్ ‘వ్యవస్థ సృష్టించిన విపత్తు’గా అభివర్ణించారు. ఈ విషాదానికి లోతుగా పాతుకుపోయిన అవినీతే కారణమని ఆయన ఆరోపించారు. ‘భారతదేశపు జలమానవుడు’గా ప్రసిద్ధి చెందిన మేగసెసే అవార్డు గ్రహీత, భారతదేశంలో అత్యంత పరిశుభ్రమైన నగరంగా నిలకడగా ర్యాంక్ పొందుతున్న ఇండోర్‌లో ఇటువంటి సంక్షోభం తలెత్తడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంలో ఇటువంటి విషాదం జరిగితే, ఇతర నగరాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థల పరిస్థితి ఎంత తీవ్రంగా తరువాయి 12లో

మేడారం జాతర పనుల్లో

## అలసత్వమేలా?

- అధికారులపై మంత్రి పొంగులేటి ఆగ్రహం
- పనులు పూర్తిచేయకపోవడానికి కారణాలేంటని నిలదీత
- 12వ తేదీకల్లా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశం
- లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక
- 18న సిఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారని వెల్లడి



ప్రజాపక్షం/ములుగు

మేడారం జాతర ఏర్పాట్లలో నెమ్మదితనం, నిర్లక్ష్యం కనిపిస్తున్న నేపథ్యంలో మంత్రి సీతక్క, ఎంఎల్‌ఏ శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు, శాఖాధికారులు పనులపై సరైన దృష్టి పెట్టకపోవడాన్ని మంత్రి తీవ్రంగా తప్పుపట్టారు. ‘పనులు పూర్తి చేయకుండా కారణాలు చెప్పడం మానేయండి, ఎవరు కాంట్రాక్టర్లు? ఎవరు బాధ్యత వహిస్తారు? ఎప్పుడు పూర్తి చేస్తారు చెప్పండి!’ మంత్రి ఒక్కొక్కరినీ నిలదీశారు. 12వ తేదీలోపు అన్ని ప్రధాన పనులు పూర్తి కావాలని, లేకపోతే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. పనులు ఆలస్యానికి బాధ్యులైన వారిపై తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS


## మయన్మార్ జైళ్ళనుండి 6,134 మంది విడుదల

**నే పైతా :** మయన్మార్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా 6,134 మంది ఖైదీలను జుంటా సైనిక ప్రభుత్వం జైళ్ళనుండి విడుదల చేసింది. వీరితోపాటు మరో 52 మంది విదేశీ ఖైదీలు కూడా త్వరలో విడుదలవుతారు. యాంగాన్‌లోని ఇన్‌సైన్ జైలు నుండి దాదాపు 12కు పైగా బస్సుల్లో ఖైదీలు కేరింతలు కొడుతూ బాహ్య ప్రపంచంలోకి వచ్చారు. కుటుంబ సభ్యులు వారికోసం ఎంతో ఆత్రుతతో ఎదుచూశారు. విడుదలైన ఖైదీల పేర్లు వరుసగా చదివారు. ఆ పేర్లలో తమ ప్రియతములు ఉన్నారో?లేదో? అని బంధువులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూశారు.బంధువులు తమ ప్రియతములకోసం కన్నీళ్ళతో ఎదురుచూశారు. యాజర్ టన్ అనే 35 ఏళ్ళ వయసుగల వయోజనుడు కన్నీళ్ళు పెట్టుకుంటూ ఇన్ని సంవత్సరాల తర్వాత తిరిగి తాను తన కుటుంబాన్ని కలుసుకున్నానన్నారు. మయన్మార్ దేశం బ్రిటిష్ పాలకుల నుండి స్వాతంత్ర్యంపొంది జనవరి నాలుగోతేదీ నాటికి 78 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సైనిక ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఖైదీలను విడుదల చేసింది.

# ట్రంప్ చర్యకు ప్రపంచ నేతల దిగ్భ్రాంతి

### నేడు భద్రతామండలి సమావేశం

**న్యూయార్క్:** వెనిజులా దేశాధ్యక్షుడు నికొలస్ మదురో పడక గదిలోకి ప్రవేశించి భార్యాభర్తలను నిర్బంధించి సంకెళ్ళువేసి యుద్ధనౌకలో న్యూయార్క్‌కు తరలించిన అమెరికా బందిపోటు చర్యకు ప్రపంచదేశాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. తీవ్ర నేరంగా ఖండించారు. న్యూయార్క్ సిటీ మేయర్‌గా ఈనెల ఒకటో తేదీన బాధ్యతలు తీసుకున్న జోహ్రాన్ మమ్దానీ, ఎన్నికల్లో ట్రంప్ ప్రత్యర్థి కమలా హారిస్ సహా అమెరికాలో అనేకమంది ప్రతిపక్ష నాయకులు ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. కనెక్టికట్ ప్రజా ప్రతినిధి డెమోక్రాట్ జిమ్ హిమ్స్ మాట్లాడుతూ, ట్రంప్ తన చర్యలను సర్థించుకోవడానికి వీలైన సాక్ష్యాలు ఏమీ కనిపించడంలేదని అన్నారు. వెనిజులా తీరంలో డ్రగ్స్ పడవలపై దాడులను సమర్థించలేమన్నారు. ఈ సైనిక చర్యకు కాంగ్రెస్ ఆమోదం లేదన్నారు. క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్ డయాజ్ కేన్ దీనిని నేరపూరిత చర్యగా పేర్కొన్నారు. ట్రంప్ మిత్రుడు, అర్జెంటైనా అధ్యక్షుడు జేవియర్ మిలే ఒక సందేశంలో స్వేచ్ఛ వర్థిల్లాలి అని పేర్కొన్నారు. చైనా సహా అనేక దేశాలు ట్రంప్ చర్యను తీవ్రంగా ఖండించాయి. శాంతి–ప్రజాస్వామ్యం జపం చేసే అమెరికా పరాయిదేశంపై అసత్య ఆరోపణలు చేసే అమెరికా మరోసారి తన నైజాన్ని చాటుకుందని రాజకీయ విశ్లేషకులు నిశిత విమర్శలు చేశారు. ట్రంప్‌పై విస్తారంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తగా బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్, ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ తదితరులు ట్రంప్ చర్యను సమర్థించారు. తాను ఈ దాడులపై వ్యాఖ్యానించలేనంటూ స్టార్‌మర్ తప్పించుకున్నారు. ఆ తర్వాత ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెడుతూ, మదురో చాలా తెలివైన నాయకుడనీ, ఐతే ఆయన పరిపాలన ముగిసిందని తాము కన్నీళ్ళు పెట్టుకోలేమన్నారు. రాబోయే రోజుల్లో ఈ పరిణామాలపై అమెరికాతో తాము చర్చిస్తామన్నారు. బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వా ఎక్స్ వేదికగా స్పందిస్తూ, ఎంతమాత్రం సహించరానివిధంగా ట్రంప్ హద్దులు దాటారని విమర్శించారు. కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఈ చర్య లాటిన్ అమెరికా దేశాల సార్వభౌమాధికారంపై దాడిగా పేర్కొన్నారు. మరోవైపు వెనిజులా సమస్యపై భద్రతా మండలి సోమవారం ఉదయం సమావేశం నిర్వహిస్తోంది. అనేకమంది న్యాయ నిపుణులు ట్రంప్ చర్యల్లో న్యాయబద్ధతను ప్రశ్నించారు. తక్షణ చర్యలకు డిమాండ్ చేస్తున్నారు. అమెరికా కాంగ్రెస్ అనుమతి లేకుండా ఈ దాడి జరిగింది. ఈ చర్యకు కాంగ్రెస్ ఇంకా అనుమతి ఇవ్వాల్సి ఉంది. యూరోపియన్ యూనియన్ ఉన్నతస్థాయి దౌత్యవేత్త కాజా కల్లాస్ స్పందిస్తూ, మదురో తన చట్టబద్ధతను కోల్పోయారన్నారు.



### మదురో తక్షణ విడుదలకు చైనా డిమాండ్

మదురోను, ఆయన భార్యను తక్షణం విడుదల చేయాలని చైనా డిమాండ్ చేసింది. చర్చలు, సంప్రదింపుల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని కోరింది. చైనా విదేశీ మంత్రిత్వశాఖ ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. మదురో, ఆయన భార్యకు వ్యక్తిగతంగా పూర్తి భద్రత సమకూర్చాలని, వారిని వెంటనే విడుదల చేయాలని కోరింది. అమెరికా అంతర్జాతీయ చట్టాలను స్పష్టంగా ఉల్లంఘించిందని విమర్శించింది. అంతర్జాతీయ సంబంధాల మౌలిక సూత్రాలను అమెరికా ఉల్లంఘించిందని విమర్శించింది. ‘‘చైనా ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తోంది, అంతర్జాతీయ చట్టాలకు అమెరికా కట్టుబడి ఉండాల్సిందే, దీనిని సహించలేం, దేశాల సార్వభౌమాధికారాలను, భద్రతను ఉల్లంఘించడం ఇక ఆపాలి’’ అని ప్రకటనలో కోరింది. రష్యా కూడా ఇంతకుముందే ట్రంప్ చర్యను ఖండించింది.

# చేతికి సంకెళ్ళు వేసి..

### బ్రూక్లిన్ నిర్బంధ కేంద్రానికి మదురో తరలింపు

**న్యూయార్క్ :** ప్రపంచ చరిత్రలో ఒక అరుదైన దుర్మార్గపూరిత ఆటవిక చర్యను ట్రంప్ ఎట్టకేలకు పూర్తిచేశారు. అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించి పెంటగాన్ డెల్టా దళం అరెస్టు చేసిన వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను ఆదివారం తెల్లారకముందే రాజధాని కారకస్ నుండి న్యూయార్క్‌కు తరలించారు. ఆ తర్వాత హెలికాప్టర్‌లో మన్‌హట్టన్‌కు తీసుకువెళ్ళారు. అక్కడే అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆయనను తమ కార్యాలయానికి తరలించింది. బ్రూక్లిన్‌లోని నిర్బంధ కేంద్రానికి తరలించారు.న్యూయార్క్‌లో విమానం దిగిన తర్వాత మదురో ఒంటికాలితో కుంటుతూ నడవడం కనిపించింది. ఆయన చేతికి సంకెళ్ళు ఉన్నాయి. కారకస్‌లో వారి నివాసం నుండి బలవంతంగా హెలికాప్టర్‌లో తీసుకువెళ్ళి అమెరికా యుద్ధనౌక ఎక్కించారు. ఆగమేఘాలపై ఆ యుద్ధనౌక భారత కాలమానం ప్రకారం శనివారం అర్థరాత్రి 12 గంటల నాటికి న్యూయార్క్‌కు చేరుకుంది. అక్కడి నుండి విమానంలో మదురోను తరలించారు. బ్రూక్లిన్ విమానాశ్రయంలో అమెరికా డెల్టా ఫోర్స్ సైనికులు మదురోకు అటూ ఇటూ కాపలాగా ఉండి బయటకు తీసుకువస్తున్న వీడియో దృశ్యాలను, ఫొటోలను అంతర్జాతీయ మీడియా ప్రదర్శించింది. విమానం దిగిన తర్వాత కూడా చేతులకు సంకెళ్ళతోనే మదురోను నడిపించి తీసుకువెళ్ళారుఆయనపై ప్రధానంగా 2020లో బనాయించిన పాత నార్కో టెర్రరిజం కేసుతోపాటు కొకైన్ ఎగుమతి కేసు, ప్రమాదకర, విధ్వంసకర మారణాయుధాలు పోగుచేసి ఉంచుకోవడం వంటి అనేక కేసులపై న్యూయార్క్ కోర్టులో పూర్తిస్థాయి విచారణ జరిపి మదురోకు శిక్ష విధిస్తామని అమెరికా అటార్నీ జనరల్ పామ్ బాండీ చెప్పారు.1999 నుండి వెనిజులాలో యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ వెనిజులా అధికారంలో ఉంది. తొలుత హ్యూగో ఛావెజ్ పేదరిక నిర్మూలన లక్ష్యంగా పనిచేశారు. తర్వాత సోషలిస్టు విప్లవాన్ని అమలు చేశారు. 2013లో ఛావెజ్ మరణానంతరం నికొలస్ మదురో అధ్యక్ష బాధ్యతలు తీసుకున్నారు. 2018లో ఆయన తిరిగి ఎన్నికయ్యారు.

# నిశితంగా పరిశీలిస్తున్నాం
(మొదటి పేజీ తరువాయి)

పిలుపునిచ్చింది. వెనిజులా దేశ ప్రజల శ్రేయస్సుకు భారతదేశం తన మద్దతును పునరుద్ఘాటించింది. యునైటెడ్ స్టేట్స్ మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన ఆరోపణలను వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో, అతడి భార్య లేడీ సిలియా ఫ్లోర్స్‌పై న్యూయార్క్‌లో మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన ఆరోపణలను మోపింది. అయితే యునైటెడ్‌స్టేట్స్ చర్యను ఖండిస్తూ వెనిజులా దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించి ంది. ‘వెనిజులాలో ఇటీవలి పరిణామాలు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. మారుతున్న పరిస్థితిని మేము నిశితంగా గమనిస్తున్నాం. వెనిజులా ప్రజల శ్రేయస్సు, భద్రతకు భారతదేశం తన మద్దతును పునరుద్ఘాటిస్తుంది’ అని ఎంఇఎ తెలిపింది. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని నిర్ధారించడం ద్వారా, చర్చలద్వారా శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని సంబంధీకులందరికీ న్యూఢిల్లీ పిలుపునిచ్చింది. మాదకద్రవ్యాల అక్రమరవాణాకు మదురో పాల్పడ్డాడని గట్టిగా ఆరోపించిన తర్వాత అమెరికా కారకాస్‌పై సైనిక దాడి చేసింది. అయితే వెనిజులా దేశాధినేత ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. కారకాస్‌లోని భారత రాయబార కార్యాలయం వెనిజులాలోని భారతీయ సమాజ సభ్యులతో సంప్రదింపులు జరుపుతోందని, వారికి సాధ్యమైనంత మేరకు అన్ని రకాల సహాయాన్ని భారతదేశం అందిస్తూనే ఉందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇక్కడ విడుదల చేసిన తన సంక్షిప్త ప్రకటనలో తెలియజేసింది. వెనెజువెలాకు అనవసరమైన ప్రయాణాల ను నివారించుకోవాలని శనివారం రాత్రి భారతదేశం తన పౌరులకు సూచించింది.

# వామపక్షాలు పిలుపు
(మొదటి పేజీ తరువాయి)

ప్రకటనలో అమెరికా చర్యను తీవ్రంగా ఖండించారు. వామపక్షపార్టీలైన తాము అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా, లాటిన్ అమెరికా ప్రజలకు సంఘీభావంగా ఐదు వామపక్ష పార్టీల అగ్రనాయకులు దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపును ఇచ్చారు. వెనిజులా నుండి వస్తున్న నివేదికల ప్రకారం...అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా, వారి దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో సమీకరించబడుతున్నారని సూచిస్తున్నాయన్నారు. అమెరికాదురాక్రమణ, దుష్ట చర్యలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు 5 వామపక్షపార్టీల తరపున హృదయపూర్వక మద్దతు, సంఘీభావాన్ని తెలియజేస్తున్నామని సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా సహా ఐదుగురు అగ్రనాయకులు తెలియజేశారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ప్రసంగంలో వెనిజులా చమురు నిల్వలను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారని, ఈ దురాక్రమణ వెనక ఉన్న నిజమైన ఉద్దేశాలను బయటపెట్టారని, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ఒక అడుగు ముందుకేసి క్యూబా, మెక్సికో వారి తదుపరి లక్ష్యం అవుతాయని హెచ్చరించారని వెల్లడించారు. యునైటెడ్ స్టేట్స్ జాతీయ భద్రతా వ్యూహం2025 విడుదలైన కొన్ని రోజుల తర్వాత వస్తున్న ఈ ప్రకటనలు సైనిక దాడులు చేయడం ద్వారానైనా అమెరికా సామ్రాజ్యవాదం యావత్ ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని విధించడానికి ప్రయత్నిస్తుందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. మొత్తం పశ్చిమ అర్ధగోళాన్ని తన పాలనా ప్రాంగణంగా భావిస్తున అమెరికా డొనాల్డ్ ట్రంప్ తన హక్కులను అమలుచేసే అప్రతిష్ఠపాలైన మన్రో సిద్ధాంతం సంబంధిత డొనాల్డ్ ట్రంప్ పరిణామాన్ని అమెరికా విధించాలనుకుంటోందని 5 వామపక్ష పార్టీల అగ్రనేతలు స్పష్టంచేశారు. లాటిన్ అమెరికా ప్రజలకు సంఘీభావంగా 5 వామపక్ష పార్టీలు ఇచ్చిన దేశవ్యాప్త నిరసనల పిలుపులో మనదేశంలోని శాంతి కాముకులు సామ్రాజ్యవాద వ్యతిరేకులు అందరూ పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించి ఈ నిరసనలో చురుకుగా పాల్గొనాలని డి.రాజా, ఎం.ఎ.బేబి, దీపాంకర్ భట్టాచార్య, మనోజ్ భట్టాచార్య, జి.దేవరాజన్ పిలుపునిచ్చారు. అమెరికా దురాక్రమణను ఖండిస్తున్న ప్రపంచవ్యాప్త దేశాల గొంతుకల్లో భారత ప్రభుత్వం కూడా చేరాలని, వెనిజులాకు దృఢంగా మద్దతు ఇవ్వాలని వామపక్ష అగ్రనాయకులు ఐదుగురు సంయుక్తం కోరారు.

# సమర్థంగా వాదించండి
(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ముంబయిలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సమర్థమైన వాదనలు వినిపించాలని సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి న్యాయ నిపుణులకు సూచించారు. అవసరమైన అన్నిఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఇరిగేషన్ అధికారులను వారు అప్రమత్తం చేశారు. అనుమతులు లేకుండా పోలవరం నుంచి బనకచర్ల లేదా నల్లమలసాగర్‌కు లింక్ చేసేందుకు ఎపి ప్రభుత్వం చేపడుతున్న విస్తరణ పనులను నిలిపివేయాలని కోరుతూ ఇటీవలే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. తక్షణమే ఈ పనులను పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఆపేవిధంగా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయాలని, ప్రాజెక్ట్‌కు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించింది. మొదటిగా ఆమోదించిన మేరకే పోలవరం ప్రాజెక్టు పనుల స్వరూపం ఉండాలని, విస్తరణ పనులు చేపట్టడం చట్టబద్ధం కాదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్ట్‌లో దాఖలు చేసిన పిటిషన్‌లో స్పష్టం చేసింది. తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నల్లమలసాగర్ ప్రాజెక్టు ప్రీ ఫిజిబిలిటీ రిపోర్టులను కేంద్ర ప్రభుత్వం పరిశీలిండటం సమంజసం కాదని అభ్యంతరం వ్యక్తం చేసింది. అందుకు సంబంధించి కేంద్ర జల సంఘం, కేంద్ర జల మంత్రిత్వ శాఖ, గోదావరి నీటి యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలివ్వాలని కోరింది. కేంద్ర జల సంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా ఎపి ప్రభుత్వం డిపిఆర్ తయారీకి సిద్ధపడుతోందని, ఈ ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు ఇవ్వకుండా, కేంద్రం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందించకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆ పిటిషన్‌లో ప్రస్తావించింది.

# మేమే పాలిస్తాం
(మొదటి పేజీ తరువాయి)

తెచ్చుకున్నారు. అమెరికా కంపెనీలు వెనిజులా వెళతాయి,అక్కడే వ్యాపారం చేస్తాయి, చమురును వెలికితీయడం, ఉత్పత్తి చేయడంతోపాటు అమ్మకాలు చేస్తాం, వివిధ దేశాలకు వెనిజులా చమురు విక్రయిస్తాం, ఆ సొమ్మును వెనిజులాకోసం ఖర్చుపెడతాం, ఆ దేశాన్ని తీర్చిదిద్దుతాం, ‘మేక్ వెనిజులా గ్రేట్ ఎగైన్’గా చేస్తాం, అమెరికా పాలనలో వెనిజులా ప్రజలు చాలా హ్యాపీగా ఉండబోతున్నారు, వారి సమస్యలన్నీ తీరిపోతాయి’’ అన్నారు. ఐతే ఎంత కాలం పాలన అమెరికా చెప్పుచేతల్లో ఉంటుందో ఖండితంగా చెప్పలేదు. ‘‘రాజకీయ పరివర్తన జరిగే వరకూ వెనిజులాను తామే నడిపిస్తామన్నారు. ‘‘సురక్షితమైన, వివేకవంతమైన పరిపాలన చేయగల రాజకీయ పరివర్తన వచ్చేవరకూ వెనిజులా మా పాలనా బాధ్యతలు మేమే చూసుకుంటాం, అవసరమైతే చాలా పెద్ద దాడులు చేయడానికి కూడా అమెరికా సిద్ధంగా ఉంది’’ అని స్పష్టం చేశారు. ఇన్నాళ్ళుగా వెనిజులా మాదక ద్రవ్యాలను అక్రమంగా అమెరికాలోకి రవాణా చేయడంవల్ల తమ దేశం నష్టపోయిందని, సగటును ఏటా డ్రగ్స్‌వల్ల 25,000 మరణిస్తున్నారని ఆరోపించారు.

### ఆపరేషన్ ‘అబ్సల్యూట్ రిసాల్వ్’ 150 విమానాలతో దాడి చేశాం

నికొలస్ మదురో ఇంటిపై దాడిచేసి అరెస్టు చేసేందుకు తమ సైనిక జనరల్స్ కొన్ని నెలలుగా కష్టపడి పక్కా ప్రణాళిక రూపొందించారని ట్రంప్ చెప్పారు. ఈ ఆపరేషన్‌కు ‘అబ్సల్యూట్ రిసాల్వ్’అని నామకరణం చేశారు. ఆ ప్రణాళిక మేరకు విజయవంతంగా మదురోను అరెస్టు చేసి న్యూయార్క్‌కు తరలించామని చెప్పారు. ఈ దాడికోసం 150 విమానాలను ఉపయోగించామని, కానీ ఒకే ఒక్క హెలికాప్టర్ ధ్వంసం కావడం మినహా అమెరికా డెల్టా దళానికి ఎలాంటి నష్టం కలగలేదని, తమ సైన్యం వైపు ఎవరికీ గాయాలు లేదా మరణాలు సంభవించలేదన్నారు. మదురో తన నివాసాన్ని దుర్భేధ్యమైన కోటలా తయారు చేసుకున్నారని, ఆ వివరాలన్నీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి దాడి చేసి చాలా తక్కువ సమయంలో డెల్టా దళం ఆయన పడకగదిలోకి ప్రవేశించి వారిద్దరినీ బంధించి ఆపరేషన్ పూర్తిచేశామన్నారు. ఈ దాడి ప్రక్రియ ప్రారంభం నుండి మదురో దంపతులను బంధించి అమెరికా యుద్ధనౌకలోకి తరలించేవరకూ మొత్తంగా రెండు గంటల్లో ఆపరేషన్ అబ్సల్యూట్ రిసాల్వ్‌ను పూర్తిచేశామని చెప్పారు. భూతలం,గగనతలం, సముద్ర తలాలమీదుగా మూడు వైపుల నుండీ వెనిజులాను ముట్టడించామని, ఈ ఆపరేషన్ కోసం కారకస్ నగరాన్ని పూర్తిగా తమ అధీనంలోకి తెచ్చుకుని స్తంభింపజేశామన్నారు.

### అమెరికా జోక్యం ఎక్కడెక్కడంటే...

యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా అనేక దశాబ్దాలుగా లాటిన్ అమెరికా దేశాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలను కుప్పకూల్చివేస్తూ వచ్చింది. వాటి అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నది. 1965లో వామపక్షాల సారథ్యంలో కొనసాగుతున్న డొమినికన్ రిపబ్లిక్‌లో జువాన్ బాష్ ప్రభుత్వాన్ని కూల్చివేసింది. అమెరికా అనుకూల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. డొమినికన్ రిపబ్లిక్ కూడా మరో క్యూబాగా మారి పక్కలో బల్లెంలా తయారవుతుందని అమెరికా భయపడింది. అంతకుముందు 1961–63 మధ్యకాలంలో ఈక్వెడార్‌లో జోక్యం చేసుకుంది. సైనిక కుట్రకు పాల్పడింది. దీంతో ఈక్వెడార్ క్యూబాకు దూరంగా జరిగి అమెరికాకు సన్నిహితమైంది. బొలీవియాలో కూడా 1964 నుండి 1970 వరకూ సిఐఎ మద్దతుతో ఎన్నికైన ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కుట్రలు చేసింది. 1960 నుండి 1973 వరకూ 13 ఏళ్ళలో ఉరుగ్వేలో వామపక్ష గ్రూపులను అమెరికా భద్రతా సంస్థలు, గూఢచారి వర్గాలు అణచివేశాయి. చిలీలో అధ్యక్షుడు సాల్వడార్ అలెండీ ప్రభుత్వాన్ని సిఐఎ అక్కడి ప్రతిపక్షం ద్వారా కుట్రచేసి కూల్చివేసింది. అర్జెంటైనాలో 1976లో సైనిక పాలకులకు అమెరికా మద్దతు ఇచ్చింది. ఎల్‌సాల్వడార్‌లో 1980లో అంతర్యుద్ధానికి మద్దతు ఇచ్చింది. 1980వ దశకంలో నికరాగువాలో శాండినిస్టా ప్రత్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటుదారులకు మద్దతు ఇచ్చింది. 1983లో గ్రెనడాలో జోక్యం చేసుకుని కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూల్చివేసి అమెరికా అనుకూల ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. 1989లో పనామాలో పనామా కాలువపై ఆధిపత్యం సంపాదించేందుకు అక్కడి ప్రభుత్వాన్ని కూల్చివేసింది.

## పశ్చిమార్థగోళంలో కొత్త ‘డోన్రో సిద్ధాంతం’

పశ్చిమార్థగోళం (న్యూ వరల్డ్..ఉత్తర–దక్షిణ అమెరికాలు)లో అమెరికా అధికారానికి తిరుగులేదని, అమెరికా అధికారాన్ని ఇక మళ్ళీ ప్రశ్నించడానికి అవకాశం లేదని వెనిజులాపై దాడి నిరూపించిందని డొనాల్డ్ ట్రంప్ ఫ్లోరిడా పత్రికాగోష్ఠిలో అన్నారు. ఈ దాడి మన్రో సిద్ధాంతానికి దగ్గరగా ఉందన్నారు. ట్రంప్ దానిని డోన్రో సిద్ధాంతంగా మార్చారు. ట్రంప్ మాటలు, ఆయన సమాధానాల తీరు చూస్తే ఆయన వెనిజులా సార్వభౌమాధికారం గురించి, వెనిజులా ప్రజాస్వామ్య భవిష్యత్తు–అంతర్జాతీయ నిబంధనల గురించి ఏ మాత్రం పట్టింపు లేకుండా కేవలం చమురు సంపద గురించి మాత్రమే ఆం దోళన చెందుతున్నట్లు కనిపించిందని బిబిసి కరస్పాండెంట్ టామ్ బాటెమన్ వ్యాఖ్యానించారు. పశ్చిమార్థగోళంలో ఇప్పుడు జేమ్స్ మన్రో సిద్ధాంతం పో యింది. దాని బదులు ‘డోన్రో సిద్ధాంతం’ వచ్చింది! అదెలాగంటే, 1823 డి సెంబరు రెండో తేదీన అమెరికా ఐదో అధ్యక్షుడు జేమ్స్ మన్రో ఆ దేశ కాంగ్రెస్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తూ, యూరప్ దేశాలకు స్పష్టమైన హెచ్చరిక చేశారు. వారు పశ్చిమార్థగోళంపై కన్ను వేయకూడదని, ఈ ప్రాం సంరక్షణ, పెత్తనం, ఆధిపత్య బాధ్యతలన్నీ అమెరికావేననీ ప్రకటించారు. దీనినే అప్పటినుండీ మన్రో డాక్ట్రిన్‌గా పిలుస్తున్నారు. 19వ శతాబ్దంలో యూరోపియన్ శక్తుల ప్రభావం నుండి విముక్తి పొందడంకోసం 19వ శతాబ్దంలో అమెరికా మన్రో సిద్ధాంతాన్ని విదేశాంగ విధానంగా స్వీకరించింది. కానీ ఇప్పుడు ట్రంప్ ఈ మన్రో సిద్ధాంతాన్ని తన డొనాల్డ్ ట్రంప్ పేరుమీద ‘‘డోన్రో’’ సిద్ధాంతంగా మార్చారు. 1904లో యూరోపియన్ రుణ దాతలు లాటిన్ అమెరికా దేశాల ను బెదిరింపులకు గురిచేసినప్పుడు అమెరికా అధ్యక్షుడు థియోడర్ రూజ్‌వెల్ట్ మన్రో సిద్ధాంతాన్ని విస్తరించారు. తమ అధిపత్యం తెచ్చే యత్నం చేశారు. ఆ తర్వాత హైతీ, నికరాగువా, డొమినికన్ రిపబ్లిక్‌లలో అమెరికా ఈ సిద్ధాంతం పేరుతో జోక్యం చేసుకుంది.

# శరవేగం
(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయాల కార్యకలాపాల విభజన ప్రక్రియ పూర్తయ్యాక ప్రభుత్వం నుండి తుది గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది. తర్వాత పూర్తిస్థాయిలో స్వతంత్ర కార్పొరేషన్‌లుగా చట్టబద్ధత పొందుతాయి. హైదరాబాద్ నగరం 650 చ.కి.మీ నుండి 2,053 చ.కి.మీకి తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీక్యూర్) ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించిన విషయం తెల్సిందే. అయితే ఈ ప్రాంతాన్ని మొత్తం మూడు మున్సిపల్ కార్పొరేషన్‌లుగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. అందులో భాగంగానే ఇటీవల చర్యలు చేపట్టింది. అందుకు అనుగుణంగా జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బందిని మూడు కార్పొరేషన్‌లకు విభజన ప్రక్రియను చేపట్టారు. మూడు జోన్‌లకు ఒక అదనపు కమిషనర్ చొప్పున నియమించగా, ఆయా అధికారులకు జోన్‌ల పరిపాలన బాధ్యతలపై కమిషనర్ కర్ణన్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా పూర్తి స్పష్టత ఇచ్చారు. కేటాయించిన జోన్‌లలో పరిపాలనను చక్కదిద్దడం, జోనల్ కమిషనర్‌లతో సమన్వయంగా పనిచేయడం వారి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఆయా జోన్‌లకు పరిపాలన, ఆర్థిక, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలకు అధికారులు, సిబ్బంది బదిలీలు చేపట్టారు.

### మూడు గ్రేటర్ కార్పొరేషన్ల ఏర్పాటుకు కసరత్తు

ప్రస్తుతం జిహెచ్‌ఎంసిలో 12 జోన్లు, 60 సర్కిళ్లు ఉన్నాయి. పునర్వ్యవస్థీకరణ అనంతరం జిహెచ్‌ఎంసి పరిధి శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, ఖైరతాబాద్, గోల్కొండ, సికింద్రాబాద్ జోన్‌లకు పరిమితం కానుంది. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లతో గ్రేటర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిసిఎంసి), మల్కాజిగిరి, ఎల్.బి. నగర్, ఉప్పల్ జోన్‌లతో గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (జిఎంఎంసి) ఏర్పాటు కానున్నట్లు సమాచారం. జిసిఎంసికి అదనపు కమిషనర్ సృజనను, జిఎంఎంసికి అదనపు కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కమిషనర్లుగా నియమించే అవకాశముందని మున్సిపల్ శాఖలో ప్రచారం జరుగుతోంది. పాలకమండలి పూర్తయిన అనంతరం దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది.

### నిర్మాణ అనుమతులు అక్కడి నుంచే

నూతన గ్రేటర్ కార్పొరేషన్‌ల పరిధిలో టౌన్ ప్లానింగ్ వ్యవహారాల నిర్వహణను డైరెక్టర్ హోదాలోని ఇద్దరు సీనియర్ అధికారులకు అప్పగిస్తూ కమిషనర్ కర్ణన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై ఆయా జోన్‌ల పరిధిలోని భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తులు సంబంధిత అధికారుల ద్వారానే కమిషనర్ అనుమతికి వెళ్లనున్నాయి. కె. శ్రీనివాస్ (చీఫ్ సిటీ ప్లానర్) : శంషాబాద్, రాజేంద్రనగర్, గోల్కొండ, చార్మినార్, ఖైరతా బాద్, సికింద్రాబాద్ పర్యవేక్షించనున్నారు. బి. వెంకన్న (డైరెక్టర్, టౌన్ ప్లానింగ్): శేరిలింగం పల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్. బి. ప్రదీప్ కుమార్ (డైరెక్టర్, టౌన్ ప్లానింగ్): మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్.బి. నగర్ పర్యవేక్షిస్తారు.

### జోనల్, డిప్యూటీ కమిషనర్లకు కీలక అధికారాలు

జిహెచ్‌ఎంసి చట్టం1955లోని సెక్షన్ 119 ప్రకారం ఆస్తి పన్ను అంచనాలు, సవరణలు, మ్యుటేషన్‌లు, మినహాయింపులు వంటి సేవలకు సంబంధించిన అధికారాలను నిర్దిష్ట పరిమితులు, షరతులతో జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వచ్చాయి.

### భారీ బదిలీలు – సిబ్బంది పునర్వ్యవస్థీకరణ

పునర్వ్యవస్థీకరణలో భాగంగా జిహెచ్‌ఎంసిలో భారీగా ఇంజనీర్ల బదిలీలు చేపట్టారు. ఎఈ, ఎఈఈ, డిఈ, డిఈఈలతో పాటు క్వాలిటీ కంట్రోల్ సెల్ ఇంజనీర్లను 12 జోన్‌లలో అవసరమైన ప్రాజెక్టులు, నిర్వహణ విభాగాల్లో నియమించారు. ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ (పరిపాలన)గా ఉన్న కె. వేణుగోపాల్‌ను మల్కాజిగిరి, ఎల్.బి.నగర్, ఉప్పల్ జోన్‌లకు జాయింట్ కమిషనర్ (అడ్మినిస్ట్రేషన్, ఫైనాన్స్)గా బదిలీ చేశారు. గీతారాధికను కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లకు జాయింట్ కమిషనర్‌గా నియమించారు.

### 20 శాతం ఖాళీల భర్తీకి చర్యలు

విలీనంతో 300 డివిజన్ల పరిధిలోని నగరంలో సుమారు 20 శాతం సిబ్బంది కొరత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్య విభాగాల్లో ఖాళీలు ఎక్కువగా ఉన్నాయని అధికారులు తెలిపారు. మరో 1,500 మంది ఉద్యోగులు అవసరమని అంచనా వేస్తూ, ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

### మూడు కార్పొరేషన్‌ల విభజన ఇలా..

ప్రస్తుతం ఉన్న 12 జోన్‌లను మూడు ప్రధాన కార్పొరేషన్లుగా విభజన
**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) :** శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, ఖైరతాబాద్, గోల్కొండ, సికింద్రాబాద్ జోన్‌లు.
**గ్రేటర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిసిఎంసి) :** కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లు.
**గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (జిఎంఎంసి) :** మల్కాజిగిరి, ఎల్.బి.నగర్, ఉప్పల్ జోన్‌లు.

### అధికారుల నియామకం – అధికారాల బదిలీ

అదనపు కమిషనర్లు సృజన (జిసిఎంసి), వినయ్ కృష్ణారెడ్డి (జిఎంఎంసి)లకు ఆయా ప్రాంతాల బాధ్యతలు అప్పగించారు.
**నిధులు, పరిపాలన :** జాయింట్ కమిషనర్లుగా కె. వేణుగోపాల్ (మల్కాజిగిరి), గీతారాధిక (కూకట్‌పల్లి)లను నియమించారు.

# అలసత్వమేలా?
(మొదటి పేజీ తరువాయి)

సస్పెన్షన్, రికవరీ సహా కఠిన చర్యలుంటాయని స్పష్టం చేశారు. విద్యుత్, ఆర్అండ్‌బి, ఐటిడిఏ సహా అన్ని శాఖల పనుల పురోగతిపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జాతర అంటే చిన్న కార్యక్రమం కాదని, ఇది రాష్ట్ర గౌరవమన్నారు. 18వ తేదీ సిఎం పర్యటనకు ముందే అన్ని ఏర్పాట్లు పూర్తిగా సిద్ధంగా ఉండాలని, 15 నుండి డెకరేషన్ పనులు మొదలై జాతర కాలమంతా మెరిసేలా ఉండాలని స్పష్టం చేశారు. జాతర కాలంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా విద్యుత్, నీరు, శానిటేషన్ వంటి అన్ని సౌకర్యాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. 4వేల మందితో శానిటేషన్ సిబ్బందిని రంగంలోకి దించాలని సూచించారు. మేడారం ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా జరిగే ఈ వేడుకలో ప్రభుత్వం ప్రతిష్టకు భంగం కల్గకుండా అధికారులు పూర్తిగా అలర్ట్‌గా పనిచేయాలని మంత్రి హెచ్చరించారు.

# డెల్సీ రోడ్రిగ్జ్
(మొదటి పేజీ తరువాయి)

చక్కదిద్దుకుంటాయని, అంతిమ విజయం వెనిజులాదేనని ఆమె అన్నారు. అమెరికా చర్యలను ఆమె ఖండించారు. వెంటనే మదురోను, ఆయన భార్య ఫ్లోరెస్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ చట్టాలను ట్రంప్ ఉల్లంఘించారని, దేశ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించారని ఆమె అన్నారు. ఈ దేశానికి ఉన్నది ఒకే ఒక్క అధ్యక్షుడని, ఆయనే నికొలస్ మదురో అనీ ఆమె ప్రకటించారు. ఈ ప్రకటన చేసిన సమయంలో ఆమె చుట్టూ ఉన్నతస్థాయి వెనిజులా అధికారులు, సైనిక జనరల్స్ ఉన్నారు. ‘‘వారు మాపై దాడి చేస్తే చేయవచ్చు, కానీ మమ్మల్ని విచ్ఛిన్నం చేయలేరు, విడదీయలేరు’’ అని వెనిజులా రక్షణ మంత్రి జనరల్ వ్లాదిమిర్ పడ్రినో లోపెజ్ అన్నారు. వెనిజులా హోంమంత్రి డియోస్‌దాడో కాబెల్లో మాట్లాడుతూ, ప్రజలు వీధుల్లోకి రావాలనీ, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవాలని పిలుపు ఇచ్చారు. అదేసమయంలో ట్రంప్ కూడా మాట్లాడుతూ, వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలుగా ఆ దేశ న్యాయస్థానం నియమించిన రోడ్రిగ్జ్‌తో అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో సంభాషణలు చేస్తున్నారన్నారు. అమెరికా కోసం ఏదైనా చేయడానికి, అమెరికా అడిగిన ఏదైనా ఇవ్వడానికి ఆమె సంసిద్ధత వ్యక్తం చేశారని ట్రంప్ మార్ –ఎ–లాగో ఎస్టేట్‌లో పాత్రికేయులకు చెప్పారు. వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు మారియా కొరినా మచాడోతో తాను మాట్లాడలేదని, పైగా ఆమెకు దేశంలో గౌరవంగానీ, అధ్యక్ష పదవి చేపట్టేందుకు తగిన మద్దతు లేదన్నారు. ఆమెకు 2025 నోబెల్ శాంతి బహుమతి ఇటీవలే లభించింది. కానీ వెనిజులా ఉపాధ్యక్షురాలి తీరు ట్రంప్ వ్యాఖ్యలకు భిన్నంగా ఉంది. ఆమె దేశానికి, మదురోకు విధేయత ప్రకటించారు. రోడ్రిగ్జ్ వెనిజులా ప్రభుత్వ టెలివిజన్ తెరపై కనిపించి తమ అధ్యక్షుడు ఎక్కడ ఉన్నారు? సజీవంగా ఉన్నారా?లేదా? అని ప్రశ్నించారు. ఈ దేశానికి నికొలస్ మదురో ఒక్కడే అధ్యక్షుడని ఆమె వ్యాఖ్యానించారు. 2018 నుండి ఆమె వెనిజులా ఉపాధ్యక్షురాలి పదవిలో ఉన్నారు. అంతకుముందు హ్యూగో ఛావెజ్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు కూడా రోడ్రిగ్జ్ అనేక పదవులు నిర్వహించారు. సమాచారమంత్రిగా, విదేశాంగమంత్రిగా, రాజ్యాంగ అసెంబ్లీ అధ్యక్షురాలుగా తొలుత ఆమె బాధ్యతలు నిర్వహించారు.ప్రస్తుతం దేశ ఉపాధ్యక్షురాలుగా, యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ వెనిజులా జాతీయ నాయకురాలు హోదాలో ఉంటూ తాత్కాలికంగా దేశాధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టారు. మానవ హక్కుల ఉల్లంఘన పేరుతో గతంలో రోడ్రిగ్జ్‌పై అమెరికా, యూరోపియన్ యూనియన్, కెనడా దేశాలు ఆంక్షలు విధించాయి. ప్రస్తుతం దేశాన్ని నడిపించగల సత్తా రోడ్రిగ్జ్‌కు మాత్రమే ఉంది. సైనిక అధికారులు అమెరికా రక్షణ దళం దాడుల నుండి కోలుకున్నారు. తిరిగి వారి విధుల్లో కొనసాగుతున్నారు. తక్షణం వెనిజులాను అదుపులోకి తీసుకుని అమెరికా నేరుగా పరిపాలించే సంకేతాలు కనిపించడం లేదు. ఈ దశలో రోడ్రిగ్జ తన ప్రతిభాపాటవాలు కనబరిచి దేశంలో శాంతి, సాధారణ పరిస్థితులను తీసుకురావాల్సి ఉంది.

### వెనిజులాలో నిరసన ప్రదర్శనలు: అమెరికా జెండాలు దగ్ధం

అధ్యక్షుడు మదురోను బందీగా అమెరికాకు తరలించడంతో వెనిజులాలో పలుచోట్ల నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. అల్లర్లు చెలరేగాయి. ప్రజలు గుంపులుగా చేరి అమెరికా పతాకాలను దగ్ధం చేశారు. రక్షణమంత్రి కాబెల్లో పిలుపు తో ప్రజలు ధైర్యంగా వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు చేశారు. కారకస్ మేయర్ కార్మెన్ మెలెన్‌డెజ్ కూడా సామాన్య ప్రజలమధ్యకు వచ్చి నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. తక్షణం మదురో దంపతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ‘‘మదురో మళ్ళీ వస్తారు, ప్రజలు తలెత్తి బతుకుతారు’’ అని ఆయన నినాదాలు చేశారు. మదురో తిరిగి రావాలని ప్రజలు నినాదాలు చేశారు. ‘‘మేం ఇక్కడే ఉన్నాం మదురో, నువ్వు తిరిగి రావాలి, నీకోసం ఎదురు చూస్తున్నాం, నువ్విక్కడ ఉంటే మేం ఉంటాం, నువ్వే మా నాయకుడివి’’ అంటూ ప్రజలు నినాదాలు చేశారు. కారకస్ ఆ పరిసరాల్లో, అనేక రాష్ట్రాలలో యునైటెడ్ సోషలిస్ట్‌పార్టీ బలంగా ఉన్న ప్రాంతాల్లో ప్రదర్శనలు చెలరేగాయి. ప్రజలు శాంతిగా ఉండాలని మరోవైపు తాత్కాలిక ప్రభుత్వం విజ్ఞప్తులు చేస్తోంది. కానీ చాలా మంది ప్రజలు అమెరికా దాడులతో భీతావహులయ్యారు. ఇంకా వారంతా ఇళ్ళకే పరిమితమైపోయారు. దేశంలో 2.90 కోట్లమంది జనాభా ఉన్నారు. రేపు ఏం జరుగుతుంది? అనే ప్రశ్నార్థకాలమధ్య ప్రజలు ఉత్కంఠతో కాలం గడుపుతున్నారు. ట్రంప్ చర్య వెనిజులా ప్రజలకు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల్లో తప్పేముంది?

### కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ సిఎం కె.చంద్రశేఖరరావు తోలుతీస్తా అంటే ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నీ నాలుక కోస్తా అన్నడంలో తప్పేముందని కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి ప్రశ్నించారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కృష్ణా జలాలపై సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు సభలో పూర్తిగా వాస్తవాలు మాట్లాడరన్నారు. హరీష్‌రావు ప్రజెంటేషన్ పూర్తిగా బోగస్ అని ఆయన పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉంటె ఆంధ్రోళ్ళ నీళ్ళ దోపిడీ గుర్తుకు రాదు కాని మీరు ప్రతిపక్షంలో ఉంటే వాళ్ల దోపిడీ గుర్తుకువస్తుందన్నారు. చంద్రబాబు హయాంలో కెసిఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్రోళ్ళ పంచాయతీ లేదని, కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడు ఆంధ్రోళ్ళ పంచాయతీ లేదుగాని వారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఆంధ్రోళ్ళ పంచాయతీ తెరమీదకు వస్తుందని మతలబు ఏమిటో అన్నారు. కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడు సిఎంహోదాల్లో ఉన్న చంద్రబాబు, జగన్‌మోహన్ రెడ్డిలను కలిసినా తప్పులేదు కానీ చంద్రబాబు రేవంత్ రెడ్డి సిఎం హోదాలో ఇద్దరు కలిస్తే తప్పు ఏలా అవుతుందో చెప్పు హరీష్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# నూతన కోడ్‌లతో కాంట్రాక్ట్ విధానం రద్దు!

### కోర్టులలోనూ న్యాయం జరిగే పరిస్థితులండవు
### ఎఐటియుసి జాతీయ కార్యదర్శి సి.శ్రీకుమార్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, ఆ చట్టాల స్థానంలో ప్రవేశపెట్టిన నూతన నాలుగు కోడ్‌లు అమలులోనికి వస్తే 43.2 శాతం కార్మికులకు కార్మిక చట్టాలు వర్తించబోవని, తద్వారా వారు తమ హక్కులను కోల్పోయే ప్రమాదం ఉన్నదని ఎఐటియుసి జాతీయ కార్యదర్శి, కేంద్ర, రాష్ట్ర పబ్లిక్ సెక్టార్ యూనియన్ల జాతీయ నాయకులు సి.శ్రీకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను పాలకులు, యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తే, వారు కనీసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తేనైనా న్యాయం జరిగేదని, పర్మినెంట్‌కు అవకాశాలు ఉండేదని, కానీ నూతన కోడ్‌ల వల్ల కాంట్రాక్ట్ విధానామే రద్దు కాబోతుందని, ఈ కోడ్ ఆధారంగా న్యాయస్థానాల్లో కూడా కార్మికులకు న్యాయం జరిగే పరిస్థితులు ఉండబోవని వివరించారు. నాలుగు కోడ్‌ల వల్ల జరిగే అన్యాయాలు, కార్మిక వ్యతిరేక చర్యల పట్ల క్షేత్రస్థాయి కార్మికులకు అవగాహన పెంచాలని, అందుకు సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించుకోవాలని, అదే సమయంలో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా నాలుగు కోడ్‌ల రద్దుకు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న 'నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని' డిమాండ్ చేస్తూ ఎఐటియుసి రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్, ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్ అధ్యక్షత వహించగా శ్రీకుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సులో ఎఐటియుసి రాష్ట్ర ఇన్‌చార్జ్ వి.ఎస్.బోస్, ఎఐటియుసి సీనియర్ నాయకులు డాక్టర్ .బి.వి.విజయలక్ష్మి , ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్, ఉపప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, ఉపాధ్యక్షులు వి.చంద్రయ్య, భూమయ్య, డిఫెన్స్ ఉద్యోగుల సంఘం నాయకులుఎ.వి.రావు, శ్రామిక మహిళా ఫోరం కన్వీనర్ పి.ప్రేంపావని, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శులు బి.వెంకటేశం, నందూరి కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకుమార్ మాట్లాడుతూ ఇప్పటికే కేంద్రంలో 13లక్షల ఉద్యోగాలు, ప్రభుత్వ రంగాలలో 10లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కొత్త కోడ్‌లతో వీటిని భర్తీ చేసే అవకాశాలు లేవని, తద్వారా రిజర్వేషన్లను పొందుతున్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు తీవ్ర నష్టం జరగబోతుందని తెలిపారు. 'కోడ్' అమలులోనికి వచ్చిన తర్వాత భవిష్యత్తులో కొత్త నియామకాలు జరగబోవని విమర్శించారు. ఎఐటియుసి వందేళ్ల పోరాటంలో అనేక కార్మిక చట్టాలను సాధించిందని, వారికి ఉద్యోగ భద్రతను, రక్షణను కల్పించిందని, అలాంటి కార్మిక చట్టాలపైన పార్లమెంట్‌లో ఎటువంటి చర్చ చేయకుండానే, కేవలం కేంద్ర మంత్రి వర్గ నిర్ణయం ద్వారా రద్దు చేశారని, వాటి స్థానంలో నాలుగు కోడ్‌లను ప్రవేశపెట్టారని దుయ్యబట్టారు. నాలుగు కోడ్‌ల వల్ల కార్మికులకు జరిగే నష్టాలు, సమస్యలపై కనీసం బిజెపి ఎంపిలకు కూడా అవగాహన లేదన్నారు. కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్ రద్దు అధికారాన్ని కూడా పొందుపర్చారని, తద్వారా ఆ సంఘాన్ని రద్దు చేస్తే, ఇక కార్మిక సంఘమే ఉండబోదన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు కోడ్‌లు కార్మిక సంఘాలకు ఒక పెద్ద సవాలుగా నిలిచిందని, దీనిని రద్దు చేసేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని శ్రీకుమార్ పిలుపునిచ్చారు. వి.ఎస్.బోస్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక, పారిశ్రామిక అంశాలలలో అదానీ,అంబానీ లాంటి పారిశ్రామిక వేత్తలు, రాజకీయంగా ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర ప్రభుత్వాన్ని నడిపిస్తోందని విమర్శించారు. ఎం.డి.యూసుఫ్ మాట్లాడుతూ అనేక పోరాటల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేశారని, మహిళలకు రాత్రిపూట కూడా డ్యూటీలు వేస్తున్నారని మండిపడ్డారు. ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ కార్పొరేట్‌కు అనుకూలంగా నాలుగు కోడ్‌లను ప్రవేశపెట్టారని విమర్శించారు.

## కెటిఆర్‌లో పరాకాష్టకు చేరిన అహంకారం

### టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడు కె.తారక రామారావులో అహంకారం పరాకాష్టకు చేరిందని, వారిని ప్రజలే తరిమి కొట్టే సమయం అసన్నామైందని టిపిసిసి అధ్యక్షులు ఎంఎల్‌సి బి. మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. బంగారు తెలంగాణను భ్రష్టు పట్టించిన భస్మాసుర సైన్యం బిఆర్ ఎస్ నేతలదని ఎద్దేవా చేశారు. ఉరి తీయడం అంటే తప్పు చేసిన వారికి శిక్ష వేయడమని, ఎన్నో ఆశలతో కోట్లాది తెచ్చుకున్న తెలంగాణను బిఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురి చేసింది కాబట్టి వారిని శిక్షించాలన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల ప్రజా పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి దిశలో సాగుతుందని తెలిపారు. అందుకే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ విజయం సాధించి ప్రజాదరణ పొందిందన్నారు. కాంగ్రెస్ చేసిన రైతు రుణ మాఫీ, రైతు భరోసా, మహిళలకు ఫ్రీ బస్, ఉచిత కరెంట్, సబ్సిడి గ్యాస్, సన్న బియం వంటి సంక్షేమ పథకాలు అమలు, రికార్డ్ స్థాయిలో ఉద్యోగాలు ఇచ్చిన విషయం కెటిఆర్‌కు కనిపించడం లేదా అన్ని ప్రశ్నించారు. కవిత వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పి, ఆ తరువాత కాంగ్రెస్ గురించి మాట్లాడాలన్నారు. రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన బిఆర్‌ఎస్‌ను ప్రజలు అసెంబ్లీ, లోకసభ ,పంచాయతీ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో శిక్షించినా వారు మాత్రం మారడం లేదని తెలిపారు.

### ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు

# 'టెట్' నుంచి మినహాయింపు ఇవ్వాలి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు 'టెట్' నుంచి మినహాయింపు ఇవ్వాలని, పార్లమెంటులో చట్టసవరణ చేయాలని ఆల్ ఇండియా సెకండరీ టీచర్స్ ఫెడరేషన్ (ఎఐఎస్‌టిఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందం గౌడ్,ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ డిమాండ్ చేశారు. ఈ అంశంపైన ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్ ఆర్గనైజేషన్స్ (ఎఐజెఎసిటిఒ) అధ్వర్యంలో ఉద్యమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు.రాజస్థాన్ రాష్ట్ర రాజధానిజైపూర్‌లో ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశం వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నరసింహారెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది.

ఈ సమావేశంలో వివిధ రాష్ట్రాల నుండి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సదానందంగౌడ్, జుట్టు గజేందర్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం అమలు తేదీకి ముందే నియమితులైన ఉపాధ్యాయులు రెండేళ్లలో టెట్ పాస్ కావాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ వేయాలని అన్నారు. జాతీయ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ నిర్లక్ష్యం వల్లనే సుప్రీం కోర్ట్‌లో ఇటువంటి తీర్పు వచ్చిందని వారు అభిప్రాయపడ్డారు. తీర్పు వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నదని, దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని వారు విమర్శించారు. టెట్‌పై కొందరు ఎంపిలు పార్లమెంటులో ప్రస్తావించినప్పటికి ఫలితం లేదన్నారు. నాయకులు పరమేశ్, సాబెర్ అలి, పున్న గణేష్, శ్రీశైలం, శ్రీధర్ పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అన్నలా తోడుంటా

### సంక్షేమ శాఖ మంత్రి
### అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దివ్యాంగులకు అన్నలా తోడుంటానని ఎస్‌సి, ఎస్‌టి, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ భరోసా ఇచ్చారు. లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రి ఘనంగా నివాళులు అర్పించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ అందులకు మాత్రమే కాదు, సమాజానికే వెలుగు చూపిన మహనీయుడని పేర్కొన్నారు. అంధత్వాన్ని శాపంగా కాకుండా అవకాశంగా మార్చిన వ్యక్తి బ్రెయిలీ అని, ఆయన ఒక వ్యక్తి కాదని ఒక ఆలోచన, ఒక ఉద్యమమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుందని మంత్రి తెలిపారు. తాను శాఖ బాధ్యతలు స్వీకరించి ఆరు నెలలు అవుతోందని, ఈ కాలంలో దివ్యాంగుల సమస్యలపై నిరంతర దృష్టి పెట్టి పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నానని చెప్పారు. ప్రస్తుతం పదవ తరగతి వరకే బ్రెయిలీ పుస్తకాలు అందుబాటులో ఉండటంతో అనేక మంది దివ్యాంగ విద్యార్థులు చదువు మధ్యలోనే మానేస్తున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఇప్పటికే అధికారులతో చర్చలు జరిపామని, రానున్న రోజుల్లో ఇంటర్మీడియట్‌తో పాటు డిగ్రీ స్థాయి వరకు బ్రెయిలీ పుస్తకాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ దిశగా త్వరలోనే జీవో జారీ చేసి, దివ్యాంగ విద్యార్థులకు పూర్తి స్థాయి విద్యా అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, మహిళా, శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, దివ్యాంగుల, వయోవృద్ధుల ట్రాంజెండర్ల సాధికారత శాఖ డైరెక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎమ్మెల్సీ నవీన్‌రావును విచారించిన సిట్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆదివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణలో సిట్ దూకుడు పెంచింది. నేడు విచారణకు హాజరు కావాలని బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి నవీన్ రావుకు సిపి సజ్జనార్ నేతృత్వంలోని సిట్ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో ఆయన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో సిట్ విచారణకు హాజరయ్యారు. తీగ లాగితే డొంక కదిలిన మాదిరిగా.. ఈ కేసులో ఒక్కొక్కరినీ విచారించే కొద్దీ కొత్త పేర్లు తెరపైకి వస్తున్నాయి. నవీన్ రావు విచారణలో తన వెనుక ఎవరున్నారు? ఎవరితో చేయి కలిపారు? వంటి ప్రశ్నలు సిట్ అధికారులు సంధించినట్లు సమాచారం. సిట్ విచారణలో నవీన్ రావు ఒక్క ప్రశ్నకూ సరైన సమాధానమివ్వలేదని తెలుస్తోంది. ఫోన్ ట్యాపింక్ కేసు నిందితులైన ప్రణీత్‌రావు, శ్రవణ్ కుమార్‌లతో తనకు సంబంధాలున్నాయన్న ఆరోపణలను నవీన్ రావు ఖండించారు. తన ప్రతిష్టకు భంగం కలిగించేందుకు రాజకీయంగా ఇలాంటి ప్రచారం చేస్తున్నారని నవీన్‌రావు వాపోయారు. నిందితులతో తనకెలాంటి సంబంధం లేదని, ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎప్పుడూ వారితో మాట్లాడలేదన్నారు. తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. విచారణలో ఎమ్మెల్సీ నవీన్ రావు ఇచ్చిన వాంగ్మూలాలన్ని సిట్ అధికారులు రికార్డు చేశారు.

కాగా.. ఈ కేసులో బిఆర్‌ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్‌ను కూడా విచారించేందుకు సిట్ రెడీ అవుతోంది. త్వరలోనే వారిద్దరీ సిట్ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

# 'తెలంగాణ చరిత్ర మూలాలు' పుస్తకం ఓ దిక్సూచి

### పుస్తక ఆవిష్కరణ సభలో పలువురు వక్తలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'తెలంగాణ చరిత్ర మూలాలు' పుస్తకంతో తెలుగు రాష్ట్రాల చరిత్ర, బాష, సంస్కృతి కొత్త మలుపులు తిరుగబోతున్నాయని పలువురు వక్తలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ వాస్తవిక చరిత్రను ఆవిష్కరించుకునే పరిశోధన మార్గంలో సీనియర్ సంపాదకులు, రచయిత కట్టా శేఖర్‌రెడ్డి రచించిన 'తెలంగాణ చరిత్ర మూలాలు' పుస్తకం దిక్సూచి వంటిదని అభివర్ణించారు. 'తెలంగాణ చరిత్ర మూలాలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించగా, సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి 'తెలంగాణ చరిత్ర మూలాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్ర అంటేనే కూర్పులతో కూడిందన్నారు. దేశంలో విజేతలు చరిత్రను రాసుకున్న ఆనవాయితీ కొనసాగడంతో అసలు చరిత్ర ఏమిటనేది నిత్య సత్యశోధనగా కొనసాగుతుందని తెలిపారు. స్వరాష్ట్రంలో తెలంగాణ చరిత్రను రాసుకునే సమయం వచ్చిందని, ఈక్రమంలోనే కట్టా శేఖర్ రెడ్డి తెలంగాణ మూలాలు పుస్తకంతో తెలుగు భాష, తెలంగాణ చరిత్ర పరిశోధనపై లోతైన పరిశోధన చేశారని కొనియాడారు.

మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ చరిత్రను, భాష, సంస్కృతులను అణిచివేసే కుట్రలు ఉమ్మడి రాష్ట్రంలో జరిగాయని అన్నారు. చరిత్ర పరిశోధనలు ఎంత తవ్వితే, ఎంత చిలికితే అంత మంచిదని, తెలంగాణ చరిత్ర స్థిరీకరణకు మరిన్ని పరిశోధనలు జరగాలని తెలిపారు.

సీనియర్ సంపాదకులు, రచయిత కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర పుస్తక రచనతో రచయిత కట్టా శేఖర్ రెడ్డి ఆంధ్ర, తెలుగు, తెనుగు భాషల మధ్య వైరుధ్యాలపై విస్తృత పరిశోధన చేశారని ప్రశంసించారు. పుస్తకం చదువుతుంటే థ్రిల్లర్ నవలను, కాల్పనిక నవలను చదువుతున్నట్టుగా ఆసక్తికరంగా సాగుతుందన్నారు. తెలంగాణ చరిత్రపై ప్రాంతీయ ఆధిపత్య శక్తుల ప్రభావం నుంచి స్వీయ అస్థిత్వం, ఆత్మగౌరవంతో కూడిన చరిత్రను ఆధారాలు, పరిశోధనలతో చెప్పే ప్రయత్నం చేశారని వివరించారు.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ భారతదేశ చరిత్రతో పాటు, ఆంధ్రులు, తెలంగాణ చరిత్ర కూడా వక్రీకరణలతో సాగాయన్నారు. సింహాలు తమ చరిత్రను చెప్పుకోనంత వరకు వేటగాడు చెప్పిందే చరిత్ర అవుతుందని వ్యాఖ్యానించారు.

సీనియర్ సంపాదకులు అల్లం నారాయణ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో భాష, సంస్కృతుల అస్తిత్వం కోల్పోయిన తెలంగాణకు స్వరాష్ట్రంలో చరిత్ర నిర్మాణం, భాషలపై జరగాల్సిన పరిశోధనలు జరుగలేదని అన్నారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణ చరిత్ర మూలాల రచనతో కట్టా శేఖర్ రెడ్డి తెలంగాణ చరిత్ర, భాషలపై ఆసక్తికర చర్చను లేవనెత్తారని అభినందించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ మాట్లాడుతూ చరిత్రను ఎప్పుడూ ఎవ్వరూ పూర్తిగా రాయలేరని, దేశ, రాష్ట్ర చరిత్రలు కూడా ఆక్రమణలకు గురయ్యాయని అన్నారు. సాక్షి సంపాదకులు వర్ధెల్లి మురళి మాట్లాడుతూ కట్ట శేఖర్ రెడ్డి తన రచనలతో తెలుగు, తెలంగాణ చరిత్రలకు సంబంధించి కొత్త చర్చను ప్రారంభించారన్నారు. పుస్తక రచయిత కట్టా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఏదైనా అంశంపైన గత చరిత్రను అన్వేషించే స్వీయ ఆసక్తి తనను తెలంగాణ చరిత్ర మూలాలు పుస్తక రచన వైపు నడిపించాయన్నారు. తమిళ భాష ప్రాచీన హోదా అంశంతో తెలుగు భాష మూలాలపైన ఆసక్తి పెరిగిందన్నారు. వెయ్యి ఏళ్ల చరిత్ర కలిగిన తెలుగు భాషకు ప్రాచీన హోదా ఇవ్వడాన్ని మద్రాస్ హైకోర్టులో సవాల్ చేయడం కూడా తనను తెలుగు భాషా చరిత్రపై ఆసక్తి పెంచిందన్నారు. తెలుగు లింక్‌తో తన పరిశోధనను కొనసాగించి, చారిత్రక ఆధారాలు, శాసనాలతో తెలంగాణ చరిత్ర మూలాల రచన చేశానని, అయితే ఇది మాత్రమే తెలంగాణ చరిత్ర అని తాను నిర్ధారించడం లేదని, దీనిపైన మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉన్నదని కట్ట శేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దిశ సంపాదకులు మార్కండేయులు, సీనియర్ జర్నలిస్టు, రచయిత కోవెల సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం పనిచేస్తే.. ప్రజల హృదయాల్లో...

### ప్రజల హృదయాల్లో జీవించే ఉంటారు
### పోటు ప్రసాద్ సంతాప సభలో
### సిపిఐ నారాయణ వ్యాఖ్య




**ప్రజాపక్షం/గరిడేపల్లి :** ప్రజల కోసం పనిచేసేవారు ప్రజల కోసం జీవించేవారు ప్రజల హృదయాల్లో ఎల్లప్పటికీ జీవించే ఉంటారని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రంగాపురం గ్రామంలో దివంగత సిపిఐ నాయకులు పోటు ప్రసాద్ స్థూపాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన బహిరగం సభలో ఆయన మాట్లాడారు.

దేశంలో కమ్యూనిజం లేకుండా చేస్తామని మోడీ, అమిత్‌షా ద్వయం బీరాలు పలుకుతున్నారని, కమ్యూనిజాన్ని అంతమొందించడం అంత సులువు కాదని అన్నారు. ఈ దేశంలోని పౌరులు అనుభవిస్తున్న అన్ని సౌకర్యాలు అలాగే ఈ దేశంలోని బడుగు బలహీన వర్గాల సమస్యలు పరిష్కారం అయ్యాయి అంటే అందుకు కారణం కమ్యూనిస్టులు అని కమ్యూనిస్టు పార్టీ చేసిన పోరాటాల ఫలితంగానే పాలకులు దిగివచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని స్పష్టం చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ వెనుజుల దేశంపై అమెరికా దాడి తీవ్రంగా ఖండిస్తున్నామని, అమెరికా దేశం ఒక ప్రపంచ నియంతగా ప్రవర్తిస్తుందని నిత్యం ప్రపంచంలోని ఏదో ఒక దేశంతో కయ్యాలు పెట్టుకుంటూ ప్రపంచంలో అశాంతిని నెలకొల్పుతున్నదని, ట్రంప్ అనేవాడు ప్రపంచానికి కంపుగా మారాడని ప్రపంచంలోని అభ్యుదయవాదులు, ప్రజాస్వామ్యవాదులు ఈ దాడులను తీవ్రంగా ఖండించాలని కోరారు. బహిరంగ సభకు జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంతరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సిపిఐ, సిపిఎం ఖమ్మం జిల్లాల కార్యదర్శులు దండి సురేష్, నున్నా రాజేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ధనుంజయ నాయుడు, యల్లావుల రాములు, ఉస్తెల నారాయణరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు, ఉస్తెల సృజన, కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరి, గుండు వెంకటేశ్వర్లు, నంద్యాల రామిరెడ్డి, సాయబెల్లి, పోటు కళావతి, పోటు చింటుబాబు, పోటు కృష్ణబాబు, మండల సిపిఐ కార్యదర్శి కడియాల అప్పయ్య, రంగాపురం గ్రామ సర్పంచ్ కట్టా కళ్యాణి, గానుగుబండ సర్పంచ్ కడియాల పద్మ, పోటు పూర్ణచంద్రరావు, అమరావపు పున్నయ్య, చిల్లంచర్ల ప్రభాకర్ పాల్గొన్నారు.


## ఉపాధి హామీ పథకం పరిరక్షణకు ఎఐసిసి సమరం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎ) బలహీన పరుస్తోందని ఆరోపిస్తూ, దాని పరిరక్షణ కోసం దేశవ్యాప్త ఉద్యమానికి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) శ్రీకారం చుట్టనుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానాలు, పథకం పేరు మార్పు ప్రతిపాదనలు గ్రామీణ పేదల ఉపాధి హక్కులను దెబ్బతీసేలా ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఉపాధి హామీ పథకాన్ని దాని అసలు రూపంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ జనవరి 10 నుండి ఫిబ్రవరి 25వరకు వివిధ దశల్లో నిరసనలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా వార్డు, బ్లాక్ స్థాయిల్లో శాంతియుత ధర్నాలు, జిల్లా కలెక్టరేట్ల ముట్టడి, రాష్ట్రాల అసెంబ్లీల ముట్టడి, జాతీయ స్థాయిలో భారీ ర్యాలీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ, సమన్వయం కోసం ప్రత్యేకంగా ఒక సమన్వయ కమిటీని ఎఐసిసి ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్కకు అవకాశం కల్పించారు.


సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
మెట్రో జోన్, మింట్ కాంపౌండ్ :: హైదరాబాద్-63
టెండర్ నోటీస్ No. 32/ 25-26 (పేపర్ నోటిఫికేషన్)
ఇ-టెండర్ కోసం అర్హత కలిగిన ఏజెన్సీల నుండి టెండర్లు ఆహ్వానించబడ్డాయి. ప్రస్తుత 11 KV OH లైన్‌ను UG కేబుల్‌తో భర్తీ చేయడం ద్వారా a) 33 /11 KV ASRR SS నుండి వెలువడే 11 KV GHMC PARK FEEDER ను జనరల్ కేటగిరీ eMZ 33/25-26 (Extn-I) కింద. b) హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ మెహిదీపట్నం డివిజన్‌లోని eMZ-34/25-26 (Exten-I), జనరల్ కేటగిరీ కింద 33/ 11 KV ఆసిఫ్‌నగర్ SS నుండి EMANATING 11 KV NSF ఫీడర్, c) హైదరాబాద్ సౌత్ సర్కిల్ బేగంబజార్ డివిజన్‌లోని eMZ 35/25-25 (Exten-I)జనరల్ కేటగిరీ కింద 11 KV ఇసామియా బజార్ ఫీడర్‌ను విభజించడం, d) B Hills సర్కిల్‌లోని మెహర్‌బాబా ఫీడర్‌ను జనరల్ కేటగిరీ (eMZ-36 NEW) కింద విభజించడం, అసలు పనులకు T & D మెరుగుదలలు. దీనికి సంబంధించి ఏవైనా ఇతర సమాచారాన్ని మా వెబ్‌సైట్లు www.tender.telangana.gov.inమరియు www.tgsouthernpower.org నుండి చూడవచ్చు.
సం/- చీఫ్ ఇంజినీర్, ఆపరేషన్ మెట్రో జోన్, హైదరాబాద్.
DIPR R.O. No. : 12996-PP/CL/ADVT/1/2025-26, Date: 03-01-2026

## శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్‌లు

**ప్రజాపక్షం/భువనగిరి :** యాదాద్రి జిల్లా భువనగిరిలోని స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ బో రెడ్డి అయోధ్య రెడ్డి కుటుంబ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ పివి శ్రీనివాస్ రావు కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమాచార కమిషనర్ బో రెడ్డి అయోధ్య రెడ్డి, రాష్ట్ర సమాచార కమిషనర్ పివి శ్రీనివాస్ రావులకు మానేపల్లి గోపికృష్ణ వెంకటేశ్వర స్వామి వారి ఫోటో ఫ్రేమ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు మానేపల్లి రామారావు, మానేపల్లి మురళీకృష్ణ, మానేపల్లి గోపికృష్ణ పాల్గొన్నారు.



## బెంగుళూర్ బేకరికి రూ.5వేల పెనాల్టీ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట పట్టణంలోని పాతబస్టాండ్ ఎదురుగా గల బెంగళూర్ బేకరీ యాజమాన్యం వారు షాపులో అపరిశుభ్రత, డేట్‌ఎక్స్‌పెయిర్ అయిన చాక్‌లెట్స్ అమ్ముతున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంత రెడ్డి ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది షాపును పరిశీలించి రూ.5వేల పెనాల్టీ విధించినట్లు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యేనేపల్లి యాదగిరి, సందీప్ పాల్గొన్నట్లు చెప్పారు.






## గ్రామాల అభివృద్ధికి పాటు పడాలి

### నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం

**ప్రజాపక్షం/చిట్యాల:** గ్రామ సర్పంచ్‌లు గ్రామ సమస్యల పట్ల అంకితభావంతో పనిచేయాలని నల్లగొండ జిల్లా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. నూతనంగా ఎన్నికైన చిట్యాల మండల సర్పంచ్‌ల ఫోరం కార్యవర్గం ఆయనను ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వారితో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తన వంతు సహాయం చేస్తానన్నారు. ముఖ్యంగా మురుకి కాలువలు, మంచి నీటి సరఫరా, వీధి దీపాలు లాంటి మౌలిక వసతులపై సమస్యలు రాకుండా చూసుకోవాలని సూచించారు. సర్పంచ్‌లంతా ఐక్యతతో ఉండి గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని అన్నారు. ఎంఎల్‌ఏను కలిసిన వారిలో ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం, ప్రధాన కార్యదర్శి ఆవుల సునిత, ఫోరం బాధ్యులు జోగు సురేష్, మిర్యాల వెంకటేశం, మహిపాల్‌రెడ్డి, సాగర్ల యాదయ్య, కట్ట ఆశయ్య, ఆవుల సుందర్, అందె రాములు తదితరులున్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకు కృషి

### తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు



**ప్రజాపక్షం/మోత్కూర్ :** రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు కలిసి కట్టుగా కృషి చేయాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెలు అన్నారు. మోత్కూరు మున్సిపాలిటీ ఎన్నికల ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం స్థానిక యల్ఎన్ గార్డెన్ పంక్షన్ హాల్‌లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండగోని రామచంద్రు గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశనికి ముఖ్య అతిథిగా తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామెలు వచ్చేసి మాట్లాడుతూ రానున్న మున్సి పాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించి మోత్కూ రు మున్సిపాలిటీ పై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని అన్నారు. పార్టీలో కొత్త పాత అనే భేదాభిప్రాయాలు పక్కకు పెట్టి ప్రతి ఒక్క కార్యకర్త పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు వంగల సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పైళ్ళ సోమిరెడ్డి, కంచర్ల యాదగిరి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నూనముంతల విమల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కంటి సమస్యతో బాధపడొద్దు

### ప్రతి ఒక్కరి కళ్ళల్లో వెలుగును నింపడమే సుశీల ఫౌండేషన్ లక్ష్యం : ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి భరోసా



**ప్రజాపక్షం/మునుగోడు:** మునుగోడు నియోజకవర్గంలోని ప్రజలు ఏ ఒక్కరు కూడా కంటి సమస్యతో బాధపడొద్దని తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా ప్రతి ఒక్కరి కళ్ళలో వెలుగులు నింపడమే సుశీలమ్మ ఫౌండేషన్ లక్ష్యం అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.ఆదివారం మండల కేంద్రంలో మునుగోడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫీనిక్స్ ఫౌండేషన్,శంకర కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన క్యాంప్ కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి తన మాతృమూర్తి సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా చండూరు నాంపల్లి మర్రిగూడ సంస్థాన్ నారాయణపురం చౌటుప్పల్ మునుగోడు మండలాలలో ఇప్పటివరకు ఈ 10 ఉచిత కంటి వైద్య శిబిరాలలో 7506 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 1490 మందికి సక్సెస్ ఫుల్ గా కంటి ఆపరేషన్లు పూర్తి చేసి వారికి వెలుగులు నింపారు.అనంతరం కంటి పరీక్షలకు చేయించుకోవడానికి వచ్చినవారికి స్వయంగా భోజనం వడ్డించారు.కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఆపరేషన్ నిమిత్తం శంకర్ హాస్పిటల్ కి తరలించారు.

## పేదలకు అండగా సిపిఐ పోరాటం

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 100 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఖమ్మం పట్టణంలో లక్షలాది మందితో నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి కోరారు. ఆదివారం స్థానిక మండల పార్టీ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్లో ఆవిర్భవించిందని నాటి నుండి నేటి వరకు పేద ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యలపై ప్రజా పోరాటాలు నిర్వహించిన పార్టీ సిపిఐ అని అన్నారు. జనవరి 18వ తేదీన ఖమ్మం పట్టణంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఈ బహిరంగ సభకు భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యులు సానుభూతిపరులు మేధావులు పాల్గొని ఈ యొక్క బహిరంగ సభని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సహాయ కార్యదర్శి ఉడత రామలింగం, బద్దుల సుధాకర్, రొండి నరసింహ, టంగుటూరి రాములు, దాసరి అంజయ్య, నీల బిక్షపతి, రోషణ, అంజయ్య, కడవేరు కౌసల్య, కుంటి పాపయ్య, సింగపంగ బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.




## కెసిఆర్ మరణాన్ని కోరుకునేది ఆ 'బావ బామ్మర్దులే'.. రేవంత్ రెడ్డి కాదు!

### సిఎం పదవి కోసం కెటిఆర్, పార్టీ కోసం హరీష్ రావు తహతహ.. నీళ్లు, నిధుల దోపిడీని ఎండగడుతుంటే జీర్ణించుకోలేకపోతున్నారు

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ క్షేమంగా ఉండాలని ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి కోరుకుంటుంటే, ఆయన రాజకీయ వారసత్వం కోసం సొంత కుటుంబ సభ్యులే కుట్రలు చేస్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డిపై విషం చిమ్మడమే లక్ష్యంగా హరీష్ రావు, కేటీఆర్ అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం, కేవలం కమిషన్ల కోసమే ప్రాజెక్టులు కట్టి తెలంగాణ ద్రోహానికి పాల్పడిందని చామల విమర్శించారు. కృష్ణా, గోదావరి జలాలపై జరిగిన అన్యాయాన్ని 'ప్రజా భవన్' వేదికగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలకు వివరిస్తుంటే.. దొంగలు దొరికిపోయినట్లు బావ బామ్మర్దులకు భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. అసలు వాస్తవాలు ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం చర్చకు పిలుపునిచ్చిందని ఆయన స్పష్టం చేశారు. 'కేసీఆర్ చావాలని రేవంత్ రెడ్డి ఎందుకు కోరుకుంటారు? నిజానికి కేసీఆర్ దౌర్భాగ్య పాలన వల్లే రేవంత్ రెడ్డికి సీఎం అయ్యే అవకాశం వచ్చింది. ఒకవేళ కేసీఆర్ మరణాన్ని ఎవరైనా కోరుకుంటున్నారంటే అది వారి కుటుంబంలోని హరీష్ రావు, కేటీఆర్ మాత్రమే' అని చామల ఆరోపించారు. ఎలాగైనా ముఖ్యమంత్రి పీఠం దక్కించుకోవాలని కేటీఆర్ లక్ష్యంగా పెట్టుకోగా, పార్టీని తన గుప్పిట్లోకి తెచ్చుకోవాలని హరీష్ రావు ఆరాట పడుతున్నారని, వీరిద్దరి అధికార దాహానికి అడ్డు వస్తుందనే ఉద్దేశంతోనే కవితను కూడా పక్కకు తప్పించిన దాఖలాలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. పాలమూరురంగారెడ్డి, కృష్ణా జలాలు, కాళేశ్వరం ప్రాజెక్టుల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని కప్పిపుచ్చుకోవడానికి హరీష్ రావు, కేటీఆర్ మళ్లీ పాత పద్ధతిలో పవర్ పాయింట్ ప్రెజంటేషన్లతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ విమర్శించారు. గత పదేళ్ల రావణ పాలన ముగిసిందని, ఇప్పుడు సాగుతున్న రామ రాజ్యంలో వాస్తవాలు ప్రజల కళ్లముందే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ఆసుపత్రిలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి స్వయంగా వెళ్లి పరామర్శించారని, అనుభవం ఉన్న నాయకుడిగా ఆయన సలహాలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని చామల వివరించారు.

## నమ్మిన సిద్ధాంతం కోసం తుదివరకు పోరాడిన హనుమంతు

### గణేష్ ఉయికేకు ఘనంగా నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/చండూరు:** ప్రజాయుద్ధనేత మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు పాక హనుమంతు అలియాస్ గణేష్ ఉయికే అన్న తాను నమ్మిన మావోయిస్టు సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు పోరాటం చేసి ప్రజల కోసం జీవించి అమరుడుగా నిలిచిపోయాడని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. గత నెల డిసెంబర్ 24న ఒడిశాలోని కందమాల్ జిల్లా చరపాద్ అడవుల్లోజరిగిన ఎన్‌కౌంటర్‌లో పాక హనుమంతు అలియాస్ ఉయికే గణేష్ మరణించడంతో ఆయన స్వస్థలం తెలంగాణలోని నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామంలో పాక హనుమంతు అంత్యక్రియలు జరిగాయి. జనవరి 4న పుల్లెంల గ్రామంలో జరిగిన పాక హనుమంతు అలియాస్ ఉయికే గణేష్ సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం , కల్లుగీత కార్పోరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ , బిఆర్‌ఎస్ నేత తెలంగాణ ఉద్యమకారుడు చెరుకు సుధాకర్ హాజరై పాక హనుమంతు అలియాస్ ఉయికే గణేష్ అన్న చిత్ర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం మావోయిస్టులపై చేస్తున్న కగార్ ఆపరేషన్‌ను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని మావోయిస్టులు ప్రకటించినాకూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మావోయి స్టులను పిట్టలను కాల్చినట్లు కాల్చిచంపడం ప్రజాస్వామ్య వ్యవస్థలో మంచి పద్ధతి కాదని ప్రశ్నించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవడం కోసం కమ్యూనిస్టు పార్టీ ఐక్యత చాలా అవసరమని, దేశంలోఉన్న మేధావులు, లౌకికవాదులు ఆలోచించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కల్లుగీత కార్పోరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ , తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ చెరుకు సుధాకర్ , పౌరహక్కుల సంఘం నేతలు , అమరుల బంధు మిత్రుల సంఘం నేతలు , భరద్వజ్ , సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య , తీర్పారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని ఇద్దరు యువకులు మృతి

**ప్రజాపక్షం/వలిగొండ :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలం నర్సాపురం గ్రామ శివారులోని బోరబండగూడెం హ్యామ్లెట్ వద్ద సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ముషిపట్ల గ్రామానికి చెందిన రైతు కుక్కల యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం ఆయన కుమారుడు సాయి కిరణ్(19) తన స్నేహితుడు బొల్లా దీక్షిత్ (21) దాచారం గ్రామ నివాసితో కలిసి సోమవారం ఉదయం 9 గంటల సమయంలో భువనగిరికి వెళ్లేందుకు పుల్సర్ మోటార్ సైకిల్ (టిఎస్ 07హెచ్‌బి9040)పై బయలుదేరారు. ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో నర్సాపురం గ్రామ శివారులో అశోక్ లేలాండ్ 22 చక్రాల లారీ (టిఎస్02యుబి7312) మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఇనుప రాడ్లతో లోడ్ చేసిన లారీని డ్రైవర్ నిర్లక్ష్యంగా, వేగంగా వలిగొండ వైపు నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాదంలో లారీ రెండో వరుస కుడి వైపు చక్రం సాయి కిరణ్ తలపై నుంచి వెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. అదే విధంగా, రెండో వరుస ఎడమ వైపు చక్రం బొల్లా దీక్షిత్ కుడి తొడ మరియు కిందటి పొట్ట భాగంపై వెళ్లడంతో తీవ్ర గాయాలపాలై ఆయన కూడా సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న వెంటనే మృతుడి తండ్రి యాదగిరి సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, లారీ డ్రైవర్‌పై భారత న్యాయ సంహిత (బిఎన్‌ఎస్) సెక్షన్ 106(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ప్రమాదంతో ముషిపట్ల, దాచారం గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.




## బసవపురం ప్రాజెక్టును నింపండి

### సిఎం రేవంత్ రెడ్డికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేల విన్నపం



**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లా రైతాంగం చిరకాల వాంఛ అయిన బసవపురం (నృసింహస్వామి) ప్రాజెక్టును నీటితో నింపి, సాగునీరు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రజా ప్రతినిధుల బృందం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నేతృత్వంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. బసవపురం ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించే అవకాశం ఉందని, ఈ ప్రాజెక్టుకు నీళ్లు అందిస్తే జిల్లాలోని మెట్ట ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయని, వేలాది రైతు కుటుంబాలకు భరోసా కలుగుతుందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే సాగునీటి రంగంలో జిల్లా విప్లవాత్మక మార్పులు సాధిస్తుందని, ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బసవపురం ప్రాజెక్టు ఫలితాలు రైతులకు అందించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. తమ విన్నపంపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, ప్రాజెక్టు పనుల పురోగతి మరియు నీటి లభ్యతపై అధికారులతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు తెలిపారు. 'ప్రజల ఆకాంక్షల సాధనే ధ్యేయంగా పనిచేస్తున్న మా ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తోంది. బసవపురం ప్రాజెక్టు ద్వారా జిల్లా రూపురేఖలు మారుతాయని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ధీమా వ్యక్తం చేశారు.

## సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడిగా రాజు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** కొండమల్లేపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఆదివారం కేశ్యతండా సర్పంచు రాజునాయక్‌ను 20 మంది సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సర్పంచుల ఫోరం అధ్యక్షుడిని కొండమల్లేపల్లి సర్పంచు పసునూరి యుగేందర్‌రెడ్డి ప్రతిపాదించగా కేశ్యతండా సర్పంచు రమావత్ రాజును సర్పంచులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఆయన తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా చెన్నారం సర్పంచు రమావత్ తులసిరాంను ఎన్నుకున్నారు. మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



## సాగర్‌లో పర్యాటకుల సందడి

**ప్రజాపక్షం/నందికొండ:** సెలవు దినం కావడంతో అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు సాగర్‌కు తరలివచ్చి సాగర్ అందాలను తిలకించారు.ప్రత్యేక ఆకర్షణగా సాగర్ జలాశయం నుంచి లాంచీల్లో నాగార్జునకొండకు బయలుదేరిన పర్యాటకులు అక్కడి చారిత్రక ప్రాధాన్యత కలిగిన మ్యూజియాన్ని సందర్శించారు. బౌద్ధ కాలానికి చెందిన శిల్పాలు, శాసనాలు, పురావస్తు సంపదను వీక్షిస్తూ చరిత్రను గుర్తుచేసుకున్నారు.లాంచీ ప్రయాణం పర్యాటకులకు ప్రత్యేక అనుభూతిని కలిగించగా, నాగార్జునకొండలోని మ్యూజియం విశేషాలు వారిని ఆకట్టుకున్నాయి.ఆతరువాత బుద్ధవనం, వ్యూ పాయింట్ తదితర ప్రాంతాలు సందర్శించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చిన పర్యాటకులు ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ఫోటోలు, వీడియోలు తీసుకుంటూ సెలవు దినాన్ని ఆనందంగా గడిపారు.

## ఓటరు జాబితాలో పొరపాట్లుండొద్దు

### యాదాద్రి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



**ప్రజాపక్షం/ఆలేరు :** మున్సిపల్ పట్టణాల్లోని ప్రతి వార్డుకు సంబంధించిన ఓటర్ల వివరాలు కీలకమని, ఎన్నికల నిర్వహణకు ఈ ప్రక్రియ ఎంతో కీలకమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. ఆదివారం ఆలేరు మున్సిపాలిటీ కార్యాలయంను సందర్శించి 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా డ్రాఫ్ట్ ఓటర్ లిస్టును పరిశీలించారు. డ్రాఫ్ట్ ఓటర్ లిస్టులో ఏమైనా మార్పులు చేర్పుల కొరకు ఫిర్యాదులు అందితే వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో ప్రజలకు ఎవ్వరికైన ఎటువంటి అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు ఉంటే వారు ఇచ్చే అర్జీలను స్వీకరించుటకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలనీ ఇప్పటి వరకు ఆర్జీల స్వీకరించుటకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసారా లేదా అని తెలుసుకున్నారు. ప్రతి రోజు వచ్చినటువంటి అభ్యంతరాలను ఏరోజుకారోజు విచారణ నిర్వహించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాబోయే ఎన్నికలకు ముందస్తుగా యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ కమిషనర్, శ్రీనివాస్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలు కాపాడుకోవాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలోని రాక్ హిల్స్ కాలనీ అభివృద్ధి తో పాటు కాలనీలో ఉన్న ప్రజల ఆరోగ్యాలను కాపాడడం కోసం కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినదనీయం అని మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.రాక్ హిల్స్ కాలనిలో రివర్ నిమ్స్ హాస్పిటల్ సౌజన్యతో లయన్స్ క్లబ్ నల్లగొండ స్టార్స్,హార్ట్ ఫుల్ నెస్ ధ్యాన సెంటర్ సహకారంతో మెగా సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంపును ఆదివారం నిర్వహించారు.ఈ క్యాంపు ను శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ మానవుడు ప్రస్తుత పరిస్థితిలలో బిజీగా ఉంటూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టకపోవడం వలన ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాకెట్స్ కాలనీ అధ్యక్షులు సోమనబోయిన నరసింహ యాదవ్, గౌరవాధ్యక్షులు పకీరు వెంకట్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి రేఖ నాగబాబు,కోశాధికారి ఆంజనేయులు,ఉపాధ్యక్షులు వంశీ మహేందర్,నరసింహ ,డాక్టర్ వెంకట రెడ్డి,మాజీ కౌన్సిలర్ ఖయ్యూం బేగ్ పాల్గొన్నారు.




### అసెంబ్లీలో కెసిఆర్ తప్పులు చేశాడనే వాదన తప్ప


## కృష్ణానది నీటి వాటాపై చర్చ ఏదీ?

### జగదీష్‌రెడ్డి మిత్రులు పెద్దఎత్తున అవినీతి అక్రమాలు

### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపణ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** అసెంబ్లీలో కెసిఆర్ తప్పులు చేశాడనే వాదన తప్ప కృష్ణానది నీటివాటాపై చర్చేలేదని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆల్మట్టి ఎత్తు పెంచి 100 టిఎంసిల నీటిని తెలంగాణ నష్టపోయే పరిస్థితి ఏర్పడినా ప్రశ్నించకుండా రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఉత్తరం రాసి వదిలేశారని మండిపడ్డారు. కృష్ణనీటి వాటాలో తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే నాలుగు రాష్ట్రాల మీద మాట్లాడకుండా కేవలం ఆంధ్రప్రదేశ్ దోపిడి మీదనే సిఎం మాట్లాడడం విడ్డూరంగా ఉందని హేళన చేశారు. ప్రతిపక్షం అంటే ఒక పార్టీ మాత్రమే కాదు ప్రజల గొంతుకగా ఉండాలన్నారు. కురచ స్వభావంతో గత ప్రభుత్వంపై నిందలు వేస్తూ తప్పులు కప్పిపుచ్చుకుంటున్న సిఎం చిత్తశుద్ధి ఉంటే కర్ణాటక అప్పర్ భద్ర జాతీయ హోదా తొలగించాలని, అల్మట్టి ఎత్తు తగ్గించేలా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగతంగా హరీష్‌ని ఒక్క మాట అన్నందుకు సభని వాకౌట్ చేశారని ఆ అంశంపై వాకౌట్ చేస్తే తరువాత సభకు రావొచ్చన్నారు. మిగతా బిల్లులపై చర్చ జరుగుతుంటే ప్రతిపక్షం ఉండొద్దా అని ప్రశ్నించారు. సభ నుండి వాకౌట్ చేయాలనే నిర్ణయం హరీష్‌రావుదేనా అన్నారు. గతంలో కేసీఆర్‌ని తిట్టినప్పుడు సభ నుండి బాయ్‌కాట్ ఎందుకు చేయలేదని విమర్శించారు. బిఆర్‌ఎస్ పార్టీలో హరీష్ ఒక గుంపు తయారు చేస్తుందని బాయ్‌కాట్ నిర్ణయం అధిష్టానందే అయితే అది శ్రేయస్కరం కాదని, బయట సభలు పెట్టేకంటే చట్టసభల్లో మాట్లాడే అవకాశం వదులుకోవడం కరెక్ట్ కాదని హితవు పలికారు. గుంటనక్క హరీష్ వ్యవహారం తోక కుక్కను ఊపినట్టుందనీ, ఒక్క మాట అన్నందుకు సభ బాయ్‌కాట్ చేస్తారా అని అడిగారు. కృష్ణా పంపకాల్లో హక్కులు తగ్గించి హరీష్ సంతకం ఎందుకు పెట్టాడో చెప్పి పిపిటి చేయాలన్నారు. హరీష్ ధన దాహం కోసమే జూరాల నుండి శ్రీశైలానికి మార్పు చేసారని, హరీష్ నిర్ణయాలతో సాగునీటి ప్రాజెక్టులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఏలూరు పంపుహౌస్‌ను అండర్ గ్రౌండ్ పంప్‌హౌస్‌గా మార్చారని అందుకు దాదాపు రూ.14కోట్లు ఖర్చు పెట్టారన్నారు. జగదీష్‌రెడ్డి దత్తత తీసుకున్న చీదెళ్ల గ్రామంలో రోడ్ల పరిస్థితి అద్వాన్నంగా తయారైందన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## స్టోన్ క్వారీలో రాళ్లు కుప్పకూలి ఇద్దరి మృతి

**భువనేశ్వర్:** ఒడిశాలో డెంకన్‌జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. దెంకనల్ జిల్లాలో ఒక అనధికార స్టోన్ క్వారీ వద్ద రాళ్లు కుప్పకూలి కనీసం ఇద్దరు వ్యక్తులు మరణించి ఉంటారని ఆదివారంనాడు అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ దుర్ఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. దెంకనల్ జిల్లా మోతంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్ గ్రామం వద్ద ఉన్న స్టోన్ క్వారీ నుండి కొంతమంది కార్మికులు రాతి తవ్వకాలు, అన్వేషణ కోసం డ్రిల్లింగ్ చేస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుందని వారు తెలియజేశారు. కాగా దీనికి సంబంధించి కచ్చితమైన కారణమేమిటన్నది ఇప్పటి వరకూ తెలియ రాలేదని, స్థానిక అగ్నిమాపక సర్వీస్ బృందాలు, ఒడిశా డిసాస్టర్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఒడిఆర్ఎఎఫ్), డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలికి చేరుకుని రక్షణచర్యలు చేపట్టాయని ఒక అధికారి చెప్పారు. దెంకనల్ కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పాటిల్, ఎస్‌పి అభినవ్ సోంకర్ సంఘటనా స్థలికి హుటాహుటిన చేరుకుని రెస్క్యూ ఆపరేషన్‌ను పర్యవేక్షించారు. సమాచారం ప్రకారం కేవలం ఇద్దరి మృతదేహాలు దొరికాయని చెప్పారు.

## సంక్రాంతికి తమిళనాడు ప్రభుత్వం బంఫర్ ఆఫర్

### ప్రజల ఖాతాల్లో రూ.3000 జమ!




**చెన్నై :** పొంగల్ కానుకగా తమిళనాడు ప్రభుత్వం బంఫర్ ఆఫర్‌ను ప్రకటించింది. రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.3000 నగదు జమచేయనున్నట్లు వెల్లడించింది. ప్రభుత్వం ప్రకటించిన ఈ కానుకతో దాదాపు 2.22 కోట్ల మంది రేషన్‌కార్డు లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది. సాధారణంగా తమిళనాడులో ప్రతి సంవత్సరం పొంగల్ పండగ సందర్భంగా ఆడవాళ్లకు చీరలు, మగవారికి దోవతులు, రూ.2000 నుంచి రూ.2500 వరకు నగదు అందిస్తుంది. అయితే ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కొన్ని సంవత్సరాల నుంచి అందించడం లేదు. తమిళనాడులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, అక్కడి ప్రభుత్వం ప్రజలకు పొంగల్ కానుకతో పాటు నగదు కూడా అందించనుందని ఇదివరకు ఊహాగానాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో తమిళనాడు ప్రభుత్వం ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు ప్రజలు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకోవాలని తమిళనాడు ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. అయితే శ్రీలంక తమిళ పునరావాస శిబిరాల్లో నివసిస్తున్న కుటుంబాలకు కూడా ఈ ప్యాకేజీ వర్తించనుంది. దీని ద్వారా కిలో బియ్యం, కిలో చక్కెర, చెరకు గడలను ప్రభుత్వం అందించనుంది. కాగా, పొంగల్ కానుకగా ప్రజలకు అందించే చీరలు, దోవతీలు అన్ని జిల్లాలకు ఇప్పటికే చేరుకున్నాయి. పొంగల్‌కు ముందే రేషన్ షాపుల ద్వారా ప్రజలకు వీటిని అందజేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన టోకెన్లు జనవరి 8వ తేదీ నుంచి అందించనున్నట్లు సమాచారం. అయితే ఈ పథకం కోసం తమిళనాడు ప్రభుత్వం రూ.6936కోట్ల నిధులను కేటాయించింది.

## ఐదు రాష్ట్రాలు, యుటిలకు కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీలు

### అసోం అసెంబ్లీ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌గా ప్రియాంకాగాంధీ నియామకం

**గువాహటి/న్యూఢిల్లీ:** అసోంలో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఇప్పటి నుంచే ఎన్నికలు కసరత్తును ప్రారంభించింది. అందులో భాగంగా అభ్యర్థుల ఎంపిక కోసం స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌గా పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాను చైర్‌పర్సన్‌గా నియమించింది. ఈ ఏడాది ప్రథమార్థంలో ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు స్క్రీనింగ్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) ప్రధాన కార్యదర్శి (సంస్థ) కెసి వేణుగోపాల్ శనివారం రాత్రి ప్రకటించారు. రానున్న రాష్ట్ర ఎన్నికలలో పోటీ చేయడానికి అభ్యర్థుల జాబితాలను ఖరారు చేయడానికి అసోం, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలకు నలుగురు సభ్యుల కమిటీలను ఏర్పాటు చేసినట్లు పార్టీ విడుదల చేసిన కాంగ్రెస్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఎఐసిసి ప్రధాన



కార్యదర్శి, పార్లమెంటేరియన్ అయిన ప్రియాంకను అసోం కమిటీకి చైర్‌పర్సన్‌గా నియమించారు. ఇక్కడ కాంగ్రెస్ ఇతర ప్రతిపక్ష పార్టీలతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసి బిజెపిని గద్దె దించి అధికారాన్ని చేపట్టాలని చూస్తోంది. ఆమె సన్నిహితులు, లోక్‌సభ ఎంపిలు అయిన ఇమ్రాన్ మసూద్, సప్తగిరి శంకర్ ఉలక, సిరివెల్ల ప్రసాద్‌తో పాటు అసోం స్క్రీనింగ్ కమిటీ సభ్యులుగా నియమించబడ్డారని కాంగ్రెస్ ఆ ప్రకటనలో తెలిపింది. కేరళకు స్క్రీనింగ్ కమిటీకి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మధుసూదన్ మిస్త్రీ నాయకత్వం వహిస్తుండగా, తమిళనాడు, పుదుచ్చేరిలకు మాజీ ఉప ముఖ్యమంత్రి టి ఎస్ సింగ్ దేవ్ నాయకత్వం వహించనున్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు స్క్రీనింగ్ కమిటీకి పార్టీ సీనియర్ నాయకుడు బి కె హరిప్రసాద్ నాయకత్వం వహిస్తారు. పశ్చిమ బెంగాల్ ప్యానెల్‌లోని ఇతర సభ్యులలో మొహమ్మద్ జావేద్, మమతా దేవి, బి పి సింగ్ ఉన్నారు. రాజ్యసభ ఎంపిలు సయ్యద్ నసీర్ హుస్సేన్, నీరజ్ డాంగి అభిషేక్ దత్‌తో పాటు కేరళకు స్క్రీనింగ్ కమిటీ సభ్యులుగా ఉంటారు. తమిళనాడు, పుదుచ్చేరిలకు పార్టీ నాయకులు యశోమతి ఠాకూర్, జి సి చంద్రశేఖర్, అనిల్ కుమార్ యాదవ్ స్క్రీనింగ్ ప్యానెల్ సభ్యులుగా ఉంటారు. ప్రధాన కార్యదర్శులు/ఇన్‌చార్జులు, పిసిసి అధ్యక్షులు, సిఎల్‌పి నాయకులు, ఆయా రాష్ట్రాలకు జనరల్ సెక్రటరీలకు అనుబంధంగా ఉన్న ఎఐసిసి కార్యదర్శులు కూడా వారి రాష్ట్రాల స్క్రీనింగ్ కమిటీలకు ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉంటారని కూడా ప్రకటనలో పేర్కొంది. కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, అసోంలలో అసెంబ్లీ ఎన్నికలు రాబోయే కొన్ని నెలల్లో జరగనున్నాయి. 126 మంది సభ్యులు కలిగిన అసోం అసెంబ్లీకి ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

## 'ఒలింపిక్స్-2036' క్రీడల నిర్వహణకు సన్నద్ధమవుతున్నాం : ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** 'ఒలింపిక్స్2036' క్రీడల నిర్వహణకు భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గత పదేళ్లలో అంతర్జాతీయ క్రీడలకు భారత్ వేదికగా నిలిచిందని చెప్పారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. గత దశాబ్ద కాలంలో భారత్‌లో 20కిపైగా అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించామని ప్రధాని గుర్తుచేశారు. అండర్17 ఫిఫా వరల్డ్‌ప్, హాకీ వరల్ కప్, చెస్ టోర్నమెంట్ లాంటి అంతర్జాతీయ ఈవెంట్లకు భారత్ ఆతిథ్యం ఇచ్చిందన్నారు. 2030లో జరిగే కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయని తెలిపారు. 2036లో ఒలింపిక్ క్రీడల కోసం భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని చెప్పారు. భారత్ అభివృద్ధి వృత్తాంతాన్ని ప్రధాని మోదీ వాలీబాల్ క్రీడతో పోల్చారు. ఏ విజయమైనా ఒక్కరితో సాధ్యం కాదనే విషయాన్ని ఈ వాలీబాల్ క్రీడ తెలియజేస్తుందని, మన సమన్వయం, విశ్వాసం, జట్ల సంసిద్ధతపైనే మన విజయం ఆధారపడి ఉంటుందని అన్నారు. ఇందులో ప్రతి ఒక్కరి పాత్ర, బాధ్యత ఉంటుందని, వాటిని నెరవేర్చినప్పుడే మనం విజయం సాధిస్తామని చెప్పారు. కాగా జనవరి 4 నుంచి 11 వరకు జరగనున్న ఈ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా 58 జట్లకు చెందిన వెయ్యి మందికిపైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీలతో వారణాసి నగరం జాతీయ స్థాయి క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా మారుతుందని వాలీబాల్ ఛాంపియన్‌షిప్ నిర్వాహకులు చెబుతున్నారు.

## ఏకగ్రీవ వార్డుల్లో మళ్లీ ఎన్నికలు పెట్టాలి

### శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాక్రే డిమాండ్

### దేశంలో ప్రజాస్వామ్యాన్ని మూకస్వామ్యం ఆక్రమించుకున్నట్లుగా ఉందని ఆందోళన




**ముంబయి:** మహారాష్ట్రలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో కొన్ని వార్డుల్లో అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. అయితే ఈ వార్డులలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాక్రే డిమాండ్‌చేశారు. తన బంధువులు, మిత్రపక్ష పార్టీ మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధ్యక్షుడు రాజ్ థాక్రేతో కలిసి ఆదివారం ఉద్ధవ్ థాక్రే మీడియాతో మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని మూకస్వామ్యం ఆక్రమించుకున్నట్లుగా వాతావరణం ఉందని ఉద్ధవ్ ఆరోపించారు.ముంబయి మున్సిపల్ ఎన్నికల కోసం తమ కూటమి మేనిఫెస్టోను వారు ఆవిష్కరించారు. మరాఠీ భాషను గౌరవించాలని, ముంబయి, రాష్ట్రంలోని ఇతర నగరాల మేయర్ మరాఠీ వారే అవుతారని రాజ్ థాక్రే స్పష్టం చేశారు. తన ప్రభుత్వం కూలిపోయి, ఏక్‌నాథ్ షిండే రాష్ట్ర ప్రభుత్వ పగ్గాలు చేపట్టినప్పటి నుండి (జూన్ 2022లో), బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ సంపదను కాంట్రాక్టర్ల కోసం దుబారా చేస్తున్నారని ఉద్ధవ్ థాక్రే ఆరోపించారు. బిఎంసి వ్యయ బడ్జెట్ రూ. 15,000 కోట్లు అయితే, వివిధ పనుల కోసం కాంట్రాక్టర్లకు అడ్వాన్స్ మొబిలైజేషన్ రూపంలో ఇవ్వాల్సిన మొత్తం రూ. 3 లక్షల కోట్లు ఉందని ఆరోపించారు. ఇది రూ. 3 లక్షల కోట్ల కుంభకోణం అని, ఆ కిక్‌బ్యాక్ డబ్బును మున్సిపల్ ఎన్నికల కోసం వాడుతున్నారని మాజీ ముఖ్యమంత్రి మండిపడ్డారు. ఈనెల 15న జరగనున్న మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి, దాని మహాకూటమి మిత్రపక్షాలు 68 స్థానాలను ఏకగ్రీవంగా గెలుచుకున్నాయి. ఈ నేపథ్యంలో ఓట్లను దొంగిలించిన తర్వాత, ఇప్పుడు అధికార పార్టీలు అభ్యర్థులను కూడా దొంగిలిస్తున్నాయని ఉద్ధవ్ థాక్రే ఆరోపించారు. 'రాష్ట్ర ఎన్నికల సంఘానికి ధైర్యం ఉంటే, అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైన చోట ఎన్నికలను రద్దు చేసి, ఆ వార్డులలో మళ్లీ ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలి' అని శివసేన (యుబిటి) అధినేత సవాల్ విసిరారు. అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికవడం అనేది ఓటర్లకు, ముఖ్యంగా జెన్‌జెడ్ తరానికి తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని నిరాకరించడమే అని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అధికారం శాశ్వతం కాదని, బిజెపి తప్పుడు సంప్రదాయాన్ని నెలకొల్పుతోందని ఎంఎన్ఎస్ అధినేత రాజ్ థాక్రే పాలకపక్షానికి హెచ్చరించారు. భవిష్యత్‌లో తమ వారసులు మరింత అధునాతన పద్ధతిలో ఇలాంటి ఎత్తుగడలను అనుసరించినప్పుడు అధికార పార్టీ ఫిర్యాదు చేయకూడదన్నారు. పశ్చిమ బెంగాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైన ఇలాంటి సందర్భాల్లోనే బిజెపి సుప్రీంకోర్టును ఆశ్రయించిందని, దీనిపై బిజెపి వైఖరి ఏమిటో చెప్పాలని ఎంఎన్ఎస్ అధ్యక్షుడు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, ఏకగ్రీవ విజయాల విషయంలో బిజెపి దూకుడుగా వ్యవహరిస్తోంది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ చంద్రపూర్‌లో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతూ, ప్రతిపక్షాలు కోర్టుకు వెళ్లినా ప్రజల తీర్పే నెగ్గుతుందని అన్నారు. 'వారు కచ్చితంగా కోర్టుకు వెళ్లవచ్చు, కానీ ప్రజల కోర్టు మమ్మల్ని ఎన్నుకుంది. వారు (ప్రతిపక్షాలు) కోర్టుకు వెళ్లినా, కోర్టులో ప్రజల తీర్పే నెగ్గుతుంది' అని ఫడ్నవీస్ స్వతంత్ర అభ్యర్థులు, ముస్లిం అభ్యర్థుల ఏకగ్రీవ విజయాలపై ప్రతిపక్షాల మౌనాన్ని ప్రశ్నిస్తూ అన్నారు. పౌర ఎన్నికల కోసం అమలులో ఉన్న ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడం, నామినేషన్ల ప్రక్రియలో జోక్యం చేసుకోవడం మరియు ఈ ప్రక్రియకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని తారుమారు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మహారాష్ట్ర శాసనసభ స్పీకర్ రాహుల్ నార్వేకర్‌ను ఉద్ధవ్ థాక్రే కూడా లక్ష్యంగా చేసుకున్నారు. 'నార్వేకర్‌ను తక్షణమే సస్పెండ చేయాలి. స్పీకర్‌గా అతను ఏ పార్టీకి చెందినవాడు కాదు. ఎలాంటి పక్షపాతం లేకుండా పని చేయాల్సిన బాధ్యత ఆయనపై ఉంది' అని థాక్రే అన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు ఆయనపై కేసు నమోదు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. జనవరి 15న 29 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగే ఎన్నికల కోసం మొత్తం 15,931 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎస్ఇసి డేటా ప్రకారం, మొత్తం 33,247 నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో పరిశీలన తర్వాత 24,771 చెల్లుబాటు అయ్యాయి. చెల్లుబాటు అయిన వాటిలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ముగిసిన గడువులోగా 8,840 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఈ 29 మున్సిపల్ కార్పొరేషన్లలోని 893 వార్డులలో విస్తరించి ఉన్న 2869 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. 227 స్థానాలు ఉన్న ముంబై మినహా, మిగిలినవన్నీ బహుళ సభ్య వార్డులే.

## బెంగాలీ కార్మికుల పట్ల వివక్ష

### కొన్ని రాష్ట్రాల్లో గుర్తింపు పత్రాలు అడుగుతున్నారని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ ఆందోళన

### సమాంతర పోలీస్ వ్యవస్థ నడుస్తోందని ఆరోపణ



**సంబల్‌పూర్ :** కొన్ని రాష్ట్రాల్లో బెంగాలీ కార్మికుల పట్ల చూపుతున్న వైఖరిపై కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్ చౌదరి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ఒడిశాలోని సంబల్‌పూర్‌లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన వలస కార్మికులను కలిశారు. కొన్ని రాష్ట్రాల్లో బెంగాలీ కార్మికులను ప్రైవేట్ వ్యక్తులు వారి గుర్తింపు పత్రాలను చూపించమని అడుగుతున్నారని ఆరోపిస్తూ, అక్కడ జరుగుతున్న 'సమాంతర పోలీసు వ్యవస్థ'పై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పద్ధతిని ఆపాలని ఆయన చట్ట అమలు సంస్థలను కోరారు. పశ్చిమ బెంగాల్ ముర్షిదాబాద్ జిల్లాలోని బహరంపూర్ లోక్‌సభ నియోజకవర్గం నుండి ఐదుసార్లు మాజీ ఎంపిగా పనిచేసిన చౌదరి, వలస కార్మికులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.'నేను ఇక్కడ కొంతమంది బెంగాలీ వలస కార్మికులను కలిశాను. కాంగ్రెస్ వారికి అండగా ఉంటుందని చెప్పాను. ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లినట్లు కూడా వారికి తెలియజేశాను' అని చౌదరి విలేకరులతో అన్నారు.గత నెలలో సంబల్‌పూర్‌లో బీడి విషయంలో జరిగిన వాగ్వాదం తర్వాత ముర్షిదాబాద్‌లోని జంగీపూర్‌కు చెందిన 30 ఏళ్ల బెంగాలీ మాట్లాడే వలస కార్మికుడు జ్యువెల్ రాణా హత్యపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారు రాణాను బంగ్లాదేశ్ చొరబాటుదారుడిగా అనుమానించి, అతని ఆధార్ కార్డు చూపించమని అడిగారని కూడా ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణను స్థానిక పోలీసులు ఖండించారు.అధిర్ స్పందిస్తూ 'కొన్ని రాష్ట్రాల్లో సమాంతర పోలీసు వ్యవస్థ నడుస్తోంది, ప్రైవేట్ వ్యక్తులు వలస కార్మికులను వారి గుర్తింపు పత్రాలను చూపించమని అడుగుతున్నారు. దీనిని ఆపాలి. ఒక వలస కార్మికుడు బంగ్లాదేశ్ చొరబాటుదారుడు కావచ్చనే అనుమానంతో గూండాలు ఎవరినీ వేధించకుండా పోలీసులు చూడాలి' అని చౌదరి అన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ మాజీ నాయకుడు అయిన ఆయన, ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఒడిశాకు చెందిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సంబల్‌పూర్ ఎంపి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీల దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లాలని తాను యోచిస్తున్నట్లు చౌదరి చెప్పారు. 'వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న బెంగాలీ వలస కార్మికుల భద్రత కోసం నేను పోరాడతాను' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన స్థానిక కాంగ్రెస్ నాయకులను కోరారు. సంబల్‌పూర్‌కు తన ఒకరోజు పర్యటన సందర్భంగా చౌదరి నార్తర్న్ రేంజ్ ఇన్స్పెక్టర్ జనరల్ హిమాన్షు కుమార్ లాల్, సంబల్‌పూర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ముఖేష్ కుమార్ భమూలను కూడా కలిశారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పొరుగున ఉన్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులతో కలిసి, చౌదరి ఐంతపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ధనిపాలిని సందర్శించి, కొంతమంది బెంగాలీ మాట్లాడే వలస కార్మికులను కలిశారు. గతేడాది డిసెంబర్ 24న రాణాను నరికి చంపిన ప్రదేశాన్ని కూడా వారు సందర్శించారు. వలస కార్మికులతో సంభాషణ సందర్భంగా, చౌదరి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఒడిశాలో తమ భద్రత గురించి ఆందోళన చెందవద్దని వారికి చెప్పారు. పశ్చిమ బెంగాల్, ఒడిశా ప్రజల మధ్య శతాబ్దాల నాటి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని చౌదరి అన్నారు. పశ్చిమ బెంగాల్ నుండి వేలాది మంది కార్మికులు ఒడిశాలో పనిచేస్తున్నారని, అదేవిధంగా ఒడిశా నుండి కూడా పశ్చిమ బెంగాల్‌లో పనిచేస్తున్నారని ఆయన చెప్పారు. 'అయితే, ఇప్పుడు బంగ్లాదేశీ చొరబాటు పేరుతో పరిస్థితి ప్రతికూలంగా మారుతోంది. పశ్చిమ బెంగాల్ నుండి వచ్చిన వలస కార్మికులు అఘాయిత్యాలు, హింస మరియు హత్యలకు గురవుతున్నారు. ఇది రెండు రాష్ట్రాలకు ఆమోదయోగ్యం కాదు' ఆయన అన్నారు. వలస కార్మికులు జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్తారని, వారి ఉద్దేశాన్ని అనుమానించకూడదని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 'దయచేసి బెంగాలీ మాట్లాడే ప్రజలందరినీ బంగ్లాదేశీయులుగా పరిగణించవద్దు' అని ఆయన అన్నారు.

## మహిళ దారుణ హత్య

### చెట్టుకు ఉరివేసుకుని నిందితుడూ ఆత్మహత్య

**కార్వార్:** కర్నాటకలో దళిత మహిళ దారుణ హత్యకు గురైంది. ఉత్తర కన్నడ జిల్లాలోని యెల్లాపూర్ పట్టణంలో శనివారం 30 ఏళ్ల దళిత మహిళను ఆమెకు తెలిసిన వ్యక్తే రోడ్డుపైనే కత్తితో పొడిచి చంపినట్లు పోలీసులు తెలిపారు. అయితే హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న రఫీక్ ఇమామ్‌సాబ్ ఆదివారం యెల్లాపూర్ సమీపంలోని అడవిలో ఒక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కనిపించాడని పోలీసు సూపరింటెండెంట్ దీపన్ ఎం ఎన్ పిటిఐకి తెలిపారు. ఈ ఘటన పట్టణంలో మత ఉద్రిక్తతలకు దారితీసింది. పలు హిందూ సంస్థలు ఆదివారం యెల్లాపూర్ బంద్‌కు పిలుపునిచ్చాయి. వారు మహిళ హత్యను 'లవ్ జిహాద్' కేసుగా అభివర్ణించారు. హత్యకు గురైన మహిళను యెల్లాపూర్‌లోని కలమ్మ నగర్‌కు చెందిన రంజిత భానసోడే (30)గా గుర్తించారు. అదే ప్రాంతానికి చెందిన రఫీక్, మహిళ హత్య కేసులో ప్రధాన నిందితుడు. రఫీక్, రంజిత ఇద్దరూ పాఠశాల రోజుల నుండి స్నేహితులని పోలీసులు తెలిపారు. 'ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, నిందితుడు ఆ మహిళను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నాడు. ఆమె నిరాకరించడంతో, అతను బహిరంగంగా ఆమెపై కత్తితో దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి' అని ఒక పోలీసు అధికారి తెలిపారు. శనివారం మధ్యాహ్నం రంజిత తన కార్యాలయం నుండి ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. రంజిత సుమారు 12 సంవత్సరాల క్రితం మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన సచిన్ కటేరాను వివాహం చేసుకుందని, వారికి 10 ఏళ్ల కుమారుడు ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఆమె విడిగా నివసిస్తూ, యెల్లాపూర్‌లోని తన కుటుంబంతో కలిసి ఉంటోందని, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన సహాయకురాలిగా పనిచేస్తోందని పోలీసులు చెప్పారు.

## గాంధీ రాముడని... బిజెపి ప్రచారానికి వాడుకుంటోంది

### వారి ఆదర్శాలను విస్మరిస్తోంది

### సుర్జేవాలా విమర్శ

**భువనేశ్వర్:** గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఎంజిఎన్ఆర్ఇజిఎ స్థానంలో 'విబి–జి రామ్ జి'ని తీసుకురావడంపై నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నేత రణదీప్ సింగ్ సుర్జేవాలా తీవ్రంగా విమర్శించారు. బిజెపి మహాత్మా గాంధీని గానీ, శ్రీరాముడిని గానీ గౌరవించదని, వారిని కేవలం ప్రచారానికి వాడుకుంటుందని సూర్జేవాలా ఆరోపించారు. శనివారం భువనేశ్వర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సూర్జేవాలా మాట్లాడుతూ యుపిఎ హయాంలోని ఎంజి నరేగా స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) చట్టాన్ని తీసుకురావడం వల్ల సుమారు 50 కోట్ల మంది పేదల జీవనోపాధిపై ప్రభావం పడిందని పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా, ప్రచారం కోసం మహాత్మా గాంధీ కళ్ళజోడును వాడుకున్నారు కానీ ఆయన ఆదర్శాలను విస్మరించరని, అదే



విధంగా, బిజెపి శ్రీరాముడి పేరుతో అధికారాన్ని చేజిక్కించుకుంది కానీ ఆయన ఆదర్శాలను విస్మరించిందని మండిపడ్డారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజి నరేగా) స్థానంలో కొత్త చట్టం తీసుకురావడం వల్ల సుమారు 12.5 కోట్ల మంది పేద, గిరిజన, దళిత, వెనుకబడిన తరగతుల ప్రజలపై నేరుగా ప్రభావం పడిందని ఆయన పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులను కూడా కలుపుకుంటే, బిజెపి ప్రభుత్వ నిర్ణయం మొత్తం 50 కోట్ల మంది ప్రజలపై ప్రభావం చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. నరేగా ఒక డిమాండ్ ఆధారిత వ్యవస్థ అని, ఏ కార్మికుడైనా పంచాయతీని సంప్రదించి పని కోరవచ్చని సూర్జేవాలా చెప్పారు. నరేగా కింద కొన్ని రోజుల్లో పని కల్పించకపోతే, వేతనాలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అయితే, కొత్త చట్టం ప్రకారం, ప్రతిదీ ఢిల్లీ నుండే నిర్ణయించబడుతుందని, ఏ రాష్ట్రానికి, జిల్లాకు లేదా గ్రామానికి ఎంత పని ఇవ్వాలో ఢిల్లీలో కూర్చున్న వారే చెబుతారని పరోంగా మోదీనిద్దేశించి వ్యాఖ్యానించారు. నరేగాకు పూర్తిగా కేంద్రమే నిధులు సమకూర్చేదని, అయితే కొత్త చట్టం కింద రాష్ట్రాలు 40 శాతం ఖర్చును భరించాల్సి ఉంటుందని కాంగ్రెస్ ఎంపి అన్నారు. 'మనకు తెలిసినట్లుగా, రాష్ట్రాలు 40 శాతం నిధులను చెల్లించలేవు, కాబట్టి పేదలకు పని కల్పించాలనే ఆలోచన వాటంతట అవే ఆగిపోతాయి' అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ అజయ్ కుమార్ లల్లు మాట్లాడుతూ, పార్టీ జనవరి 10న ఒడిశాలో 'ఎంజి నరేగా బచావో సంగ్రామ్'ను ప్రారంభించనుందని, ఇది ఫిబ్రవరి 25 వరకు కొనసాగుతుందని తెలిపారు.

## ఫరీదాబాద్ మహిళ గ్యాంగ్ రేప్ సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మహిళా కమిషన్

**ఫరిదాబాద్:** ఫరీదాబాద్‌లో 25 ఏళ్ల మహిళపై జరిగిన సామూహిక అత్యాచారం ఘటనను హర్యానా రాష్ట్ర మహిళా కమిషన్ ఆదివారం సుమోటోగా స్వీకరించిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై వివరణాత్మక నివేదికను, పోలీసులు ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి ఫరీదాబాద్ పోలీస్ కమిషనర్ సతేందర్ కుమార్ గుప్తాను కమిషన్ చైర్మన్ రేణు భాటియా అడిగి తెలుసుకున్నారని వారు చెప్పారు. 'నేను బాధితురాలి కుటుంబంతో మాట్లాడాను. ఆమెకు అవసరమైన అన్ని సహాయాన్ని అందిస్తాము' అని భాటియా అన్నారు. ఇదిలా ఉండగా, బాధితురాలికి తన ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న డాక్టర్ అమిత్ యాదవ్ మాట్లాడుతూ బాధితురాలి పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. 'ఆమె ముఖంపై ఏర్పడిన లోతైన గాయాలను సరిచేయడానికి శనివారం ముఖానికి శస్త్రచికిత్స జరిగిందని, మహిళ అంగీకరించిన తర్వాత, ఆమె విరిగిన కుడి భుజానికి శస్త్రచికిత్స చేస్తామని చెప్పారు. పోలీసుల వివరాల ప్రకారం, బాధితురాలు సోమవారం సాయంత్రం ఫరీదాబాద్‌లోని సెక్టార్ 23లో ఉన్న తన స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. తిరిగి ఇంటికి వస్తున్నప్పుడు, ఆమె ఎన్ఐటి 2 చౌక్ వరకు ఆటోరిక్షాలో వెళ్లి, ఆ తర్వాత మెట్రో చౌక్ వరకు నడిచి వెళ్లింది. అర్ధరాత్రి సమయంలో తన ఇంటికి వెళ్లడానికి ఆటో కోసం అక్కడ నిలబడి ఉండగా, ఒక ప్రైవేట్ ఆసుపత్రి అంబులెన్స్ డ్రైవర్‌తో సహా ఇద్దరు నిందితులు ఆ మహిళకు లిఫ్ట్ ఇస్తామని చెప్పారని వారు తెలిపారు. అయితే, 25 ఏళ్ల బాధితురాలిని ఆమె గమ్యస్థానానికి తీసుకెళ్లకుండా, వారు గురుగ్రామ్ వైపు వెళ్తూ కదులుతున్న వాహనంలోనే ఆమెపై సామూహిక అత్యాచారం చేశారని వారు ఆరోపించారు. రాత్రంతా ఆమెను వాహనంలో తిప్పి, మంగళవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఫరీదాబాద్‌లోని రాజా చౌక్ సమీపంలో వాహనం నుండి బయటకు తోసేశారని పోలీసులు తెలిపారు. బాధితురాలిని తర్వాత ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చినట్లు పోలీసులు చెప్పారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు నిందితులు, ఒకరు మధుర వాసి కాగా, మరొకరు ఝాన్సీ వాసి, వారిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపారు.

## అగ్నిప్రమాదంలో ద్విచక్ర వాహనాలు దగ్ధం




**త్రిస్సూర్(కేరళ) :** త్రిస్సూర్ రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రాంతంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు 500 ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయని అగ్నిమాపక, రెస్క్యూ సర్వీస్ అధికారులు తెలిపారు. ఉదయం 6.20 గంటల ప్రాంతంలో పెయిడ్‌పార్కింగ్ షెడ్‌లో మంటలు చెలరేగాయని, సుమారు 6.40 గంటలకు సహాయం కోసం కాల్ వచ్చిందని అధికారి తెలిపారు. కవర్ కప్పి పార్క్ చేసిన ఒక ద్విచక్ర వాహనంపై పడిన విద్యుత్ తీగ నుండి వచ్చిన నిప్పురవ్వే అగ్నిప్రమాదానికి కారణమని అనుమానిస్తున్నారు. ఆ షెడ్‌లో సుమారు 500 ద్విచక్ర వాహనాలు పార్క్ చేసి ఉన్నాయని అధికారులు అంచనా వేశారు. వాటిలో అధిక భాగం ఈ ఘటనలో కాలిపోయాయి. ఐదు అగ్నిమాపక యంత్రాలను మోహరించామని, ఉదయం 7.45 గంటల ప్రాంతంలో మంటలను అదుపులోకి తీసుకువచ్చామని అధికారులు తెలిపారు. మంటలు రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారాలకు వ్యాపించకుండా, మరింత నష్టం జరగకుండా నిరోధించడానికి అన్ని చర్యలు తీసుకున్నారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశానికి సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఒక లోకోమోటివ్ పార్క్ చేసి ఉన్నప్పటికీ, దానికి పెద్దగా నష్టం జరిగినట్లు రైల్వే అధికారులు ధృవీకరించలేదని అధికారి తెలిపారు. ద్విచక్ర వాహనాలతో పాటు, టిన్ షీట్లతో కప్పబడిన మొత్తం షెడ్ కూడా అగ్నిప్రమాదంలో దెబ్బతిందని అధికారి చెప్పారు. అగ్నిప్రమాదానికి కచ్చితమైన కారణాన్ని తెలుసుకోవడానికి పోలీసులు, రైల్వే అధికారులు దర్యాప్తు ప్రారంభించారని అగ్నిమాపక అధికారులు తెలిపారు. త్రిస్సూర్ వెస్ట్ పోలీసులు అగ్నిప్రమాద ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎఫ్ఐఆర్ ప్రకారం, అగ్నిప్రమాదంలో సుమారు 500 ద్విచక్ర వాహనాలతో పాటు, రైల్వే స్టేషన్ పశ్చిమ వైపున పార్కింగ్ సౌకర్యాన్ని నిర్వహించే కాంట్రాక్ట్ పొందిన అశ్వతి ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన పార్కింగ్ ఫీజు ప్రింటింగ్ యంత్రం కూడా దగ్ధమైంది. ఇది కాకుండా, అశ్వతి ఎంటర్‌ప్రైజెస్ ఉద్యోగులకు చెందిన రెండు మొబైల్ ఫోన్లు, రూ. 10,000 నగదు కూడా అగ్నిప్రమాదంలో కాలిపోయాయని ఎఫ్ఐఆర్ పేర్కొంది.రాష్ట్ర పోలీసు చీఫ్ రవాడ ఎ చంద్రశేఖర్ సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. 'పార్కింగ్ ప్రాంతంలోని ఉద్యోగుల వాంగ్మూలాల ఆధారంగా ప్రాథమిక అంచనా వేశాం. అసిస్టెంట్ కమిషనర్, సర్కిల్ ఇన్స్పెక్టర్లతో సహా అదనపు పోలీసు సూపరింటెండెంట్ నేతృత్వంలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశాం.' అని ఆయన విలేకరులకు తెలిపారు. ఈ సంఘటన తర్వాత, కేరళ అంతటా చెల్లింపు పార్కింగ్ సౌకర్యాల వద్ద అగ్నిమాపక తనిఖీలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. 'పోలీస్ సూపరింటెండెంట్ (రైల్వే) దీనికి బాధ్యత వహించారు. ఆయన ఈ విషయాన్ని పరిశీలించి నివేదిక సమర్పిస్తారు. అదనంగా, స్థానిక పోలీసులు, రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్)తో కూడిన భద్రతా యంత్రాంగాన్ని బలోపేతం చేయడానికి ఉమ్మడి ప్రయత్నం జరుగుతుంది' అని చంద్రశేఖర్ అన్నారు. విద్యుత్ లైన్ నుండి నిప్పురవ్వ వచ్చి అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమిక ప్రకటనలు సూచించాయని, అయితే దానిని నిర్ధారించడానికి మరింత దర్యాప్తు అవసరమని ఆయన అన్నారు. రెవెన్యూ మంత్రి కె రాజన్ కూడా సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని అంచనా వేశారు.




# సాహిత్య విశ్వరూపం..

సాహిత్య ప్రక్రియల్లో శరవేగంగా చోటు చేసుకుంటున్న పరిణామాలను.. ప్రమాణాలను పరిశీలిస్తే, ఒక నిర్దిష్ట ఆకృతి లేదా ఒకే ప్రక్రియకు రచనలు పరిమితం కావడం లేదని, ఏదో ఒక చట్రంలో ఇరుక్కొని అల్లాడడం లేదని స్పష్టమవుతున్నది. సాహిత్య విశ్వరూపం సాక్షాత్కరిస్తున్నది. గత ఏడాది వచ్చిన ఎన్నో రచనలు ఈ విషయాన్ని రుజువు చేశాయి. కొత్త సంవత్సరంలో సాహిత్యం మరిన్ని మార్పులకు లోనవుతుందనడంలో అనుమానం లేదు. రాజకీయపరంగా ప్రపంచం ముక్కచెక్కలుగా విడిపోయి, యుద్ధాల్లో మునిగితేలుతున్నప్పటికీ, సాహితీపరంగా వసుధైక కుటుంబంగా పరిఢవిల్లుతున్నది. నేటి సాహిత్యం విభిన్న స్వరాల సమ్మేళనం, అనేక భావోద్వేగాల ప్రతిఫలనం, ఆధునిక సాంకేతిక పరిణామాలతో ముడిపడిన సృజనాత్మక వ్యక్తీకరణ. మానవ సమాజం ఎదుర్కొంటున్న మార్పులు, ఒత్తిడులు, ఆశలు, భయాలు వంటి ఎన్నో అంశాలన్నీ కలిసి ఈ కాలపు సాహిత్యానికి ఒక ప్రత్యేక స్వరూపాన్ని ఇచ్చాయి. గత దశాబ్దాల్లో సాహిత్యం అనేక సంక్షోభాలను చూసింది. మహమ్మారి అనంతర మానసిక అలసట, రాజకీయ అస్థిరత, వాతావరణ మార్పుల భయం, కృత్రిమ మేధస్సు ఎదుగుదల వంటివి సాహిత్యంపై లోతైన ప్రభావం చూపాయి. ఇప్పుడు రాబోయే రచనల్లో కేవలం ఆందోళన మాత్రమే కాదు, దానికి ప్రతిస్పందనగా ఆశ, స్వస్థత, మానవీయత కూడా ప్రధానంగా దర్శనమిస్తాయన్న ఆశాభావం వ్యక్తమవుతున్నది. ప్రక్రియల మధ్య అంతరాలను చెరిపివేయడాన్ని సరికొత్త సాహిత్యంలో చూడవచ్చు. ఒకప్పుడు సాహిత్యాన్ని 'ఇది ప్రేమ నవల, ఇది థ్రిల్లర్, ఇది సైన్స్ ఫిక్షన్' అంటూ స్పష్టంగా వర్గీకరించేవారు. సరిహద్దులు ఉండేవి. కానీ ఇప్పుడు ఆ సరిహద్దులు మసకబారాయి. ఒకే కథలో ప్రేమ కూడా ఉంటుంది, రహస్యం కూడా ఉంటుంది, సామాజిక విమర్శ కూడా ఉంటుంది, కొన్నిసార్లు సైన్స్ ఫిక్షన్ లేదా చారిత్రక నేపథ్యమూ కలుస్తుంది. పాఠకుడు కేవలం ఒకే అనుభూతిని కాకుండా, అనేక అనుభూతులను ఒకే రచనలో పొందాలని కోరుకుంటున్నాడు. రచయిత కూడా ఆ ఆశయాన్ని గుర్తించి కథనాన్ని బహుళస్థాయిల్లో నిర్మిస్తున్నాడు. ఈ ప్రక్రియల మేళవింపు నేటి సాహిత్యానికి ప్రధాన లక్షణంగా మారింది. అయితే, అంతకంటే ఎక్కువగా నేటి సాహిత్యం సమాజం పెనవేసుకుపోయింది. విడదీయరాని బంధం లో నిలిచి ఉంది. అది కేవలం సౌందర్యానుభూతిని అందించే కళామాధ్యమంగా మాత్రగాక, అన్యాయాలపై ప్రశ్నలు వేసే, మౌనంగా ఉన్న వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చే, మార్పు కోసం మనసులను కదిలించే శక్తివంతమైన ఆయుధంగా కూడా రూపాంతరం చెందుతున్నది. ఈ సందర్భంలో ప్రగతిశీల, సామ్యవాద ధోరణులు నేటి సాహిత్యంలో ప్రధానంగా సామాజిక న్యాయం, సమానత్వం, వ్యవస్థాగత మార్పు కోసం ఇచ్చే పిలుపుగా కనిపిస్తున్నాయి. రచయితలు అధికార నిర్మాణాలను విమర్శిస్తూ, అట్టడుగున పడివున్న వర్గాల పక్షాన నిలబడి, మరింత సమానమైన సమాజాన్ని ఊహిస్తూ తమ కలాన్ని వినియోగిస్తున్నారు. సమాజం ఎదుర్కొంటున్న ఆర్థిక అసమానతలు, కుల వివక్ష, లింగ పక్షపాతం, జాతి ఆధారిత అన్యాయాలు, రాజకీయ అవినీతి వంటి సమస్యలను సాహిత్యం అద్దంలా ప్రతిబింబిస్తున్నది. ఈ ప్రతిబింబం అలంకారికమైనది కాదు. ఎందుకంటే, అది వాస్తవికతతో నిండినది. పీడితుల జీవితాలను, వారి దైనందిన పోరాటాలను నిజాయితీగా చిత్రించడం ద్వారా పాఠకుడిలో అవగాహనను, ఆలోచనను పెంపొందించడమే ఈ తరహా సాహిత్య లక్ష్యంగా గోచరిస్తున్నది. సమాజంలోని లోపాలను చూపించడం ద్వారా అవి సహజమైనవో, మారనివో కాదని, మార్పుకు లోబడి ఉన్నవేనని స్పష్టంగా తెలియజేస్తుంది. ఇలాంటి ప్రగతిశీల సాహిత్యం సంక్లిష్టమైన సామాజిక, రాజకీయ సమస్యలను మానవీయంగా మారుస్తున్నది. గణాంకాలు, సిద్ధాంతాలు దూరంగా అనిపించిన చోట, కథలు, కవితలు, పాత్రలు మన హృదయాలను తాకుతాయి. ఒక కార్మికుడి బాధ, ఒక రైతు నిరాశ, ఒక మహిళ ఎదుర్కొనే వివక్ష, ఒక దళితుని అవమానం... ఇవన్నీ వ్యక్తిగత అనుభవాలుగా పాఠకుడి మనసులో నిలుస్తాయి. ఈ భావోద్వేగ అనుసంధానమే అన్యాయాన్ని ప్రశ్నించే తొలి అడుగు. ఇతరుల బాధను మనదిగా అనుభవించినప్పుడే సమాజాన్ని మార్చాలనే తపన పుడుతుంది. ఇలాంటి రచనలు కేవలం అవగాహన కల్పించడంతోనే ఆగిపోవు. చర్యకు ప్రేరేపిస్తాయి. మనలో చేయగల శక్తిని సృష్టించడమే ఈ రచనల లక్ష్యం. చరిత్రలో కొనసాగిన దాస్యపు అవశేషాలపై తిరుగుబాటు చేసే భావాన్ని, సామాజిక సాధికారతపై విశ్వాసాన్ని ఇది పెంపొందిస్తుంది. చదువరుడు ఒక నిశ్చేష్ట వీక్షకుడిగా కాక, మార్పు ప్రక్రియలో భాగస్వామిగా మారాలని ఇది కోరుకుంటుంది. గత ఏడాది పరఢవిల్లిన ప్రగతిశీల, సామ్యవాద సాహిత్యం ఈ ఏడాది కూడా తన విశ్వరూపాన్ని చూపడం ఖాయం. ఇది అణచివేతకు గురైన వర్గాల గొంతుకలను ముందుకు తీసుకువస్తుంది. కార్మికులు, రైతులు, శ్రామిక వర్గాలు, చారిత్రకంగా వెలివేయబడిన సమూహాలకు సంబంధించిన కథలు ప్రధాన సాహిత్య వేదికలపై స్థానం పొందుతున్నాయి. సంప్రదాయ సాహిత్య వ్యవస్థలు విస్మరించిన జీవిత అనుభవాలను ఈ రచనలు కేంద్రబిందువుగా మారుస్తాయి. దీని ద్వారా సాహిత్యం ఒక వర్గానికే పరిమితం కాకుండా, సమాజం మొత్తానికి చెందిందనే భావన బలపడుతుంది. విమర్శతో పాటు ప్రత్యామ్నాయాలను ఊహించడమూ నేటి సాహిత్య ముఖ్య లక్షణంగా కనిపిస్తున్నది.



సమాన హక్కులు, సహకారం, సమృద్ధి, సామాజిక న్యాయం వంటి విలువల ఆధారంగా నిర్మితమయ్యే భవిష్యత్తు చిత్రాన్ని ఇది మన ముందుంచుతుంది. వనరుల పంచకం, గౌరవంతో కూడిన జీవనం, మానవ సంబంధాల్లో సమానత్వం వంటివి కల్పిత యూటోపియాలుగా కాక, సాధ్యమైన లక్ష్యాలుగా చూపిస్తుంది. ఈ ఊహాశక్తే సమాజాన్ని ముందుకు నడిపించే ప్రేరణగా మారుతున్నది. నేటి సాహిత్యం ఎక్కువగా సాంస్కృతిక ప్రతిక్రియాశీల శక్తులతో స్పష్టంగా పోరాడుతున్నది. మూఢ విశ్వాసాలు, మౌలికవాదం, సామంతత్వ భావజాలం, సామ్రాజ్యవాద భావజాలం వంటి పాత వ్యవస్థలను ప్రశ్నిస్తూ, ఆధునికత, శాస్త్రీయ దృక్పథం, వలస విముక్తి ఆలోచనలను ప్రోత్సహిస్తున్నది. ఇది కాలానికి వెనుకబడిన ఆలోచనలకు వ్యతిరేకంగా నిలబడి, సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే శక్తిగా మారుతుంది. ఈ సందర్భంలో ప్రగతిశీలత, సామ్యవాదం మధ్య ఒక సూక్ష్మమైన తేడా కూడా కనిపిస్తుంది. ఆధునిక ప్రగతిశీల సాహిత్యం అవకాశాల సమానత్వంపై ఎక్కువగా దృష్టి పెడుతూ, సంస్కరణాత్మక విధానాలు, చైతన్యవంతమైన ప్రభుత్వ పాత్ర ద్వారా కనీస వేతనం, ఆహార భద్రత, రాజకీయ హక్కులు వంటి అంశాలపై దృష్టి సారిస్తుంది. మరింత స్పష్టమైన సామ్యవాద దృక్పథం అయితే ఉత్పత్తి సాధనాల సామాజిక స్వామ్యం వంటి మూలభూత మార్పులపై దృష్టి కేంద్రీకరిస్తుంది. అయినప్పటికీ, మనిషికి గౌరవప్రదమైన జీవితం లభించాలన్నదే ఈ రెండింటి మధ్య అంతర్లీనంగా ఉన్న సమాన లక్ష్యం. ఎన్నో రకాలుగా నేటి సాహిత్యంలో ప్రగతిశీల, సామ్యవాద ధోరణులు నైతిక ఆలోచనకు, సామాజిక మార్పుకు నిరంతర శక్తిగా కొనసాగుతున్నాయి. మానవ జీవనంలోని పోరాటాలు, ఆశలు, మెరుగైన జీవితానికి ఉన్న ఆకాంక్షలు సాహిత్య కేంద్రంలోనే ఉండాలని ఇవి గుర్తుచేస్తున్నాయి. ఈ సాహిత్యం మనలను ప్రశ్నిస్తుంది, కదిలిస్తుంది, మార్పు వైపు నడిపిస్తుంది. ఇది ఆహ్వానించ తగిన పరిణామం.

కాగా, ఒకప్పుడు ప్రపంచాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన 'ప్రేమ' మరోసారి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. రోజులో ఎక్కువ సమయం యాంత్రికంగా గడిచిపోతున్న తరుణంలో, ప్రేమతత్వం మళ్లీ వేళ్లూనుకుంటున్నది. ప్రేమ సాహిత్యాన్నే ఇటీవలి కాలంలో ఎక్కువ మంది చదువుతున్నారని, అలాంటి పుస్తకాలే ఎక్కువగా అమ్ముడవుతున్నారని ఒక అభిప్రాయం. ప్రేమ రచనలు అంటే కేవలం ఇద్దరి మధ్య సంబంధం మాత్రమే కాదు... అవి మనిషి ఒంటరితనానికి, భయాలకు, ఆత్మవిశ్వాసానికి సంబంధించిన అంశాలు మారాయి. వేగవంతమైన, ఒత్తిడితో నిండిన జీవనశైలిలో పాఠకుడు భావోద్వేగ సాంత్వన కోసం సాహిత్యాన్ని ఆశ్రయిస్తున్నాడు. అందుకే ప్రేమ సాహిత్యం ఒక రకమైన మానసిక విశ్రాంతిని అందించే సాధనంగా మారింది. దీనితో పాటు ఫాంటసీతో కలిసిన ప్రేమ కథలు, అంటే రోమాంటసీ, ఈ కాలంలో అపూర్వమైన ఆదరణ పొందుతున్నాయి. కల్పిత ప్రపంచాలు, మాంత్రిక శక్తులు, బలమైన పాత్రలు, వాటి మధ్య వికసించే ప్రేమ వంటివి పాఠకులను, ముఖ్యంగా యువతను ఆకర్షిస్తున్నాయి. సామాజిక మాధ్యమాలు సైతం ఇలాంటి రచనలను ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రేమ సాహిత్యంతో పాటు దాని లోపలే అనేక ఉపరూపాలు విస్తరించాయి. క్రీడాకారుల జీవితాలను ఆధారంగా చేసుకున్న ప్రేమ కథలు, మానసికంగా క్లిష్టమైన, చీకటి కోణాలను స్పృశించే ప్రేమ కథలు, లింగ వైవిధ్యాన్ని ప్రతిబింబించే సంబంధాల కథలు ఇప్పుడు ప్రధాన ప్రవాహంలోకి వచ్చాయి. ఒకప్పుడు విమర్శలకు భయపడి, ఎక్కడో సాహిత్య ప్రపంచ అంచుల్లో ఉన్న కథలు ఇప్పుడు కేంద్రంలో నిలుస్తున్నాయి. ఇది సమాజంలో మారుతున్న విలువలను, సమానత్వంపై పెరుగుతున్న అవగాహనను ప్రతిబింబిస్తుంది. ఇదే సమయంలో థ్రిల్లర్, మానసిక సస్పెన్స్ సాహిత్యం తన స్థిరమైన పాఠక వర్గాన్ని కొనసాగిస్తోంది. నేరం, రహస్యం, మానవ మనస్సులోని చీకటి మూలాలు ఎప్పటి మాదిరిగానే పాఠకుడిని ఆకర్షిస్తూనే ఉంటాయి. అయితే నేటి థ్రిల్లర్ కథలు కేవలం హత్యలు లేదా మిస్టరీలకే పరిమితం కావడం లేదు. అవి కుటుంబ సంబంధాలు, గృహహింస, గుర్తింపు సంక్షోభం వంటి అంశాలను లోతుగా తవ్వుతున్నాయి. దీనితో పాటు సాంకేతికత ఆధారంగా రూపొందిన కథలు, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, డేటా నిఘా, డిజిటల్ నియంత్రణ వంటి అంశాలతో కూడిన కథలు, పాఠకుడిలో భయంతో పాటు ఆలోచనను కూడా రేకెత్తిస్తున్నాయి. ఈ కథలు భవిష్యత్తుపై హెచ్చరికలుగా కూడా పనిచేస్తున్నాయి. గతంలో డిస్టోపియన్ సాహిత్యం విస్తృతంగా పాపులర్ అయినప్పటికీ, ఈ సంవత్సరం ప్రారంభం నాటికి పాఠకుల్లో దానికి ఒక రకమైన అలసట కనిపిస్తుంది. నిరంతరం విధ్వంసం, చీకటి భవిష్యత్తు చూపించే కథలకంటే, ఇప్పుడు పాఠకులు ఆశను చూపించే కథలను కోరుకుంటున్నారు. అందుకే ఆశావహమైన సైన్స్ ఫిక్షన్, హోప్‌పంక్, సోలార్‌పంక్ వంటి ధోరణులు బలపడుతున్నాయి. ఇవి భవిష్యత్తును సమస్యలతో నిండినదిగా కాకుండా, పరిష్కారాలతో కూడినదిగా ఊహిస్తాయి. సమాజం కలిసి పనిచేస్తే, ప్రకృతితో సమన్వయం సాధిస్తే, మానవాళి ముందుకు సాగగలదనే సందేశాన్ని ఇవి ఇస్తాయి. నేటి సాహిత్యంలో మానసిక ఆరోగ్య అంశాలపై చాలా సున్నితమైన, బాధ్యతాయుతమైన ప్రస్తావనలు కనిపిస్తున్నాయి. ఒత్తిడి, డిప్రెషన్, ఆందోళన, ఒంటరితనం వంటి అనుభవాలు ఇప్పుడు కథలలో సాధారణంగా కనిపిస్తున్నాయి. అయితే అవి కేవలం బాధను చూపించడానికే కాకుండా, స్వస్థత, పరస్పర సహాయం, వ్యక్తిగత ఎదుగుదల వంటి కోణాలను కూడా ఆవిష్కరిస్తున్నాయి. ఈ అర్థంలో సాహిత్యం ఒక రకమైన 'సామూహిక థెరపీ'లా మారింది. సామాజిక స్పృహతో కూడిన రచనలు కూడా ఈ కాలంలో కీలక స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఒకప్పుడు ప్రధాన సాహిత్యంలో చోటు దక్కని అనేక వర్గాల అనుభవాలు ఇప్పుడు బలమైన స్వరంతో వినిపిస్తున్నాయి. అణగారిన సముదాయాల జీవితం, వారి పోరాటాలు, వారి సంస్కృతి – ఇవన్నీ కథలుగా మారుతున్నాయి. చరిత్రను, పురాణాలను, క్లాసిక్స్‌ను కొత్త కోణంలో తిరిగి చెప్పే ప్రయత్నాలు పెరిగాయి. ఇవి కేవలం పాత కథలను మళ్లీ చెప్పడం కాదు... వాటిలో దాగి ఉన్న అధికార సంబంధాలను ప్రశ్నించడం, కొత్త అర్థాలను వెలికి తీయడం. ఇదే సమయంలో నాస్టాల్జియా కూడాసాహిత్యంలో ఒక ముఖ్యమైన భావంగా మారింది. 1990లు, 2000ల ప్రారంభ కాలం నేపథ్యంగా కథలు పెరుగుతున్నాయి. అప్పటి సంగీతం, టెలివిజన్ కార్యక్రమాలు, సాంకేతిక మార్పుల తొలి దశలు – ఇవన్నీ పాఠకులకు ఒక రకమైన సాంత్వనను, భద్రతా భావాన్ని అందిస్తున్నాయి. అనిశ్చిత భవిష్యత్తు మధ్యలో గతం ఒక ఆశ్రయంగా మారుతోంది.

పబ్లిషింగ్ రంగంలో కూడా గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఆడియోబుక్స్ వేగంగా విస్తరిస్తున్నాయి. ప్రయాణాల్లో, పనుల మధ్యలో కూడా కథలను వినగలగడం వల్ల ఆడియో కథలకు విస్తృత ఆదరణ లభిస్తోంది. పూర్తి నటీనటులతో, నేపథ్య ధ్వనులతో రూపొందిన ఆడియో పుస్తకాలు ఒక నూతన అనుభూతిని సృష్టిస్తున్నాయి. కృత్రిమ మేధస్సు (ఎఐ) ఎడిటింగ్, మార్కెటింగ్, కంటెంట్ విశ్లేషణ వంటి రంగాల్లో విస్తృతంగా ఉపయోగిస్తున్నాయి. అయితే, పూర్తిగా ఎఐ సృష్టించే పుస్తకాలపై పాఠకుల ఆసక్తి కొంత తగ్గుతోంది. మానవ స్వరం, మానవ అనుభూతి ఇప్పటికీ విలువైనదనే భావం పెరుగుతున్నది. డిజిటల్‌తోపాటు స్వయం ప్రచురణ రచయితలకు కొత్త అవకాశాలను తెరచాయి. సంప్రదాయ ప్రచురణ సంస్థలపై ఆధారపడకుండా, రచయిత నేరుగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాఠకులను చేరుకునే పరిస్థితి ఏర్పడింది. దీనితో పాటు ముద్రిత పుస్తకాలకు కూడా ఒక కొత్త విలువ ఏర్పడింది. అందమైన కవర్లు, ప్రత్యేక డిజైన్లు, సేకరణకు అనువైన సంచికలు పుస్తకాన్ని కేవలం చదవదగిన వస్తువుగా కాకుండా, ఒక కళాఖండంగా మార్చాయి.

> పఠనం కూడా ఇప్పుడు ఒక సామాజిక అనుభవంగా మారుతోంది. ఆన్‌లైన్ కమ్యూనిటీలు, సెలబ్రిటీ బుక్ క్లబ్‌లు, ప్రత్యక్ష పఠన సమావేశాలు వంటివి పాఠకులను ఒకరితో ఒకరు అనుసంధానిస్తున్నాయి. పుస్తకం చదవడం ఒక వ్యక్తిగత చర్య మాత్రమే కాకుండా, చర్చ, సంభాషణ, సాంస్కృతిక భాగస్వామ్యంగా మారింది. పర్యావరణ స్పృహ కూడా ఈ కాలపు సాహిత్య మరియు ప్రచురణ రంగంలో ముఖ్యమైన అంశంగా మారింది. పునర్వినియోగ కాగితం, కార్బన్‌న్యూట్రల్ ముద్రణ వంటి విధానాలు ప్రచురణలో అమలవుతున్నాయి. పాఠకులు కూడా స్థిరత్వాన్ని గౌరవించే ప్రచురణలను ప్రోత్సహిస్తున్నారు. ఈ పరిణామ క్రమంలోనే, కథలు కేవలం పుస్తకాల్లోనే పరిమితం కావడం లేదు. ఒక కథ పుస్తకంగా మొదలై, వెబ్ సిరీస్‌గా, సినిమాగా, వీడియో గేమ్‌గా, ఇంటరాక్టివ్ యాప్‌గా విస్తరిస్తోంది. ఈ క్రాస్‌మీడియా కథనాలు కథకు కొత్త జీవం ఇస్తున్నాయి, విస్తృత ప్రేక్షకులను చేరుకుంటున్నాయి. మొత్తంగా చూసినప్పుడు, 2026 సాహిత్యం ఒక మార్గమధ్య దశలో ఉన్న సజీవ సాంస్కృతిక ప్రక్రియ. ఇది సాంకేతికతను స్వీకరిస్తూనే, మానవ అనుభూతిని కేంద్రంగా ఉంచుతోంది. భయం, ఆశ, ప్రేమ, పోరాటం, స్వస్థత తదితర అంశాలు ఈ కాలపు సాహిత్యాన్ని నిర్వచిస్తున్నాయి. భవిష్యత్తు ఎంత అనిశ్చితంగా ఉన్నా, కథ చెప్పాలనే మానవ అవసరం మాత్రం ఇంకా అదే బలంతో కొనసాగుతోంది. నేటి సాహిత్యం ఆ సత్యానికి ఒక బలమైన సాక్ష్యంగా నిలుస్తోంది.

## ఈ వారం కవితలు (వందేళ్ల సిపిఐ సంబురాల సందర్భంగా)




### వందేళ్ళ పోరాటాల చరిత్ర చాటుతున్న జెండా

జెండా ఎగురుతున్నది
ఎర్ర జెండా ఎగురుతున్నది
భారత కమ్యూనిస్టు పార్టీ
జెండా ఎగురుతున్నది
వందేళ్ళ పోరాటాల
చరిత్ర చాటుతున్నది. ॥జెండా॥

భారతదేశం మెచ్చిన జెండా
కాన్పూర్‌లో పుట్టిన జెండా
పేదల మదిలో మెరిసిన జెండా
కష్టజీవులు పట్టిన జెండా
పోరాటాల్లో వెలిగిన జెండా
దేశమంతటా నిండిన జెండా
జెండా ఎగురుతున్నది
ఎర్రజెండా ఎగురుతున్నది
భారత కమ్యూనిస్టు పార్టీ
జెండా ఎగురుతున్నది
వందేళ్ళ పోరాటాల
చరిత్ర చాటుతున్నది.

కంటికి రెప్పలా కాపలగుంటూ
కష్టజీవుల కాచే జెండా
మట్టి మనుషుల గుండెల్లోన
సంఘం శక్తిని నింపిన జెండా
వెట్టి బతుకుల బంధుక్ జేసి
సాయుధ పోరును నడిపిన జెండా

జెండా ఎగురుతున్నది
ఎర్రజెండా ఎగురుతున్నది.
భారత కమ్యూనిస్టు పార్టీ
జెండా ఎగురుతున్నది
వందేళ్ళ పోరాటాల
చరిత్ర చాటుతున్నది.

తూర్పు దిక్కున సూర్యుడివోలే
ఎర్రని కాంతిని పంచిన జెండా
సంపూర్ణ స్వాతంత్రం కావాలంటూ
స్వాతంత్ర పోరు చేసిన జెండా
కార్మిక శ్రమకు విలువనుగట్టి
దోపిడీ గుట్టును విప్పిన జెండా
జెండా ఎగురుతున్నది
ఎర్రజెండా ఎగురుతున్నది
భారత కమ్యూనిస్టు పార్టీ
జెండా ఎగురుతున్నది
వందేళ్ళ పోరాటాల
చరిత్ర చాటుతున్నది.

దోపిడీ చేసే తిమింగలాలను
రోడ్డున కీడ్చే శ్రామిక జెండా
మీరెట్ కాన్పూర్ కుట్ర కేసులను
నిర్బంధాలను ఎదిరించిన జెండా
ఉన్మాదానికి ఊపిరి పోసే
మనువాదమును తరిమేజెండ
జెండా ఎగురుతున్నది
ఎర్రజెండా ఎగురుతున్నది
భారత కమ్యూనిస్టు పార్టీ
జెండ ఎగురుతున్నది
వందేళ్ళ పోరాటాల
జెండా ఎగురుతున్నది...

అమరవీరుల రక్తపు ధారల
సాహస బాటలో నడిచే జెండ
రక్తము చిందిన వీరుల త్యాగం
వృథా కాదని చాటిన జెండ
వర్గ రహిత సమాజం కోసం
సోషలిజాన్ని ప్రకటించిన జెండ
జెండా ఎగురుతున్నది
ఎర్రజెండా ఎగురుతున్నది
భారత కమ్యూనిస్టు పార్టీ
జెండాఎగురుతున్నది
అజరామర పోరాటాల
జెండా ఎగురుతున్నది ...

– కె.వి.ఎల్.
9490952649

## మన కమ్యూనిస్టులు



ప్రజల తరపున పోరుజేస్తారు మన కమ్యూనిస్టులు
ప్రజల కొరకు ప్రాణమిస్తారు మన కమ్యూనిస్టులు
ప్రజల సుఖము కోరుకుంటారు మన కమ్యూనిస్టులు
పాలకులను ప్రశ్నిస్తారు మన కమ్యూనిస్టులు ॥ప్ర॥

విభజించి పాలించే ఆంగ్లపాలన వద్దంటు
స్వరాజ్యం స్వపరిపాలన భారతీయుల హక్కంటూ
పోరాట మార్గంలో స్వాతంత్ర్యం సాధించిరి
బ్రిటీషోడి చేతినుండి మనదేశపాలన భూర్జువాల పాలైంది ॥ప్ర॥

అదే దోపిడీ దౌర్జన్యం మరో కోణపు కుంభకోణం
సహజ వనరుల విక్రయంతో పర్యావరణ కాలుష్యం
ప్రైవేటైజేషన్ పడగనీడలో కార్పొరేట్ అస్థిరత్వం
ఐరావతం అన్న రాజ్యాంగం ఆర్థిక అసమానతలు ఆపలేదయ్యో ॥ప్ర॥

నీతిలేని నాయకత్వం నియంతృత్వం చేసినపుడు
రోజురోజుకి ధరలు పెంచి విర్రవీగి పోయినపుడు
అరచేతిలో స్వర్గంతో మోసగించే మోసగాళ్లను
నిలదీసి ప్రశ్నిస్తూ మన కమ్యూనిస్టులు నిప్పులై మెరిసినారయ్యో ॥ప్ర॥

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏకస్వామ్యం పనికిరాదు
ఒకటి రెండు పార్టీలకే పట్టంగట్టుట సరికాదు
కమ్యూనిస్టులు గెలవాలి కొత్త మార్పు రావాలి
నవ సమాజ నిర్మాణంలో మనదేశం నందనవన మవ్వాలి
అన్నిరంగాలభివృద్ధితో ఈ ప్రపంచములో అగ్రగామిగా నిలవాలి ॥ప్ర॥

డాక్టర్ ఎస్. సూర్య ప్రకాష్

## ప్రగతిమార్గం

ఆకాశమంతా అరుణారుణపతాకం సుత్తి కొడవలి కార్మిక
కర్షక చిహ్నం
చైతన్యంతో సాగిపోతుంది
మనం భారత కమ్యూనిస్టు సైన్యం
ఎంతో మంది అమరుల రక్తంతో
ఎరుపెక్కినది ఆ జెండా, అది సత్యం
వందేళ్ళుగా రెపరెపలాడుతూ
అదే చైతన్య స్రవంతిలో అనునిత్యం

మార్క్స్ఎంగెల్ కమ్యూనిస్టు ప్రణాళిక
రష్యా బకునిన్ సిద్ధాంతం వెలుగులో
కర్షక కార్మికులను ఏకంచేసి
ప్రజా పైనం నిర్మించినది

గద్దర్ వీరుల, బోల్షివిక్ విప్లవం
రష్యామార్గం ప్రపంచ పోరాటాల
స్ఫూర్తితో భారత దేశంలో కమ్యూనిస్టు సైన్యం కవాతు చేస్తూ నడిచింది

లాటీలు, తూటాలు నిషేధాలు
నిర్బంధాలు ఎదుర్కొని
అతివాద మితవాద కాంగిరేసుతో
భుజం కలిపి ఆంగ్లేయులను
దేశం నుండి తరిమికొట్టిన పార్టీరా!

బ్రిటీష్ దొరలను తరిమికొట్టినది
సంస్థానాధీషులను అంతమొందించినది
బూర్జువా భూస్వాముల గడీలను
ధ్వంసం చేసినది మూడక్షరాల
మన సిపిఐ ముందు కేగినదిరా!
ఎఐటియుసి, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్
కార్మిక కర్షక మేధావి
ప్రజాసంఘాలే అంగాలుగా
ముందుకునడిచి అన్నిరంగాలల్లో
దూసుకు పోయిన
చైతన్య కెరటమే యర సిపిఐ రా!

కర్షకులకు గిట్టుబాటు ధరలు
కార్మికులకు కనీస వేతనాలు
స్త్రీలకు శ్రమకు తగ్గ జీత భత్యాలు
నియమిత పని గంటలు విద్యా,
వైద్యం సౌకర్యాలు
సాధించి పెట్టిన పార్టీ మనదిరా!

భారత కమ్యూనిస్టు పార్టీ
ఉమ్మడి కుటుంబం నుండి
చిన్న చిన్న సైద్ధాంతిక వైరుధ్యాలతో
మన అన్నదమ్ములు
కమ్యూనిస్టులు వేరుపడినవారు
ఉమ్మడి ఆశయం కోసం వారు
పోరాడుతున్నారు

చీలిపోయి పేలిపోయి చిన్న పార్టీలుగా
బలహీనపడి ప్రజలకు దూరమయ్యారు
ఓ కమ్యూనిస్టు సోదరులారా!
సామ్రాజ్య వాద, పెట్టుబడిదారి
పార్టీలకు బలమిస్తున్నారు.

మన దేశం కోసం మన ప్రజల కోసం
మనమంతా ఒక్కటై
వామపక్ష ప్రజాతంత్ర
ఐక్యసంఘటనగా ఏర్పడి
బలమైన రాజకీయశక్తిగా ఎదుగుదాం
భారతదేశాన్ని ప్రగతిమార్గంలో
నడుపుదాం.

– బూర భిక్షపతి
9866612717

## చదవాల్సిన పుస్తకం

# సామాజిక చైతన్య స్వరం.. 'జన చంద్రోదయం'

పరిచయం అవసరం లేని పాటల ప్రేమికుడు... మాట ల మాంత్రికుడు... కవిగా, గేయ రచయితగా అందరికీ తెలిసిన గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ రాసిన పాటల సంకలం 'జన చంద్రోదయం' ఎక్కడా చంద్రుడిలా చల్లగా ఉండదు. ప్రచండ సూర్యుడి తీవ్రత ఇందులో ఉన్న వంద పాటల్లోనూ కనిపిస్తుంది... సామాజిక చైతన్యానికి స్వరం గా వినిపిస్తుంది.. కార్మిక, కర్షక గొంతుకై, ప్రతి పాట... ప్రతి పదంలోనూ నిప్పులా రగిలించిన కమ్యూనిస్ట్ కాబట్టే, ఆయన తన రచనలతోనే కుళ్లిన సమాజానికి 'కర్రుకాల్చి వాత' పెడతారు. సాహిత్యం చాలా రూపాల్లో మన ముందుకు వస్తుంది. అందులో చాలా భాగం వ్యక్తిగత భావాలకు, ప్రేమకు, అభిరుచులకు సంబంధించినదే. కానీ కొద్ది మంది మాత్రమే, సమాజ లోతుల్ని చూస్తారు. బాధ, శ్రమ, ఆకలి, అణచివేత, దోపిడీ లాంటి వాస్తవాలను గ్రహిస్తారు. న్యాయం కోసం పరితపిస్తారు. పదాలకు ఛురకత్తులు తగిలించి, అన్యాయాల కుత్తుకలు తెగనరుకుతారు. అలాంటి రచయితల్లో 'గడ్డమీది' స్థానం ముందు వరుసలోగాక ఎక్కడ ఉంటుంది? 'కవి హృదయం అతి సున్నితం. ప్రతి సంఘటనకూ అది త్వరగా స్పందించే లక్షణం కలది. అతడి మూలాలు ఉద్యమాల్లో ఉంటే... అదీ ప్రగతిశీల ఉద్యమాల్లో ఉంటే.. చెప్పనక్కర్లేదు. జనం గొంతుకై లేస్తాడు. ఆ కవితాత్వికత జనఘోషగా ప్రతిబింబిస్తుంది అతని రచనల్లో. సరిగ్గా చంద్రమోహన్ గౌడ్ అలాంటివాడే' అంటూ అరసం సభ్యుడు, ప్రముఖ రచయిత ఏటుకూరి ప్రసాద్ ముందుమాటలో కితాబునివ్వడం చాలా రచయిత ప్రతిభను, పాటల్లో వేడిని వర్ణించడానికి.

**'తల్లి నా ఎర్రని జెండా..**
**నీకున్నది చరిత్ర అణువణువు నిండా**
**పరాయి చేతిలో గాయాల పాలయ్యి**
**సిరులున్న నా తల్లి విలవిల్లాడంగా**
**సూడలేక నాడు నేతలంతా కూడి**
**అరుణ బీజాలను అవనిపై జల్లిరి'** అంటూ, శతాబ్ది ఉత్సవాల జరుపుకొంటున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భావాన్ని వర్ణించినా,

**పోరుబాట పిలుస్తుంది**
**కదలి రమ్ము నేస్తమా..**
**నిన్ను నన్ను ఏకమై**
**ఉద్యమించి మన్నది**
**రణం జెయ్యమన్నది'** అంటూ స్ఫూర్తిబాట చూపినా, అది 'గడ్డమీది' పాటేనని స్పష్టమవుతుంది. ఈ పుస్తకంలో పొందుపరచిన ఏ పాటను ప్రస్తావించినా, మరో పాటకు అన్యాయం చేయడమే. ఏ కోణాన్ని స్పృశించినా మరో పార్శ్వాన్ని విస్మరించినట్టే. కమ్యూనిజాన్ని ఒక శాస్త్రంగా అభివర్ణిస్తూ, సిపిఐ అజరామరమని నినదిస్తూ...

(((((**'పుట్టుక దప్ప సావులేని పోరు పార్టీ మనదిరా**
**జరుగుతున్న దోపిడీపై ఎదిరించిన జెండారా**
**శ్రమ జీవుల ఊపిరైన తిరుగుబాటు జెండారా**
**పుట్టుక తప్ప సావులేని పోరు పార్టీ మనదిరా'** అంటారు రచయిత. పార్టీని రైతుకూలీ పొలంలో ఉదయించిన పొద్దుగా, జనం గుండె నెగడులో ఎరుపెక్కిన జెండాగా పేర్కొంటారు. 'చెరసాలలు, ఉరితాళ్లకు జంకనట్టి పార్టీరా మంచి కొరకు మార్పు కొరకు పుట్టినట్టి పార్టీరా' అంటూ సిపిఐ ఘనతను వేనోళ్ల శ్లాఘించారు. వీటిలో వాస్తవాలే తప్ప అతిశయోక్తులు ఎక్కడా లేవు... కనిపించవు. ఎరుపు ఆయన నరనరాల్లో జీర్ణించుకుంది కాబట్టే, ఎర్ర జెండాకు పట్టం కట్టారు.

**'ఉద్యమ చరిత కలిగిన జెండా**
**పోరు నడిపిందీ ఎర్రని జెండా**
**దేశమంతా ఎగురుతుంది జనం గుండెల నిండా**
**కార్మిక, కర్షకులకు నిరంతరం**
**నిలుస్తుంది అండా'**
అంటారు.)))))))




కార్మికులు, కర్షకులు, తాడితులు, పీడితులు, బాధితులు, సిపిఐ, ఎర్ర జెండా.. ఇవీ 'గడ్డమీది' పాటల పునాదులు. కమ్యూనిజం ఆయన రక్తంలో ప్రవహిస్తున్నదని, పాటల్లో అక్షర రూపమై బయటపడుతుందని 'జన చంద్రోదయం' స్పష్టం చేస్తుంది. కమ్యూనిస్టు కాబట్టే ఆయన స్వరం మృదువైన లాలిత్యం కనిపించదు.. అంతులేని క్షోభ, కోపం, తిరుగుబాటు, మానవ గౌరవ మేళవింపులు పలకరిస్తాయి. భారమైన పరికరాల గర్జన ఆ పాటల్లో ప్రతిధ్వనిస్తుంది. వ్యవసాయ భూమిలో మట్టిని మోస్తున్న రైతు అడుగుల సవ్వడి వినిపిస్తుంది. అంతులేని అణచివేతలు.. అక్రమాలు.. అన్యాయాలు.. దుర్మార్గాలు చూసినవాడు కాబట్టే, ఆయన మాటలు పదునుగా, సూటిగా హృదయాల్లోకి చొచ్చుకుపోతాయి. 'గడ్డమీది' ప్రస్తావించిన శ్రమజీవులు కళ్లెదుటే ఉన్నా పట్టించుకునేవారు చాలా అరుదు. ఆ బాధ్యతను భుజాలకెత్తుకున్న రచయిత 'గడ్డమీది'. ఆయన పాటల్లో దోపిడీ యంత్రాంగం నేరుగా మానవత్వాన్ని ఎలా పీల్చేస్తున్నదో తేటతెల్లమవుతుంది. ఒకరి కడుపు నింపడానికి మరొకడు ఎన్ని కష్టాలు పడుతున్నాడో బహిర్గతమవుతుంది. 'జన చంద్రోదయం'లో ఉన్న పాటలు పాఠకులను ఉర్రూతలూగించడమేకాదు.... పాటగాడిగా మార్చేస్తాయి. అంతటి లయబద్ధమైన శబ్ద సౌందర్యం ఉంది. నిరసనకారుడిగా మారుస్తాయి.. అంతటి బలమైన సందేశం ఉంది. కేవలం కమ్యూనిస్టులు.. వామపక్ష భావజాలం ఉన్నవారు మాత్రమేకాదు, మనవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ చదువుకోవాల్సిన... కొని దాచుకోవాల్సిన పుస్తకం.

### పుస్తకం పేరు

**జన చంద్రోదయం**
**జనం కోసం కలం గేయాలు**
**రచయిత: గడ్డమీది చంద్రమోహన్ గౌడ్**
**వెల: రూ.200/**

**ప్రతులకు**
**నవచేతన పబ్లిషింగ్ హౌస్**
**గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) ఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).**

## కుటుంబానికి ప్రగాఢ సానుభూతి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలంలోని వెనుగు మట్ల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎల్లలా రామ్ మోహన్ రెడ్డి తల్లి సరోజన ఇటీవల మరణించారు. ఆదివారం జరిగిన వారి దశ దినకర్మ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొని వారి చిత్రపటా నికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి మనోధైర్యం కల్పిం చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొల్లపల్లి,



మాజీ సర్పంచ్ ముస్కు నిశాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్, వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, గ్రామ సర్పంచ్ నక్క స్రవంతిజములకర్, మాజీ సర్పంచ్ చిర్ర గంగాధర్ ,మాజీ ఉప సర్పంచ్ కొండా వెంకటేష్ గౌడ్, ఎల్లలా లింగారెడ్డి , మహేష్, విక్రమ్,తదితరులు పాల్గొన్నారు.

## ధరూర్ గ్రామ సర్పంచ్‌కు సన్మానం

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామ మెదరి(మహేంద్ర) సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ధరూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్‌గా ఎన్నికైన శీలం సురేందర్, బాలే శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దామోదర్ రావు, మాజీ సర్పంచ్ రెడ్డి ప్రభాకర్, మాజీ ఉప సర్పంచ్ శీలం మహేష్‌ను మెదరి(మహేంద్ర) సంఘం సభ్యులు ఆది వారం ఘనంగా సన్మానించారు. ధరూర్ గ్రామ మెదరి సంఘ అధ్యక్షుడు నరేష్, ఉపాధ్యక్షుడు సిలి వేరి పెద్దనర్సమ్మ, ప్రధాన కార్యదర్శి సిలివేరి శ్రీనివాస్, కోశాధికారి సిలివేరి స్వామి, గౌరవ సలహా దారులు పూరే రమేశ్, సంఘం సభ్యులందరు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ది ప్లే స్కూల్ వార్షికోత్సవాలు




**ప్రజాపక్షం/కొత్తపల్లి :** కరీంనగరంలోని స్థానిక జగిత్యాల రోడ్‌లో గల 'ది ప్లే స్కూల్‌'లో ఆదివారం ఘనంగా వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సంవత్సరం వేడుకలకు 'పంచతంత్రం' అని భూమిక ఎంపిక చేయడం విశేషం. చిన్నారులు సింహం, కుందేలు, ఏనుగు, జింక వంటి పంచతంత్ర కథలు పాత్రలుగా ధరించి నృత్యాలు, చిన్న స్కిట్లతో ప్రేక్షకులను ఆకట్టుకు న్నారు. వారి ప్రదర్శనల ద్వారా స్నేహం, నిజాయితీ, ఐకమత్యం, బుద్ధి వంటి మంచి విలువలను వారి ప్రదర్శన ద్వారా చక్కగా వివరించారు. పిల్లల అమాయకమైన నటన,రంగురంగుల వేషాధారణలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ పొల్సాని సుధాక ర్‌రావు మాట్లాడుతూ పంచతంత్ర కథల ద్వారా పిల్లలలో నైతిక విలువలను పెంపొందించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల సెక్రటరీ రమాదేవిగా, ప్రిన్సిపల్ ప్రభాదేవి ముఖియా, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు గ్రాండ్ పేరెంట్స్ పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరించిన చల్మెడ



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఏసి కన్వె న్షన్ హాలులో పద్మనాయక వెలమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను వేములవాడ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి, చల్మెడ విద్యాసంస్థల చైర్మన్ చల్మెడ లక్ష్మి నరసింహారావు హాజరై సంఘ బాధ్యులతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరించారు. క్యాలెండర్ ఆవిష్క రణ కార్యక్రమానికి వచ్చిన లక్ష్మి నరసింహారావుకు వెలమసంఘం సభ్యులు కలిసి ఘనస్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సత్క రించారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చల్మెడ లక్ష్మి నరసింహారావుతో పాటు కరీంనగర్ పద్మనాయక వెలమ సంఘం ఉపాధ్యక్షులు గంద్ర సంపత్‌రావు, ప్రధాన కార్యదర్శి చీటి ప్రకాష్ రావు, కార్యవర్గ సభ్యులు చిట్నేని మోహన్‌రావు, సుంకిశాల సంపత్‌రావు, జూపల్లి మాధవరావు, చిట్నేని రఘురాం రావు, పల్లెపాటి వేణుగోపాల్ రావు, ఐల్నేని సుధాకర్‌రావు, తాండ్ర అశోక్‌రావు, గాంద్ర మంజుల, పలు వురు వెలమ సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

## ప్రమాదబీమా.. ఆరోగ్యానికి ధీమా



**ప్రజాపక్షం/వీర్నపల్లి :** వీర్నపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాజన్న సిరిసిల్ల ఆటో యూనియన్ గౌరవాధ్య క్షుడు అధ్యక్షుడు బొల్లి రామ్మోహన్ చేతుల మీదుగా ఆటోడ్రైవర్లకు ప్రమాద బీమా కార్డులను అందించారు. ఆదివారం వీర్నపల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గుజ్జుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. ఆటోడ్రైవర్ల సంక్షేమానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఆటో యూని యన్ అధ్యక్షులు అల్లె శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ మల్లేషం, సర్పంచుల ఫోరం అధ్యక్షులు దేవరాజు, ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు రాంరెడ్డి, మండల మహిళాధ్యక్షురాలు గుగులోతు కళా మాజీ జడ్పీ కో అప్షన్ చాంద్, మండ లాధ్యక్షులు సంజీవ్, లింబాద్రి, కార్యకర్తలు ఆటోయూనియన్ సభ్యులు వెంట ఉన్నారు.

## కారు, ఆర్‌టిసి బస్సు ఢీ



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** కారు, ఆర్‌టిసి బస్సు ఢీకొన్న ఘటనలో పలువురికి తీవ్ర గాయాలైన ఘటన జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడిపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచే సుకుంది. ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపిన కథనం మేరకు మెట్‌పల్లి డిపోకు చెందిన టిఎస్ 16యుసి 3599 నెంబర్ గల ఆర్టీసీ బస్సు మెట్‌పల్లి నుండి ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్ బయలుదేరుతున్న క్రమంలో మేడిపల్లి గ్రామంలోని భాస్కర హాస్పిటల్ వద్ద ఆర్మూర్ నుండి కోరుట్ల వెళు తున్న ఎపి 09 బిఆర్ 4203 తవేరా కారు డ్రైవర్ ఠాగూర్ రాజేందర్ సింగ్ రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేస్తూ ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. దీంతో తవేరాలో ఉన్న కోరుట్ల పట్టణానికి చెందిన సుంకేం రాజేష్‌తో పాటు పలువురికి తీవ్ర గాయాలు కాగా. గాయపడ్డ క్షతగాత్రులు నిజామాబాద్‌లోని వెల్నెస్ హాస్పి టల్‌లో కొంతమంది, కరీంనగర్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌లో కొంతమంది చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఆర్టీసీ బస్ డ్రైవర్ కత్తి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఆర్యవైశ్య సంఘం మహిళా కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండల ఆర్యవైశ్య సంఘం మహిళ కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కాగా మల్లాపూర్ మండల ఆర్య వైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలిగా మండల కేంద్రానికి చెందిన కస్తూరి స్వప్న ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గాదె లిఖిత కోశాధికారిగా పడిగేల ఆమని నీ ఎన్నుకుని నియామక ఉత్తర్వులను అందజేశారు. అనం తరం ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. తమపై నమ్మకం ఉంచి తమను ఎన్నుకున్న మండల ఆర్యవైశ్య సంఘం మహిళలకు ప్రత్యేక కృతజ్ఞ తలు తెలిపారు.

# నాణ్యతతో బిటి రోడ్డు నిర్మాణం

### పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** నాణ్యతతో బీటీ రోడ్డు పనుల నిర్మాణం చేప ట్టాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. ఆది వారం రోజున పెద్దపల్లి మండలం హన్మంతునిపేట గ్రామంలో సమ్మక్కసర ళమ్మ జాతర కోసం కోటి రూపాయలతో నూతన బిటీ రోడ్డు నిర్మాణం కోసం స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి, రైతుల అభ్యున్నతికి తోడ్పాటున అందిస్తుందని తన నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ఉంచుతానని అన్నారు. అనంతరం పెద్దపల్లి మండలం కాసులపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన హాకా ఫార్మర్ సర్వీస్ సెంటర్‌ను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించి అనంతరం యాజమాన్యానికి శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీనివాస్, సంపత్ రావు,



కుమార్ గౌడ్, రాజయ్య, శ్రీనివాస్, సంపత్ పెద్దపల్లి మార్కెట్ వైస్ చైర్మన్, వార్డు సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ స్తులు , తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సత్యం తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండాలి



### చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొండగట్టు దేవా లయానికి ఒక్క రూపాయి నిధులు ఇచ్చినట్లు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పద వికి రాజీనామా చేస్తానని చేసిన వ్యాఖ్యలకు మేడిపల్లి సత్యం కట్టుబడి ఉండా లని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ డిమాండ్ చేశారు. ఆది వారం కరీంనగర్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రవి శంకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండగట్టు ఆంజ నేయ స్వామి దేవాలయానికి ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిధులు మంజూరు చేయడం శుభపరిణామమని అన్నారు. పవన్ కళ్యాణ్ కుటుంబానికి ఆంజనేయ స్వామి.. కుటుంబ దైవమని, అటువంటి పవిత్ర దేవాలయానికి నిధులు మంజూరు చేయడం భక్తులందరికీ ఆనందాన్ని కలి గించే అంశమని పేర్కొన్నారు. ఈ నిధుల మంజూరుతో తెలంగాణ ప్రభు త్వంలో కూడా చలనం వచ్చిందని వ్యాఖ్యానించారు. కొండగట్టు అభివృద్ధి విషయంలో అబద్ధాలతో ప్రజలను మభ్యపెడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. శాసనమండలి సాక్షిగా గత ప్రభుత్వం 100 కోట్లు నిధులు కేటాయించినట్లు మంత్రి కొండా సురేఖ చెప్పారని, మీ ప్రభుత్వ మంత్రి చెప్పింది నిజమా... అబద్ధమా... అని ప్రశ్నిం చారు. బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధికి కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసి, కొండగట్టుకు చేసిన అభివృద్ధిని గణాంకాలతో పాటు చిత్రపటాలను సహా మీడియా ద్వారా ప్రజలకు వివరించారు. తమ ప్రభుత్వ హయాంలోనే 680 ఎకరాల వందల కోట్ల విలువైన భూమిని కొండగట్టు దేవాలయానికి కేటాయించిన విషయం గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గంట్ల వెంకటరెడ్డి, సాగి మహిపాల్ రావు, ఆకుల మధుసూదన్, చీకట్ల రాజశేఖర్, పూడూరు మల్లేశం, విజయేందర్ రెడ్డి, ఉప్పల గంగన్న, నాగ శేఖర్, పైండ్ల శ్రీనివాస్, రామిడి సురేందర్, మామిడి తిరుపతి, తోట మురళి, శనిగరపు అనిల్, జగన్, గుడిసె తిరుపతి, చిరుత అంజయ్య, మిల్కుల తిరుపతి, మహేందర్, జనగం శ్రీనివాస్, తిరుప తిరెడ్డి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# అంధుల అక్షర ప్రధాతకు ఘన నివాళి

### ఎంప్లాయిస్ జెఎసి చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ :** కరీంనగర్‌లోని వికలాంగుల కాలనీలో నిర్వ హించిన లూయిస్ బ్రెయిలీ 217వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టిఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందులకు అక్షర ప్రధాత, అంధుల ఆరాధ్యదైవం లూయిస్ బ్రెయిలీ బ్రెయిలీ లిపి ద్వారా వేలాదిమందికి విద్య, ఉపాధి అవకాశాలు కల్పించి అనేక మంది అంధుల జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడని కొనియాడారు. వికలాంగత అడ్డంకి కాదని, నిర్లక్ష్యమే అడ్డంకి అని ఆయన సందేశమిచ్చారని, బ్రెయిలీ ఆశయాలను కొనసాగించే విధంగా ఉద్యోగ సంఘాలు ఎల్లప్పుడూ ముందుండి కృషి చేస్తాయని పేర్కొన్నారు. అంధ ఉద్యోగులకు ట్రాన్స్‌ఫర్‌లలో మినహాయింపులు ఇచ్చిన ప్రభుత్వానికి కృతజ్ఞ తలు తెలుపుతూ పదోన్నతులు, డిపార్టమెంట్ల టెస్టుల్లో మినహాయింపులు కల్పించే దిశగా నిరంతరం పోరాటం చేస్తామని హామీ ఇచ్చరు. ఈ కార్య క్రమం నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ సమాఖ్య సలహాదారుడు కె.నర్సయ్య



మార్గదర్శకత్వంలో విజువల్లి చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్య క్షుడు గురుప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కోశా ధికారి ముప్పిడి కిరణ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు గూడ ప్రభాకర్‌రెడ్డి, సర్దార్ అర్విందర్ సింగ్, సర్వే ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీని వాస్, నేషనల్ బ్లైండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ సురేష్ తదితరులు పాల్గొని లూయిస్ బ్రెయిలీ ఆశయాలను కొనసాగించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు.

## జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ధూల్మిట్ట పాఠశాల విద్యార్థి రిత్విక్



### ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి

**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** ధూల్మిట్ట మండలకేంద్రంలోని జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న శిరబోయిన రిత్విక్ జాతీ యస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ధూల్మిట్ట పాఠశాల ప్రధానోపా ధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వెగ్గలం సతీష్ కుమార్‌లు తెలిపారు. ఇటీవల మెదక్ జిల్లా మనోహరాబాద్‌లో నిర్వహిం చిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలలో విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో ఈ నెల 9 నుండి 12 వరకు హర్యానాలో జరిగే జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో ఎంపికైన శిరబోయిన రిత్విక్ పాల్గొననున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ వెగ్గలం సతీష్‌కుమార్ తెలిపారు. చదువుతో పాటుగా ఆటల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరుస్తున్నా పాఠశాల విద్యార్థు లను, ప్రోత్సహించి ఉత్తమమైన శిక్షనలతో ముందకు తీసుకపోతున్న ఫిజి కల్ డైరెక్టర్ వెగ్గలం సతీష్‌కుమార్‌ను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అను ముల కర్ణాకర్‌రెడ్డిలను గ్రామ సర్పంచ్ గునుకుల లీల జగన్‌మోహన్ రెడ్డి, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## వెలగని వీధిదీపాలు..

### అంధకారంలో బస్టాండ్ ప్రాంగణం

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** ఎల్లారెడ్డిపేట మండలంలోని కొత్తబస్టాండ్ ప్రాంగణం పరధిలో ఉన్న స్ట్రీట్‌లైట్లు వెలగకపోవడంతో రాత్రి కాగానే అంధ కారంలో మునిగిపోయి వెలవెలబోతుంది. పాలకవర్గం వీధిలైట్లు బాగుచే యించాలని మీడియాతో తమ గోడును వెల్లగక్కారు. పదోవార్డులో ఉన్న మెంబర్ సమస్యను పాలకవర్గం దృష్టికి తీసుకువెళ్ళి వీధిలైట్లు మరమ్మ త్తులు చేయించాలని కోరుతున్నారు. ప్రధాన కూడలి వద్ద బస్టాండ్‌కు వెళ్ళే మార్గంలో వెలుతురు లేక కారుచీకట్లు కనిపిస్తున్నాయని ప్రయాణికులు, గ్రామస్థులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా స్పీడ్ బ్రేకర్లు లేక పలువురు ప్రమాదాల భారిన పడుతున్నారు. సంబంధిత ఆర్టీసీ అధికారులు చొరవతీసుకుని జీబ్రా క్రాసింగ్ లైన్‌తో బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని అంటున్నారు. ప్రైవేటు వాహనాలు జోరుగా వెలుతుంటా యని బస్టాండ్ ప్రాంగణం కొత్తవారికి కనిపించడం లేదని ఓ ప్రైవేటు అసు పత్రి ఉండటంతో నిరంతరం రద్దీగా ప్రయాణికులు ఉంటారని పలు జాగ్ర త్తలు తీసుకోవాలని చెబుతున్నారు. బస్సు డ్రైవర్ బస్సును బస్టాండ్ ప్రాంగ ణంలోకి మలుపు తీయాలంటే మదర్స్ లవ్ బొమ్మ ఇబ్బందిగా నిలుస్తుంద న్నారు. ఆ బొమ్మవల్ల ప్రయోజనం లేదని అవసరమైతే అదే స్థానంలో స్వర్గీ య వెంకట్‌రెడ్డిబాపు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే గౌరవంగా ఉంటుందన్నారు.



# పారమిత 'విజ్ కిడ్ 2025-26 కాంటెస్ట్'కు విశేష స్పందన



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** నగరంలోని పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠ శాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విజ్ కిడ్ కాంటెస్ట్‌కు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కాంటెస్ట్‌ను 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న పారమితేతర విద్యార్థులకు నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 5 నుంచి 10వ తరగతి వరకు దాదాపు 3500కు పైగా విద్యార్థులు ఈ పరీక్షను రాశారు. ఈ విజ్ కిడ్ కాంటెస్ట్ ముఖ్య ఉద్దేశ్యం పిల్ల లను మ్యాథ్స్, సైన్స్ విభాగాలలో ప్రోత్సహించడానికి, వారిలోని ప్రతిభను వెలికితీయడానికి దోహదపడుతుందన్నారు. ఈపరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 5వ తరగతి నుంచి10వ తరగతి వరకు ప్రతి తరగతి నుంచి పది మంది విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అంద జేయబడతాయన్నారు. అన్ని తరగతులకు కలిపి మొత్తం నగదు పురస్కారం రూ.4 లక్షలను అందజేస్తామని పారమిత పాఠశాలల చైర్మన్ డా.ఇ.ప్రసాద రావు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థు లలో సమగ్ర అభివృద్ధిని, నేర్చుకోవాలనే ఆసక్తిని, ఆరోగ్యకరమైన పోటీత త్వాన్ని పెంపొందించడానికి ఈ పరీక్షను ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, రాకేష్, అనూకర్‌రావు, వినోద్‌రావు, వియుయం ప్రసాద్, హన్మంతరావు, ప్రిన్సిపాల్ గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## ఓటరు జాబితాపై అభ్యంతరాలను పూర్తి స్థాయిలో పరిశీలించాలి

### కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** నగరపాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్ల ముసా యిదా ఎలక్ట్రోరల్ జాబితాపై వచ్చే అభ్యంతరాలను పూర్తి స్థాయిలో పరిశీలిం చాలని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డు ఆఫీసర్లతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అభ్యంతరాల పరిశీలన, వార్డుల వారిగా ఓటర్ల మ్యాపింగ్‌పై చర్చించారు. పలు సూచనలు చేస్తూ, ఆదే శాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారు లతో మాట్లాడుతూ, ప్రచురించిన ఎలక్ట్రోరల్ జాబితాపై వచ్చే అభ్యంతరాలను పూర్తి స్థాయిలో పరిశీలించి, ఎలాంటి లోటుపాట్లు జరగకుండా డివిజన్, పోలింగ్ బూత్ ప్రకారం మ్యాపింగ్ చేయాలన్నారు. జాబితాను డివిజన్ ఓటర్ల ప్రకారం ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని, సరైన పద్ధ తిలో ఓటర్ జాబితాను తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ గార్డులకు పటిష్ట భద్రత



### ఎఐటియుసి ఆర్జీ వన్ అధ్యక్షుడు ఎం.ఎ.గౌస్ డిమాండ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు పటిష్ట భద్రత కల్పించాలని, ప్రైవేటు సెక్యూరిటీ గార్డు లపై దాడి చేసిన డ్రగ్స్ గంజాయి మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని, దాడికి గురైనా సెక్యూరిటీ సిబ్బందికి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసు కోవాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయ న సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్న సెక్యూరిటీ గార్డు లను పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ శనివారం స్థానిక సిఎస్‌పి వన్ వద్ద కొంతమంది డ్రగ్స్, గంజాయి మూకలు తచ్చాడుతుండగా వారిని వెళ్ళగొట్టేందుకు అక్కడికి వెళ్ళిన సెక్యూరిటీ సిబ్బందిపై దాడికి పాల్ప డడంతో వారు తీవ్రంగా గాయపడ్డారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా గనులు, డిపార్ట్‌మెంట్‌ల సమీప ప్రాంతాల్లో సంచరిస్తూ సెక్యూరిటి గార్డులపై దాడులకు పాల్పడుతున్న డ్రగ్స్, గంజాయి మూకలపై కఠిన చర్యలు తీసుకో వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## చమురే లక్ష్యంగా వెనిజులాపై దురాక్రమణ

### తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కమిటీ

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** చమురే లక్ష్యంగా వెనిజులాపై అమెరికా దాడులు చేస్తుందని, వెనిజులాలో 33 బిలియన్ల బ్యారెళ్ల చమురు నిల్వలను దురాక్రమాలు చేయడానికి, వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను ఆయన నివాసం నుంచే అమెరికా సైన్యం శుక్రవారం రాత్రి నిర్బందించి తీసుకుపోవ టంపై తెలంగాణ ప్రజాఫ్రంట్, పెద్దపల్లి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పులిపాక రవీందర్‌లు ఆరోపించారు. ఆదివారం పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మదురో తమ దేశంలో డ్రగ్స్ కార్టెల్స్‌ను నడుపుతూ అమెరికాలోకి అక్రమంగా మత్తు పదార్థాలను రవాణా చేస్తున్నారని ఆ దేశం ఎప్పటి నుండో ఆరోపిస్తోందని, అసలు కారణం అది కాదని, వెనిజులాలో ఉన్న విస్తారమైన చమురు, గ్యాస్, బంగారం నిల్వలను దోచుకోవడానికే మదురోను గద్దె దింపిందని, ప్రపం చంలో అత్యధిక చమురు నిల్వలు ఉన్న దేశాల్లో వెనెజుల ఒకటని, దేశంలో 19 బిలియన్ బ్యారెళ్ళ చమురు ఉందని అంచనా. ఇది ముమ్మాటికీ దురాక్ర మణ చర్య అని, ఆ దేశ సార్వభౌమాధికారంపై దాడిగానే మేము భావిస్తామని అన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వెనిజులా ప్రజలు చేస్తున్న పోరా టానికి తెలంగాణ ప్రజా ఫ్రంట్, పెద్దపల్లి జిల్లా కమిటీ సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తుందని తెలిపారు.

## కాళ్లు ముందడుగు వేస్తే.. రోగం వెనుకంజ : ఏసిపి రమేష్

**ప్రజాపక్షం/ముత్తారం :** కాళ్లు ముందడుగు వేస్తే.. రోగం వెనుకంజ వేస్తుం దని, ఆరోగ్యకరమైన జీవితానికి నడక చాలా అవసరం, ఎందుకంటే ఇది బరువు తగ్గించడం, గుండె ఆరోగ్యం మెరుగుపరచడం, రక్తపోటు నియంత్రిం చడం తోపాటు అనేక రకాలుగా వ్యాయామం ఉపయోగపడుతుందని గోదా వరిఖని ఏసీపీ మాడత రమేష్ అన్నారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా రామగిరి మండల కేంద్రం నుండి ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామం వరకు పోలీస్ సిబ్బందితో కలసి మార్నింగ్ వాకింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఆహారం ఎంత అవసరమో, శరీర అవయవాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడా నికి వ్యాయామం, నడక తప్పనిసరి అన్నారు. ఈ సందర్భంగా మచ్చుపేట గ్రామంలో వాకింగ్ చేస్తున్న సమయంలో పొలం పనికి వెళ్తున్న మహిళ కూలీ లతో కాసేపు ముచ్చటించారు. మహిళలకు ఏదైనా సమస్యలు ఉంటే వంద నెంబర్ ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని లేనియెడల దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి, టూ టౌన్ సీఐ ప్రసాద్ ముత్తారం ఎస్సై ఎన్ రవికుమార్, రామగిరి ఎస్సై తడవేన శ్రీనివాస్, మంథని ఎస్సై రమేష్, కమాన్‌పూర్ ఎస్సై ప్రసాద్‌తోపాటు ముత్తారం రామగిరి మండల పోలీస్ శాఖ సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర కీలకం



ప్రజాపక్షం / రెబ్బెన : ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు ఎంతో కీలకమని రెబ్బెన సిఐ సంజయ్ కుమార్, ఎస్ఐ వెంకటకృష్ణ అన్నారు. ఆదివారం రెబ్బెన సిఐ కార్యాలయం, పోలీస్ స్టేషన్ లో ప్రజా పక్షం దినపత్రిక 2026 క్యాలెండర్ ను వారు వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజాపక్షం పత్రిక ప్రజా సమస్యలను నిర్భయంగా రాస్తూ అతి తక్కువ కాలంలో ప్రజాదరణ పొందిందని పేర్కొన్నారు. పాత్రికేయులు నిజాలను రాస్తూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండాలని సూచించారు. అనంతరం ఎస్ఐ వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ఎంతో ముఖ్యమైనదని తెలిపారు. ప్రజల సమస్యలు రాయడంలో ప్రజా పక్షం పత్రిక ముందుందని కొనియాడారు.

## ముఖ్యమంత్రి దృష్టికి పెండింగ్ పనులు

ప్రజాపక్షం/నేరడిగొండ : అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆదివారం రేవంత్ రెడ్డిని బోథ్ నియోజక వర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్చం అందించారు.అనంతరం బోథ్ నియోజకవర్గంలోని పెండింగ్ పనుల పురోగతిపై పలు సమస్యలను సిఎం దృష్టికి తీసుకువెళ్లనని అన్నారు.పెండింగ్‌లోపనులపై సానుకూలంగా స్పందించారని తెలిపారు.



## కేతేశ్వర కంకాలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



ప్రజాపక్షం / జన్నారం : ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ఆదివారం కేతేశ్వర కంకాలమ్మ జాతర కరపత్రాలను ఆవిష్కరించారు. జన్నారం మండల కేంద్రంలో జనవరి 9, 10, 11 తేదీల్లో జరగనున్న జాతర సందర్భంగా క్యాంపు కార్యాలయ ఆవరణలో వీటిని విడుదల చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, ఇది ప్రజల ప్రభుత్వమని ప్రజల కోసమే పనిచేస్తుందని, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మహేంద్ర సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులు చిలువేరి లక్ష్మి నర్సయ్య, మాజీ అధ్యక్షులు మదిరే సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు నర్సయ్య, మల్లయ్య, రాజన్న, కనకయ్య, రవి, కృష్ణ, సతీష్, సుదీర్, వెంకటేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కాసిపేటకు సిపిఐ జీపు జాత

ప్రజాపక్షం / కాసిపేట : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వందేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్ కోరారు. ఖమ్మం సభకు ప్రజల భాగస్వామ్యం పెంచే ఉద్దేశంతో మంచిర్యాల జిల్లాలో ప్రారంభమైన జీపు జాత 5వ తేదీన కాసిపేట మండలంలో ప్రవేశించనుందని తెలిపారు. సిపిఐ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ఎఐటియుసి, భవన నిర్మాణ కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు, సానుభూతిపరులు పాల్గొని జీపు జాతను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ కలవేన శంకర్, మిట్టపల్లి వెంకటస్వామి, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కలివేరు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ మేకల దాసు, బొల్లం పూర్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జాడి పోశం పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

## పరీక్షా కేంద్రం సందర్శన

కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం/నర్సాపూర్: నర్సాపూర్ పట్టణ సమీపంలోని బి.వి.ఆర్.ఐ.టి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష కేంద్రాన్ని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించి పరిశీలించారు. ఈ పరీక్షకు జిల్లాలో 200 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. బివిఆర్ఐటి కళాశాలలో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలలో పరీక్షలు నిర్వహించగా 200 మంది హాజరు కావలసి ఉండగా 95 మంది హాజరయ్యారు అన్నారు. వారిలో 65 మంది మొదటి పేపర్ కు హాజరు కాలేదని, రెండవ పేపర్ కు 40 మంది హాజరు కాలేదని ఆయన తెలిపారు. ఆదివారం సైతం పరీక్ష జరుగుతుందని వివరించారు. జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఆయన తెలిపారు. ఆయన వెంట ఆర్డిఓ మైపాల్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజావాణికి కలెక్టర్

ప్రజాపక్షం/రేగోడ్ : రైతు వేదికలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తాసిల్దార్ దత్తరెడ్డి తెలిపారు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరిగే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు రానున్నారని తెలిపారు, ఈ ప్రజావాణికి మండల స్థాయి అధికారులు హాజరు కావాలని అన్నారు,సంక్షేమ పథకాలైన గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్ల తో పాటు రెవెన్యూ పంచాయితీ తాగునీటి సాగునీటి రోడ్లు తదితర వాటి పై దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

## సిపిఐ సభ్యత్వం నమోదు కార్యక్రమం ప్రారంభం



ప్రజాపక్షం/ సదాశిపేట: భారత కమ్యూనిస్టు 2026 నూతన సభ్యత నమోదు కార్యక్రమం ఆదివారం సిపిఐ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. తాజుద్దీన్ మాట్లాడుతూ ఈ దేశంలో సిపిఐ పుట్టి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సదాశివపేట మండల ప్రాంతంలో గతం కంటే ఎక్కువ సభ్యత్వం నమోదు చేపట్టాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేసారు. మన పార్టీ పుట్టి వంద సంవత్సరాలుగా ఈ దేశంలోసజీవంగా ఉందంటే అది పేదల పుణ్యమే , పేదలు ఎక్కడుంటారో సిపిఎం పార్టీ ఎక్కడ ఉంటుంది. నిరంతరం పేదల పక్షపాతిగా సీపీఐ ఉంది,. మన పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్బంగా మన ప్రాంతంలో సభ్యత నమోదు కార్యక్రమాన్ని భారీగా చేర్పించి మన సత్తా చాటాలన్నారు. 2026 సభ్యత్వాన్ని భారీగా చేర్పించాలని కోరారు.సిపిఐ నాయకులు ఎం. గంగమ్మ, పూలమ్మ, సరస్వతి ,ముస్తఫా , శివలీల ,రహీమ్ , వహిదా పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన సదస్సు

ప్రజాపక్షం/నిజాంపేట్: నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ రైతు వేదికలో రైతులకు కేవీకే ఆధ్వర్యంలో పంటలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఆ పేరును మార్చి రంజీ రాజుగారు యువజన పథకం పేరుతో రూపకల్పన చేశారని దానికి 125 రోజులు పని దినాలు ఉంటాయని అదేవిధంగా గతంలో కేంద్రం 90 శాతం రాష్ట్రం 10 తో పనులు జరిగేవని ప్రస్తుతం ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం 40 నిధులు ఇస్తుందని తెలిపారు అదేవిధంగా రైతులు వ్యవసాయ నికి ఉపాధి హామీ పథకాన్ని మళ్లించడం జరుగుతుందని తెలిపారు. అలాగే ప్రస్తుతం రైతులు వారి నాలుగు మాటలు వేశారని నారుమలలో చలి తీవ్రతతో ఎర్రబారడం జరుగుతుందని అందుకు అనుగుణంగా రైతులు ఉదయం పూట వేడి నీళ్లు పెట్టి జింకు చనిపోయిన వాడుకోవాలని తెలిపారు.

# గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు



ప్రజాపక్షం / మంచిర్యాల : గ్రంథాలయాలలో పాఠకులకు, ఉద్యోగార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచడం జరుగుతుందని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి సందర్శించి అక్కడ కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగం, గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. జిల్లాలోని గ్రంథాలయాలలో పాఠకులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు, సామాగ్రి సమకూర్చడం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టి అనేక మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తుందని వివరించారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతో పాటు పాఠకులకు, అభ్యర్థులకు అవసరమైన తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కోర్టు భవనాల నిర్మాణ పనులు త్వరిత గతిన పూర్తి

ప్రజాపక్షం/నిర్మల్ : నూతన కోర్టు భవనాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి సుజన అన్నారు.ఆదివారం సారంగాపూర్ మండలం చించోలి బి గ్రామ సమీపంలో పలు కోర్టుల భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు.ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు సుజన,లక్ష్మణ్,నర్సింగ్ రావు,జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌లు పాల్గొన్నారు.ముందుగా కోర్టు భవనాల నిర్మాణానికి సంబంధించి భూమి పూజ చేశారు.జిల్లాలో నూతన కోర్టు భవనాల నిర్మాణానికి చక్కని చదునైన స్థలాన్ని అధికారులు కేటాయించడం ఎంతో సంతోషకరమైన విషయమని వివరించారు.కోర్టులను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు త్వరితగతిన న్యాయ సేవలు అందించడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు.కోర్టు భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు.

### కోర్టుల ఆధునీకరణ ద్వారా న్యాయ సేవలో వేగం పెరుగుతుంది

### హైకోర్టు న్యాయమూర్తి నర్సింగ్ రావు

కోర్టులు ఆధునీకరణ చెందడం ద్వారా,అధునాతన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా సమాజానికి న్యాయ సేవలు మెరుగ్గా,త్వరితగతిన అందించడానికి వీలు కలుగుతుందని హైకోర్టు న్యాయమూర్తి నర్సింగ్ రావు అన్నారు.ప్రధాన న్యాయస్థానం పాటు,సీనియర్ జూనియర్ సివిల్ సెషన్స్ పోక్సో,ఎస్సీ,ఎస్టీ,ఫ్యామిలీ న్యాయస్థానాలతో సహా మొత్తం 12 కోర్టు భవనాలను నిర్మించుకోవడం జరుగుతుందని అన్నారు.ఈ కోర్టు భవన నిర్మాణాలు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి,ఎస్పీ జానకి షర్మిలలు మాట్లాడుతూ,నూతన భవనాల నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపనలు చేయడానికి హైకోర్టు న్యాయమూర్తులు జిల్లాకు రావడం సంతోషకరమైన విషయమని తెలిపారు. హాజరైన న్యాయమూర్తులు,కలెక్టర్ ను శాలువాలతో సన్మానించి,వారికి జ్ఞాపికలు అందజేశారు.వసతిగృహంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,పూల మొక్కలను అందించి స్వాగతం పలికారు.



## గ్రామీణ ప్రజల గొంతుక 'ప్రజాపక్షం'



ప్రజాపక్షం / కాసిపేట : 'ప్రజాపక్షం' దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి ఆదివారం కాసిపేట మండలం దేవాపూర్ లో నిర్వహించిన కార్యక్రమంలో విడుదల చేశారు. 'ప్రజాపక్షం' దినపత్రిక ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకువస్తూ గ్రామీణ ప్రాంత ప్రజల గొంతుకగా నిలుస్తోందని అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించే ధైర్యం పత్రికకు ఉందని, ప్రజల పక్షాన నిలబడే పాత్రికేయతను కొనసాగించాలని ఆకాంక్షించారు. బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, ప్రజాపక్షం పాత్రికేయుడు నజీర్ పాల్గొన్నారు.

## ఆరోగ్యాన్ని ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దు

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



ప్రజాపక్షం/నిజామాబాద్ : ఎన్ని రకాల ఒత్తిడిలున్నా ఆరోగ్యాన్ని ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కిషన్ గంజ్‌లో ఆర్యవైశ్య పట్టణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎ మ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొని అంతకుముందు వాసి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఉచిత హెల్త్‌క్యాంప్‌కు సన్‌రైజ్, మనోరమ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహించి బిపి, షుగర్ ఆర్థోపెడిక్, దంత, గుండకు సంబంధించిన పరీక్షలు మందులు అందజేశామన్నారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముక్కా దేవేంద ర్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, ప్రభాకర్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

## నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాపక్షం/లక్ష్మ ణచాంద : లక్ష్మ ణచాంద ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.ఆదివారం మండల కేంద్రంలోని డిఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మండల ప్రెస్ క్లబ్ సభ్యులు అందరు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా జడ్డి శ్రీనివాస్,ఉపాధ్యక్షుడిగా జడ్డి మహేష్,కోశాధికారి మెట్టు ప్రసాద్,ప్రధాన కార్యదర్శి గుజ్జారి ఈశ్వర్,గౌరవ సలహాదారులు కే.వెంకటేశ్వర్ రాజు..సభ్యులుగా పోతుగంటి నరేష్ కుమార్, గోలి గంగాధర్,మూగ శేఖర్,పోశెట్టి,రాజా గౌడ్,తలారి ముత్యం అనంతరం రాజ్యలక్ష్మి కార్యవర్గ సభ్యులు ఘనంగా సత్కరించడం జరిగింది.



## నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నదే లక్ష్యం

కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి రాజన్న

ఫౌండేషన్ చైర్మన్ ఆవుల రాజిరెడ్డి



ప్రజాపక్షం/నర్సాపూర్: నర్సాపూర్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించాలన్నదే తన లక్ష్యమని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, రాజన్న ఫౌండేషన్ చైర్మన్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఆదివారం నర్సాపూర్ లో రాజన్న ఎంప్లాయిమెంట్ సెల్ అఫీషియల్ ఆన్లైన్ రిజిస్ట్రేషన్ పేజీ తో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ, భారత్ ఉద్యోగ్ సంయుక్త సహకారంతో ప్రారంభమైన ఈ ఎంప్లాయిమెంట్ సెంటర్ ద్వారా ఉద్యోగుల భర్తీ కెరీర్ మార్గదర్శక సేవలు వృత్తి నైపుణ్య, శిక్షణ సేవలు పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఆన్లైన్ రిజిస్టర్ తో పాటు నియోజకవర్గంలోని గ్రామాలలో నేరుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టి ఆయా మండల కేంద్రాల్లో ఇంటర్వ్యూ నిర్వహించి ప్రైవేట్ రంగంలోని వివిధ కంపెనీలో ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు రాబోవు రోజుల్లో ఐటీ రంగంలో కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. పదవ తరగతి నుంచి పీజీ వరకు అర్హత కలిగిన అభ్యర్థులకు వారి నైపుణ్యాలకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ సెల్ పనిచేస్తుందని తెలిపారు. రానున్న మూడు సంవత్సరాల్లో నియోజకవర్గంలో నిరుద్యోగ యువతీ, యువకులకు పదివేల ఉద్యోగాల కల్పించాలన్నదే తన లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ తాజా మాజీ చైర్మన్ రాజ్ యాదవ్ పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీని పి.ఎంను చేసేవరకూ

# ప్రతీ కార్యకర్తా అవిశ్రాంతకృషి

టిజిఐఐసి నిర్మల జగ్గారెడ్డి

ప్రజాపక్షం/ సంగారెడ్డి : రాహుల్ గాంధీ ప్రదాని మంత్రిని చేసేవరకు ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త దీక్షతో పనిచేయాలని టీజీఐఐసి నిర్మల జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా ఆదివాసి కార్యకర్తలు, నాయకుల దేశ వ్యాప్త శిక్షణా తరగతుల్లో బాగంగా ఉమ్మడి మెదక్ జిల్లా శిక్షణ తరగతులు సంగారెడ్డి పట్టణంలోని పిఎస్సార్ గార్డెన్‌లో జరిగాయి. గిరిజన కార్పొరేషన్ చైర్మన్ ,నేషనల్ ఆదివాసి కాంగ్రెస్ వైస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు జరిగాయి. మూడు రోజుల పాటు జరిగే శిక్షణా తరగతులకు మొదటిరోజు టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.నిర్మలా జెగ్గారెడ్డి మాట్లాడుతూ మహిళలకు యాబై శాతం స్థానం ఉండాలని ఇక ముందు ఎక్కడ శిక్షణ తరగతులు ఏర్పాటు చేసిన మహిళలను ఉండేలా చూడాలని అన్నారు. త్వరలో జిల్లా కమిటీలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని అందులో కూడా 30 మంది మహిళలు ఉండేలా చూడాలని పది మంది ఎస్సీ, ఎస్టీ మహిళలకు అవకాశం దక్కేలా నిర్ణయం తీసుకోవాలని అన్నారు. మెదక్ జిల్లా ఒక చరిత్ర ఉందని ఇందిరాగాంధీ ఎంపిగా గెలిపించి దేశానికి ప్రధానిని అందించిన జిల్లా మెదక్ జిల్లా అన్నారు. ఎంతో ఆదృష్టం ఉంటే తప్ప ఆడజన్మ రాదని అలాంటి ఆడవారిని అప్పటి కాలంలో అనేక కట్టుబాటుకు గురిచేసి బందీ చేశారన్నారు. చదువుకు దూరం చేసి సతీసగహనం వంటి దురాచారాలను అమలు చేసే వారిని కానీ నేటి సమాజంలో మహిళలు పురుషులకు సమానంగా ఇంకా ఎక్కువే ముందున్నారని ,మహిళలు కలెక్టర్లు అవుతున్నారు. అనేక పదవులలో వారు ముందు ంటున్నారన్నారు. అంటే దీనంతటికి కారణం సావిత్ర బాయి పూలే స్పూర్తిగా తీసుకున్నారు. చదువుకుంటేనే సంస్కారం ,సంపద వస్తాయని ఆమె గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఒక్క వంద నలబై ఒక్క సంవతసరాలు పూర్తి చేసుకున్న పార్టీ అని ఇప్పుడు ప్రజల కోసమే పాటుపడే పార్టీ కాంగ్రెస్ అన్నారు. ఆదివాసీలను ఆర్థికంగా ,సామాజికంగా రాజకీయంగా ఎదిగేలా చేసిన ఘనత ఇందిరాగాంధీ కాంగ్రెస్ పార్టీ అన్నారు.



## జనవరి 6న సంగారెడ్డికి తెలంగాణ ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు

జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



ప్రజాపక్షం/ సంగారెడ్డి : తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ కమిషన్ చైర్మన్ తోపాటు కమీషన్ సభ్యులు ఈ నెల 6న సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్న ట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రా వీణ్య తెలిపారు. జనవరి 6న ఉదయం హైదరాబాద్ నుండి బయలు దేరి ఉదయం 10.30గంటల కు కోహిర్ మండలం జ్ఞా పూర్ గ్రామానికి చేరుకు ని బ్యాగరి రాములుకు నష్టపరిహారాన్ని పంపిణి చేస్తారని , అనంతరం ఉదయం 11.00 గంటలకు జహీరాబాద్ మండలం రంజోల్‌లోని సో షల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ గర్ల్స్ జూనియర్ కళాశాలను సందర్శిస్తారని తెలిపారు. తదుపరి సంగారెడ్డి కలెక్టరేట్‌కు చేరుకుని మద్యాహ్నం 2.00 గంటల కు జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహిస్తారని సమావేశంలో భూ సమస్యలు ,అట్రాసిటీ కేసులు ఎస్సీ ,ఎస్టీలకు సంబందించిన ఆర్ఓఆర్ అమలు ,బ్యాక్లాగ్ ఖాళీలు తదితర అంశాలపై సమీక్షించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు ,ఆర్డీఓలు ,తహసీల్దారులు, ఎంపిడిఓలు ,ఆర్పీ లు ,సంగారెడ్డి, జహీరాబాద్ మున్సిపల్ కమీషనర్లు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

## కాంగ్రెస్‌లో చేరిన పాలెం సర్పంచ్

ప్రజాపక్షం/మోర్తాడ్: నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని పాలెం గ్రామ సర్పంచి గా, స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన పలిగిరి రాధ రవి ఆదివారం బాల్కొండ నియోజకవర్గ కాం గ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. గ్రామ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన ఉపసర్పంచ్ ఫోరం ఏర్పాటు

ప్రజాపక్షం/భీమ్‌గల్ : మండంలోని ఉసర్పంచ్‌లు అందరూ కలిసి సమావశం ఏర్పాటు చేసుకుని అ ధ్యక్షునిగా రహత్‌నగర్ సేవలాల్ ఉపాధ్యక్షులు బా బాపూర్ గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి గోన్‌గొప్పుల శ్రావణ్‌కుమార్, కార్యదర్శి రూప్లాతండా అరుణ్, కోశాధికారి ప్రిపి రంజిత్, గౌరవ అధ్యక్షులు పల్లికొండ బాలయ్య, దేవక్కపేట్ లింగారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో రమే ష్, నర్సింగ్, రాజేష్, రమేష్, శోభన్, ప్రేమ్ చందు, విమల్, గణేష్, సురేష్ పాల్గొన్నారు.



## చైనా మాంజా విక్రయించొద్దు :సిపి



ప్రజాపక్షం/నిజామాబాద్ : జిల్లా పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లో చైనా మాంజ వాడకంతో ప్రజలకు జంతువులకు ప్రమాదం వాటిల్లే ప్రమాదముందని సిపి సాయిచైతన్య వెల్లడించారు. చైనా మాంజా అమ్మిన, అమ్మడానికి ఎవరైనా ప్రోత్సహించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడుతాయన్నారు. చైనా మాంజా నిల్వ, అమ్మిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుని వారి మాంజా ఉంటే తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలన్నారు. లేని యెడల చైనా మాంజా ఎవరైనా ఉపయోగిస్తున్నట్లు సమాచారం తెలిసినట్లయితే తమ దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని డయల్ 100 కు కాల్ చేయాలన్నారు.

# క్రీడ

## బ్రూక్, రూట్ అర్ధ శతకాలు..

### తొలిరోజు ఇంగ్లండ్‌దే ఆధిపత్యం!

మెల్‌బోర్న్ టెస్టులో విజయంతో యాషెస్ సిరీస్‌లో బోణీ కొట్టిన ఇంగ్లండ్ సిడ్నీలోనూ జోరు చూపించింది. సిరీస్‌లో మొట్టమొద టిసారి ఆ జట్టు బ్యాటర్లు క్రీజులో నిలబడి తొలి రోజే ఆలౌట్ గండాన్ని అధిగమించారు. ఓపెనర్లు విఫలమైనా.. హ్యారీ బ్రూక్(78 నాటౌట్), జో



రూట్(72 నాటౌట్)లు ఆస్ట్రేలియా బౌలర్లను ధీటుగా ఎదుర్కొంటూ అర్ధ శతకాలు బాదారు. ఫలితంగా.. తొలిరోజు ఆట ముగిసే సరికి ఇంగ్లండ్ 3 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది.

సిడ్నీ టెస్టులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ తొలి రోజు ఆధిపత్యం చెలాయించింది. వెలుతురు లేమి కారణంగా 45 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైనా పర్యాటక జట్టు మిడిలార్డర్ బ్యాటర్లు క్రీజునంటుకుపోయారు. ఓపెనర్లు బెన్ డకెట్(27), జాక్ క్రాలే(16)లు శుభారంభమిచ్చినా స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. కాసేపటికే బౌలాండ ఓవర్లో జాకబ్ బెథెల్(10) ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన జో రూట్(72 నాటౌట్), హ్యారీ బ్రూక్(78 నాటౌట్)లు ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వలేదు. 57కే మూడు కీలక వికెట్లు పడిన వేళ వీరిద్దరూ ఏకొంచెం తడబడినా, ఒక చెత్త షాట్ ఆడినా ఇంగ్లండ్ ఆలౌటయ్యేది.

కానీ, వీరు చెక్కుచెదరని ఏకాగ్రతతో క్రీజులో పాతుకుపోయి స్కోర్‌బోర్డును నడిపించారు. ఆస్ట్రేలియా బౌలర్ల వ్యూహాలను చిత్తు చేస్తూ రూట్, బ్రూక్ అర్ధ శతకాలతో స్కోర్ 200 దాటించారు. నాలుగో వికెట్‌కు 150పరుగులు రాబట్టడంతో ఆసీస్ బౌలర్లు నీరుగారిపోయారు. రెండో రోజు కూడా ఈ ద్వయం సెంచరీలు సాధిస్తే ఇంగ్లండ్ పటిష్ట స్థితిలో నిలిచినట్టే. వరుసగా.. పెర్త్, బ్రిస్బేన్, అడిలైడ్‌లో ఓడిన ఇంగ్లండ్ సిరీస్‌ను కోల్పోయిన విషయం తెలిసిందే.

## వరల్డ్‌కప్ ఆడుతాం..

### కానీ, మా జట్టును భారత్‌కు పంపించం!





భారత్, బంగ్లాదేశ్ మధ్య దౌత్య సంబంధాలే కాదు క్రికెట్ సంబంధాలు కూడా దెబ్బతింటున్నాయి. హిందువుల హత్యలను నిరసిస్తూ ఐపీఎల్ నుంచి బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను బిసిసిఐ తప్పించడాన్ని ఆ దేశ బోర్డు సీరియస్‌గా తీసుకుంది. ఫిబ్రవరిలో జరుగబోయే ప్రపంచకప్ కోసం స్క్వాడ్‌ను ప్రకటించిన బంగ్లా క్రికెట్ బోర్డు కీలక ప్రకటన చేసింది. వరల్డ్‌కప్ ఆడేందుకు తమ జట్టును ఇండియాకు పంపమని ఐసిసికి ఈమెయిల్ చేసింది. పొట్టి ప్రపంచకప్ సమీపిస్తున్న బంగ్లాదేశ్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఆదివారం సమావేశమైన బంగ్లా బోర్డు సభ్యులు ముస్తాఫిజుర్‌ను ఐపిఎల్ నుంచి తప్పించడానికి ప్రతిచర్యగా కీలక ప్రకటన చేశారు. మెగా టోర్నీకి లిటన్ దాస్ సారథిగా 15 మందితో కూడిన స్క్వాడ్‌ను ఎంపిక చేసిన తర్వాత.. భద్రతా కారణాలతో భారత్‌కు తమ జట్టును పంపమని బోర్డు వెల్లడించింది. 'భద్రతా కారణాల రీత్యా మా జట్టును ప్రపంచకప్ కోసం భారత్‌కు పంపించడం సాధ్యం కాదు. బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నాం. బిసిసిఐ నిర్ణయానికి కౌంటర్‌గా మేము ఈ తీర్మానం చేశాం. మా జట్టు మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించండి' అని బంగ్లా క్రికెట్ బోర్డు ఆదివారం ఐసీసీకి పంపిన ఈమెయిల్‌లో తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 7న ఈడెన్ గార్డెన్స్ మైదానంలో బంగ్లాదేశ్, వెస్టిండీస్ తలపడాలి. కానీ, ఇరుదేశాల బోర్డులు తమ ప్రభుత్వం మాటకే కట్టుబడి ఉన్నందున బంగ్లాదేశ్ మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహిస్తారా? లేదా? రాజీకి వస్తారా? అనేది తెలియాల్సి ఉంది.

**బంగ్లాదేశ్ టీ20 ప్రపంచకప్ స్క్వాడ్ :**


లిటన్ కుమార్ దాస్(కెప్టెన్), మొహమ్మద్ సైఫ్ హొసేన్(వైస్ కెప్టెన్), తంజిద్ హసన్, పర్వేజ్ హొసేన్, తౌహిద్ హృదయ్, షమీమ్ హొసేన్, కాజీ నురుల్, మహేది హసన్, రిషద్ హొసేన్, నసుమ్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, తంజిమ్ హసన్, తస్కిన్ అహ్మద్, షైఫుద్దీన్, షొరిఫుల్ ఇస్లాం.

**బిసిసిఐ ఆదేశాల మేరకు**

ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండిస్తున్న భారత ప్రభుత్వం.. ఆ దేశంతో దౌత్య సంబంధాలకు బ్రేక్ వేసింది. అంతే కాదు బిసిసిఐ ఆదేశాల మేరకు తమ స్క్వాడ్ నుంచి బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ తప్పించింది. దాంతో.. బంగ్లాదేశ్ బోర్డు సైతం వరల్డ్‌ప్ కోసం తమ జట్టును భారత్‌కు పంపించమని మెలిక పెట్టింది. మొదట.. తమ ఆటగాళ్లు, మీడియా, స్పాన్సర్లకు భద్రత కల్పిస్తామని బిసిసిఐ హామీ ఇవ్వాలని బంగ్లా బోర్డు కోరనుందనే వార్తలు వినిపించాయి. కానీ, తమ జట్టు మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహించాలని ఐసిసికి ఆ దేశ బోర్డు రాయడం చర్చనీయాంశమవుతోంది.

# ఫోకస్ ఆరోగ్యం

## బ్రెయిన్ స్ట్రోక్...



మెదడులోని కొంత భాగానికి రక్త సరఫరా అకస్మాత్తుగా రక్తం గడ్డ కట్టడం వలన అంతరాయం లేదా నిదానంగా తగ్గినప్పుడు, మెదడు కణజాలం ఆక్సిజన్, పోషకాలను పొందకుండా నిరోధించినప్పుడు ఇస్కీమిక్ స్ట్రోక్ సంభవిస్తుంది. లేదా మెదడు లోని రక్తనాళం రక్త పోటు ఎక్కువ అయి చిట్లితే హిమరేజిక్ స్ట్రోకు వస్తుంది. మెదడు కణాలు నిమిషాల్లో చనిపోవడం ప్రారంభిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 6 నిముషాల్లో ఒకరికి ప్రపంచంలో బ్రెయిన్ స్ట్రోక్ వస్తున్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్‌ఒ) పేర్కొంది. ప్రతి సంవత్సరం భారతదేశంలో పదిలక్షల కేసులు వస్తాయి. స్ట్రోక్ అనేది వైద్యపరమైన అత్యవసర పరిస్థితి. సత్వర చికిత్స కీలకం. అందుకే, ముందస్తు చర్య మెదడు దెబ్బ తినడాన్ని, ఇతర సమస్యలను తగ్గిస్తుంది. ఈ లక్షణాలు ప్రారంభమైన సమయానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలి. స్ట్రోక్ ప్రారంభమైన వెంటనే కొన్ని చికిత్సలు చేయగలిగితే ఫలితాలు అత్యంత ప్రభావవంతంగా ఉంటాయి.

**స్ట్రోక్ సంకేతాలు..లక్షణాలు..**

- మాట్లాడటం, ఇతరులు ఏమి చెబుతున్నారో అర్థం చేసుకోవడంలో సమస్య. గందరగోళం, అస్పష్టమైన పదాలు లేదా ఎదుటి వారి ప్రసంగాన్ని అర్థం చేసుకోవడంలో ఇబ్బందిని అనుభవించవచ్చు.
- ముఖం, చేయి లేదా కాలు యొక్క పక్షవాతం లేదా తిమ్మిరి. ముఖం, చేయి లేదా కాలులో ఆకస్మిక తిమ్మిరి, బలహీనత. ఇది తరచుగా శరీరంలో ఒక వైపు మాత్రమే ప్రభావితం చేస్తుంది.
- రెండు చేతులను తలపై ఒకేసారి ఉంచి, పైకి ఎత్తడానికి ప్రయత్నించండి. ఒక చేయి పడిపోవడం ప్రారంభిస్తే, స్ట్రోక్ ఉండవచ్చు. వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- నవ్వడానికి ప్రయత్నించినప్పుడు నోరు ఒక వైపు వంకర తిరగడం కూడా పక్షవాతానికి సంకేతం.
- తలనొప్పి. ఆకస్మిక, తీవ్రమైన తలనొప్పి, వాంతులు, మైకము లేదా స్పృహలో మార్పు వంకటి లక్షణాలు కూడా స్ట్రోక్‌కు సంబంధించినవే కావచ్చు.
- నడవడానికి ఇబ్బంది... బ్యాలెన్స్ కోల్పోవడం.. సమన్వయం కోల్పోవడం కూడా ఉండవచ్చు.
- స్ట్రోక్‌కు సంబంధించిన ఏవైనా సంకేతాలు లేదా లక్షణాలను గమనించినా లేక అవి వచ్చి వెళ్లినట్లు అనిపించినా లేదా అవి పూర్తిగా అదృశ్యమైనప్పటికీ, వెంటనే వైద్య సహాయం తీసుకోండి. లేకపోతే స్ట్రోక్ తీవ్రత పెరుగుతుంది. పక్షవాతం తీవ్రమై అంగవైకల్యం ఏర్పడవచ్చు. చాలామంది స్పృహకోల్పోయి వెంటిలేటర్‌పైకి పోతారు.. ప్రాణాపాయం కూడా సంభవించవచ్చు.

గుండె పోటు, బ్రెయిన్ స్ట్రోక్‌కు జాగ్రత్తలు ఒకే విధంగా ఉంటాయి. మధుమేహం, రక్తపోటు పరీక్షలు చేసి కంట్రోలులో ఉంచుకోవాలి. ధూమపానం, మద్యపానం జోలికి పోకపోవడం మంచిది. నడవడం అలవాటు చేసుకోవాలి. ఊబకాయం తగ్గించుకోవాలి. 50 సంవత్సరాలు పైబడిన వారంతా గుండె పరీక్షలుతో పాటు కెరోటిడ్ డాప్లర్ పరీక్షలు ప్రతి సంవత్సరం చేయించుకోవడం ఉత్తమం. దీర్ఘకాలిక వ్యాధులు అని కూడా పిలువబడే నాన్‌కమ్యూనికేబుల్ వ్యాధులు (ఎన్‌సిడిలు) దీర్ఘకాలికంగా ఉంటాయి. ఇవి ఒకరి నుంచి మరొకరికి వ్యాపించని, జన్యు, శారీరక, పర్యావరణ, ప్రవర్తనా కారకాల కలయిక ఫలితంగా ఉంటాయి. ఏదిఏమైనా ముందు జాగ్రత్తలు తీసుకోవడమే అన్ని విధాలా మంచిది.

## శ్వాస ద్వారా మైక్రోప్లాస్టిక్స్..

భారతదేశంలోని ప్రధాన నగరాల గాలిలో శ్వాసలోకి వెళ్లగల మైక్రోప్లాస్టిక్స్ ఉన్నట్లు రుజువైంది. 'ఎన్విరాన్మెంట్ ఇంటర్నేషనల్ జర్నల్'లో ప్రచురితమైన తొలి సమగ్ర అధ్యయనం ఇవి ప్రస్తుత గాలి నాణ్యత సూచిక (ఎక్యుఐ) వ్యవస్థల్లో పట్టుబడని, కానీ ప్రమాదకరమైన దాగిన గాలి కాలుష్యంగా నిలుస్తున్నాయి. ఈ అధ్యయనం ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై నగరాల్లోని జనసాంద్రత ఎక్కువగా ఉన్న మార్కెట్లలో గాలి కాలుష్యాన్ని పరిశీలించింది. భారత ప్రధాన నగరాల గాలిలో శ్వాసలోకి వెళ్లే మైక్రోప్లాస్టిక్స్ ఉన్నట్లు గుర్తించారు. ఇవి ఎక్కువసేపు గాల్లో తేలియాడుతూ, విషపూరిత పదార్థాలను మోసుకెళ్లి తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలు కలిగిస్తాయి. ప్రస్తుత ఎక్యుఐ లెక్కింపు విధానాల్లో ఇవి పరిగణనలోకి రాకపోవడం గమనార్హం. శ్వాస ద్వారా లోనయ్యే మైక్రోప్లాస్టిక్స్ అంటే...



10 మైక్రోమీటర్ల కన్నా చిన్నవైన గాల్లో తేలియాడే ప్లాస్టిక్ కణాలు. ఇవి నేరుగా వెళ్లి ఊపిరితిత్తుల లోతుల్లోకి చేరగలవు. సింథటిక్ దుస్తులు, టైర్లు–బ్రేకుల రాపిడి, ప్లాస్టిక్ ప్యాకేజింగ్, పెయింట్లు, సౌందర్య సాధనాలు, చెత్త దహనం వంటివి ఈ మైక్రోప్లాస్టిక్స్ పెరుగుదలకు కారణాలు. కొత్త గాలి కాలుషకం గుర్తింపు: శ్వాస మైక్రోప్లాస్టిక్స్‌ను ప్రస్తుత ఎక్యుఐ సరైన విధంగా పట్టించుకోవడం లేదు.. ఇది నియంత్రణ లోపాన్ని చూపిస్తుంది. ఈ మైక్రోప్లాస్టిక్స్ తక్కువ గురుత్వాకర్షణ కారణంగా ఇవి ఎక్కువసేపు గాల్లో తేలియాడుతాయి. సీసం, క్యాడ్మియం వంటి భారీ లోహాలు, ఫ్తాలేట్స్ వంటి హార్మోన్ అంతరాయం కలిగించే రసాయనాలు అంటుకుని ఆరోగ్య ప్రమాదాన్ని పెంచుతాయి. ఢిల్లీ, కోల్‌కతాలలో స్థాయిలు ఎక్కువగా ఉన్నాయి. ముంబై, చెన్నైలో తీరప్రాంత వాతావరణం కాలుష్యాన్ని కొంత మేర చెలరేగిస్తుంది. పట్టణ ప్రజలు రోజుకు సుమారు 132 మైక్రోగ్రాముల మైక్రోప్లాస్టిక్స్‌ను శ్వాస ద్వారా లోనవుతున్నారు. ఫలితంగా ఊపిరితిత్తుల లోతుల్లోకి చేరి ట్రోజన్ హార్స్‌లా విషపదార్థాలను మోసుకెళ్లి హార్మోన్ రుగ్మతలు, క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. వివిధ రకాల సూక్ష్మ జీవులను మోసుకెళ్లి, యాంటీబయాటిక్ నిరోధక శ్వాసకోశ సంక్రమణల ప్రమాదాన్ని పెంచుతాయి. వీటి నివారణకు సత్వర చర్యలు అత్యవసరం.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## ఖమ్మం మురిసేలా శత వసంత ఉత్సవ ముగింపు సభ

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా



**ప్రజాపక్షం/మణుగూరు :** ఖమ్మం జిల్లా మురిసేలా సిపిఐ శత వసంతాల ఉత్సవాల సభను నిర్వహిస్తున్నట్టు సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎసకె.సాబీర్ పాష పేర్కొన్నారు. జిల్లాలో ప్రారంభమైన ప్రచార జాత రెండో రోజూ ఆదివారం కొనసాగింది. పినపాక నియోజకవర్గం పరిధిలోని అశ్వాపురం మండలం నుండి ఆదివారం ప్రారంభమైన ఈ జాత మణుగూరు పినపాక కరకగూడెం గుండాల వరకు చేరింది. ఆయా మండల కేంద్రాల్లో ప్రచార జాతకు కమ్యూనిస్టు నాయకులు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా సాబీర్ పాష మాట్లాడారు. సిపిఐ శత వసంతాన్ని పురస్కరించుకొని ఖమ్మం కేంద్రంగా ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు దేశ నలుమూలల నుండి కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు తరలి వస్తున్నారని, రెడ్ షర్ట్ వాలంటీర్ల ఎర్ర కవాతుతో ఖమ్మం నగరం ఎరుపెక్కనుందని చెప్పారు. దేశమే అబ్బురపడేలా ఈ ముగింపు ఉత్సవ సభ జరగనుందని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా భారీ ఎత్తున జన సమీకరణ చేసి ఉత్సవానికి తరలిరావాలని. నూతన ఉత్తేజంతో పదునెక్కిన ఉద్యమాలతో ప్రజాక్షేత్రంలో సమస్యల పరిష్కారం కోసం నవవసంతాన్ని ప్రారంభిద్దామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణికి బకాయిలు చెల్లించాలి

### ఎఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :**సింగరేణి సంస్థ మనుగడ కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 45 వేల కోట్ల రూపాయలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలోని నస్పూర్ నర్సయ్య భవన్‌లో ఆదివారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈనెల 18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతజయంతి ఉత్సవాల బహిరంగ సభకు సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం యూనియన్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ సెక్రెటరీ బాజీ సైదా, వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్ రావు, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, అఫ్రోజ్ ఖాన్, ప్రసాద్ రెడ్డి, బద్రి బుచ్చయ్య, నాగభూషణ్, అడ్డు శ్రీనివాస్, బాలకృష్ణ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

## దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న బిజెపి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్



**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** దేశ సంపదను కార్పొరేట్ పెట్టుబడిదారులకు కట్టబెట్టి, కార్మికులను కట్టు బానిసలుగా మార్చే చట్టాలు కేంద్రం తీసుకొచ్చిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ విమర్శించారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బెల్లంపల్లి పట్టణంలో జీపు జాత నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి అధ్యక్షతన భగత్ సింగ్ విగ్రహానికి రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ విగ్రహానికి కలవేన శంకర్, మిట్టపల్లి వెంకటస్వామి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలవేన శంకర్ మాట్లాడుతూ 2014లో ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తామని, రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రగల్భాలు పలికి బిజెపి అధికారంలోకి వచ్చిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకులు, టెలికాం, గనులను, చివరకు రక్షణ రంగ పరిశ్రమలను సైతం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరును మారుస్తూ గాంధీని అవమానపరుస్తున్నారని, స్వాతంత్రోద్యమంలో ఎటువంటి పాత్ర లేని బిజెపి దేశభక్తి గురించి మాట్లాడటం శోచనీయమన్నారు. పార్టీ కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి మాట్లాడుతూ వెట్టిచాకిరి విముక్తికి, నిజాంను గద్దె దించడానికి జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో 4500 మంది ప్రాణ త్యాగాలతో 3000 గ్రామాల విముక్తి, పది లక్షల ఎకరాల భూమిని పంచిన ఘన చరిత్ర సిపిఐ సొంతమన్నారు. ఈనెల 10న రామకృష్ణాపూర్‌లో జరిగే సభను, 18న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాసు, బొల్లం పూర్ణిమ, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, జాతీయ సమితి సభ్యులు అక్కపెల్లి బాపు, కొండు బానేష్, బొల్లం తిలక్ అంబేద్కర్, గుండ చంద్ర మాణిక్యం, డిఆర్ శ్రీధర్, కొంకుల రాజేష్, రత్నం రాజం, బొల్లం సోని, బియ్యాల ఉపేందర్, మంతెన రమేష్, కంబాల చందు, బండారి శంకర్, రత్నం ఐలయ్య, బొంకురి రామచందర్, ఇనుముల రాయమల్లు, గుండా శంకర్, పాఠకుల సౌజన్య, నస్పూరి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## 47 కార్మిక చట్టాలు సాధించిన ఘనత సిపిఐది

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు విలాస్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** 47 కార్మిక చట్టాలను సాధించిన ఘనత సిపిఐ పార్టీదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్.విలాస్ పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) వందేళ్ల ఉత్సవాల సందర్భంగా ఈ నెల 18న ఖమ్మం పట్టణంలో నిర్వహించ తలపెట్టిన భారీ శత వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి బూక్య రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన విలాస్ మాట్లాడుతూ దున్నేవానికే భూమి, బ్యాంకుల జాతీకరణ, ఉపాధి హామీ పథకం(యంజిఎన్ఆర్ఇజిఏ) సమాచార హక్కు చట్టం వంటివి తీసుకురావడంలో సిపిఐ చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. జిల్లా కార్యదర్శి భూక్య రమేష్ మాట్లాడుతూ ఖమ్మంలో జరిగే చారిత్రాత్మక సభకు జిల్లానుంచి నాయకులు, కార్యకర్తలు జిల్లా ప్రజలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.యన్.రెడ్డి, ఎఐటియుసి నాయకులు బాబులాల్, వెంకటేశ్వర్లు రావు తదితరులు పాల్గొన్నారు.



## వెనిజులాపై అమెరికా సైనికదాడి దుర్మార్గం

### సిపిఐ. ప్రజాసంఘాల నిరసన






**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** వెనిజులాకు మద్దతుగా ఆ దేశంపై అమెరికా చేసిన తాజా దాడికి నిరసనగా, ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కోఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్ (ఇస్కఫ్) ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లా కౌన్సిల్ సహకారంతో హనుమకొండ జిల్లా నక్కలగుట్టలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వెనిజులా దేశ సార్వభౌమత్వాన్ని హరించేవిధంగా, అలాగే అధ్యక్షుడు నికోలస్ మదూరో, ఆయన కుటుంబ భద్రతకు ముప్పుగా మారిన అమెరికా సైనిక చర్యలను నిరసనకారులు తీవ్రంగా ఖండించారు. శాంతి కోసం, అధ్యక్షుడు మదూరోను వెంటనే విడుదల చేయాలని, వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యం ఆపాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఇస్కఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కడారు ప్రభాకర్‌రావు మాట్లాడుతూ అమెరికా చర్యలను తీవ్రంగా ఖండిస్తూ, అధ్యక్షుడు నికోలస్ మదూరో, ఆయన కుటుంబాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెనిజులా దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రపంచ దేశాలపై ఉందని ఆయన అన్నారు. సామ్రాజ్యవాద శక్తుల అన్యాయ చర్యలను అడ్డుకోవడానికి ప్రపంచం ఏకతాటిపై నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నిరసనలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్,ఐఎఎల్ రాష్ట్ర కార్యదర్శి భీమనాదం శ్రీనివాస్, ఇస్కఫ్ జిల్లా అధ్యక్షుడు సి.వై.రాఘవరావు, జనరల్ సెక్రటరీ ఎన్.రాజమౌళి, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, కాకతీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సాంబయ్య, రవీందర్‌రావు, షామ్ కృష్ణ, సీనియర్ న్యాయవాదులు ఎం.రామస్వామి, ప్రభాకర్, అనుముల రమేశ్, రచయితల సంఘం నాయకులు కె.ప్రదీప్, పర్వీన్ కుమార్, శ్రీనివాస్, నాగరాజు,టి. జీవన్ తదితరులు పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్ :** వెనిజులా దేశ అధ్యక్షుడు నికోలాస్ మధురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌లను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం సిపిఐ జగద్గిరిగుట్ట శాఖ ఆధ్వర్యంలో గుట్ట ఔటపోస్ట్ దగ్గర ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్‌లు మాట్లాడుతూ అత్యధిక చమురు నిక్షేపాలు కలిగిన దేశం వెనిజులా అని, ఆ నిల్వలను దోచుకోవాలనే నీచ కుట్రలతో, సహజ వనరులపై ఆధిపత్యం కోసం ఒక దేశా నాయకత్వాన్ని నేరస్తులుగా ముద్రవేసి అరెస్టు చేయాలనుకోవడం ఆధునిక వలసవాద దురహంకారానికి ప్రతిరూపమన్నారు. అంతర్జాతీయ సమాజం ఈ దుర్మార్గమైన అరెస్టులను ఖండించాలన్నారు. వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యాన్ని తక్షణమే ఆపాలనీ, ఆ దేశ సార్వభౌమత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని, భారత ప్రభుత్వం కూడా సామ్రాజ్యవాద ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వతంత్ర విదేశాంగ విధానాన్ని పాటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ శాఖ కార్యదర్శి సహదేవ్‌రెడ్డి, సిపిఐ నాయకులు రవి, సామెల్, నారాయణ, యాదగిరి, సైదులు, వెంకన్న, యాకయ్య, ఆశప్ప, రాములు, రమేష్, సత్తయ్య, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఉద్యమకారులు



**ప్రజాపక్షం/మహాదేవపూర్;** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ టియూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ నాయకత్వంలో ఆదివారం ఆల్వాల్‌లో ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలో మండల ఉద్యమకారులు మండల అధ్యక్షుడు సట్ల సత్యనారాయణ,అన్నారి ప్రభాకర్,అక్రమొద్దీన్‌లు జిల్లా అధ్యక్షుడు యాదండ్ల గట్టయ్యతో కలిసి పాల్గొన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండితెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నట్లు తెలిపారు.

## లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకల్లో ఎంపికావ్య



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** హనుమకొండ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో తెలంగాణ అంధ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన లూయిస్ బ్రెయిలీ217వ జయంతి వేడుకలకు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద గారితో కలసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపి డా క్టర్ కడియం కావ్య మాట్లాడుతూ అంధులు కూడా సామాన్యులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుకు సాగాలనే దృఢ సంకల్పంతో, ఆరు చుక్కలతో కూడిన బ్రెయిల్ లిపిని ఆయన రూపొందించారని తెలిపారు.అంధుల సంక్షేమానికి తనవంతుగా నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంధుల కోసం ప్రత్యేకంగా ఒక కమ్యూనిటీ హాల్ అవసరమని పేర్కొంటూ, దాని నిర్మాణానికి తన సహకారం అందిస్తానని తెలిపారు. అలాగే డిజేబుల్ అలవెన్సులు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు.అనంతరం కార్యక్రమంలో భాగంగా క్యాలెండర్‌ను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి అంధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపర్ డెంట్ భరత్ కుమార్, సంఘ రాష్ట్ర అధ్యక్షులు లింగయ్య ఇతర నాయకులు, అంధ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ విగ్రహానికి నిప్పంటించిన దుండుగులను శిక్షించాలి; ఎర్రబెల్లి



**ప్రజాపక్షం/రాయపర్తి:** ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి నిప్పంటించిన దుండగులను కఠినంగా శిక్షించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మండలంలోని బంధన్‌పల్లి గ్రామంలో గ్రామస్తులు ఏర్పాటు చేసుకొని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి ఇటీవల గుర్తు తెలియని దుండగులు నిప్పు అంటించగా కొంత మేర విగ్రహం కాలిపోయింది. ఆదివారం బిఆర్ఎస్ నాయకులతో కలిసి మాజీ మంత్రి ఎర్రబెల్లి పరిశీలించి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ ఒక గొప్ప భారతీయ యోధుడని, మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, పశ్చిమ భారతదేశంలో స్వతంత్ర్య రాజ్య స్థాపనకై పోరాడిన యుద్ధ నాయకుడు అని అన్నారు. బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహా నాయ క్, మాజీ ఎంపిపి జినునగు అనిమిరెడ్డి, మాజీ జడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, ఆరె కుల భవన్ నిర్మాణ కమిటీ చైర్మన్ కౌడగాని నర్సింగరావు, స్థానిక సర్పంచ్ భూక్య అక్రి రాంజీ నాయక్ గారే నర్సయ్య, లేతాకుల రంగారెడ్డి, చిలువేరు సాయి, చందు రాము, ఎల్ల స్వామి, వాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## హృతిక్ రెడ్డి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కడియం ఓదార్పు



**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్ :** చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన తోకల హృతిక్ రెడ్డి (25) ఇటీవల జర్మనీ లో ప్రమాదవశాత్తు మరణించగా వారి కుటుంబ సభ్యులను మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు. ఉన్నత విద్యను అభ్యసించడానికి వెళ్లిన హృతిక్ రెడ్డి జర్మనీలో తను నివాసం ఉంటున్న అపార్ట్మెంట్‌లో సంభవించిన అగ్ని ప్రమాదం కారణంగా మరణించడం అత్యంత బాధాకరమని అన్నారు. మంచి భవిష్యత్ ఉన్న హృతిక్ రెడ్డి ఆకస్మిక మరణం తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. ఇలాంటి కష్ట సమయంలోనే ధైర్యాన్ని కోల్పోకూడదని హృతిక్ రెడ్డి తల్లిదండ్రులను ఓదార్చారు. భారత రాయబార కార్యాలయంతో ఎంపీ డాక్టర్ కడియం కావ్య సంప్రదింపులు చేస్తున్నారని తెలిపారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారి వెంట చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీ ధర్ రావు, స్థానిక సర్పంచ్ లావణ్య మల్లారెడ్డి, మండల నాయకులు, ఇతర ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

**ప్రజాపక్షం/జనగామటౌన్:** ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని ఎఎం వీఐ మహేష్, శ్వేత తెలిపారు. జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలలో భాగంగా ఆదివారం జనగామ జిల్లా రవాణా శాఖ వారి ఆధ్వర్యంలో ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కార్యక్రమం నిర్వమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మేడారం జాతరకు పెరిగిన భక్తుల రద్దీ

**ప్రజాపక్షం/ములుగు:** ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన మేడారం జాతర ఇంకా 25 రోజులే ఉంది. కానీ ఇప్పటికే దేశం నలుమూలల నుండి అనేక సంఖ్యలో భక్తులు వచ్చి సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ లేని విధంగా మేడారం జాతరలో అద్భుతమైన కట్టడాలు నిర్మించారు. కానీ అవి పూర్తి కాకపోవడం వలన భక్తులకు తీరని ఇబ్బందులు జరుగుతున్నాయి. అయినప్పటికి జాతర వరకు పనులు పూర్తయితాయని అధికారులు చెబుతున్నారు. వారానికి ఒకసారి మంత్రులు మాత్రం మేడారం జాతరలో ప్రవేశించి జాతర స్థలం పరిశీలన చేస్తున్నారు. సమ్మక్క సారలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం సెలవు దినం కావడంతో అనేక సంఖ్యలో భక్తులు వచ్చి సమ్మక్క సారక్క దర్శించుకుంటున్నారు. జంపన్న వాగులో స్నానాలు చేసి తన్నుల వద్దకు భక్తులు ఎత్తు బంగారాన్ని తల్లులకు అప్పజెప్తున్నారు. రాబోయే రోజుల్లో ఇంకా మేడారం జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చి సమ్మక్క సారక్క దర్శించుకుంటారు. వచ్చిన భక్తులకు ములుగు జిల్లా ఎస్పి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు

### మున్సిపాలిటీలలో పాగాకు పార్టీల వ్యూహరచన * పంచాయతీ ఫలితాలతో కాంగ్రెస్‌లో జోష్



**ప్రజాపక్షం/హనుమకొండ :** రాష్ట్రంలో మరోసారి ఎన్నికల నగారా మోగనుంది. మునిసిపల్ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. పంచాయతీ ఎన్నికల ఫలితాలతో జోష్ లో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. అదే ఊపులో పురపాలికల్లో పాగా వేయాలని ఉవ్విళ్లూరుతుంది. మునిసిపాలిటీల్లో ఓటరు జాబితా రెడీ చేయటంతో పాటు అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. దీంతో పట్టణాల్లో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొమ్మిది మునిసిపాలిటీలు ఉండగా, కొత్తగా ప్రభుత్వం మరో మూడింటిని ఏర్పా టు చేసింది. మొత్తం 12మునిసిపాలిటీల్లో పాగా వేసేందుకు అన్ని పార్టీ లు ఇప్పటి నుంచే వ్యూహరచనల్లో మునిగి తేలుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ ఎన్నికలకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తున్నది. ఇప్పటికే మునిసిపాలిటీల్లో వార్డుల వారీగా ప్రాథమిక ఓటర్ల జాబితాను సిద్ధం చేయటంతో పాటు పోలింగ్ స్టేషన్ల గుర్తించేందుకు షెడ్యూల్ ప్రక టించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 మునిసిపాలిటీలు, 260వార్డులు ఉన్నాయి. గత అక్టోబరు 1 వరకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నమోదు చేసిన ఓటరు జాబితాను అనుసరించి వార్డుల వారీగా జాబితాను తయారు చేస్తున్నారు. వార్డుల వారీగా మునిసి పాలిటీల్లో ఓటర్ల జాబితాను ప్రకటించారు. ఓటర్ల జాబితాపై అభ్యంత రాలను స్వీకరించనున్నారు. జనవరి 5న మునిసిపాలిటీల్లో, 6వ తేదీన కలెక్టరేట్లల్లో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నారు. 10న మునిసిపాలిటీల్లో వార్డులు, పోలింగ్ స్టేషన్లు, తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు. ఓటరు జాబితా, వార్డులు, పోలింగ్ స్టేషన్ల ప్రక్రియ పూర్తి కాగానే మునిసిపాలిటీ ఎన్నిక లకు నోటీఫికేషన్ ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది.

**మున్సిపాలిటీలలో పాగాకు పార్టీల యత్నం**

పురపాలికలపై అన్ని రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. పంచాయతీ ఎన్నికల తరువాత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరుగుతాయని ఆయా పార్టీల నేతలు ఎదురు చూస్తున్నారు. గత నెల 23వ తేదీన మంత్రులతో భేటీలో సీఎం రేవంత్ రెడ్డి మునిసిపాలిటీ ఎన్నికలపై క్లారిటీ ఇవ్వటంతో అన్ని పార్టీలు పురపాలికల్లో పట్టు కోసం కసరత్తు మొదలు పెట్టాయి. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ తో పాటు బీఆర్ఎస్ కు కూడా మంచి ఫలితాలు రావటంతో గులాబీ శ్రేణులు జోష్ లో ఉన్నాయి. దీంతో పాటు పట్టణ ప్రాంతాల్లో బీజేపీకి కొంత బలం ఉండటంతో మునిసిపాలిటీల్లో త్రిముఖ పోరు తప్పదనే టాక్ వినబడుతుంది. 2020 జనవరి 22 మునిసిపాలిటీ ఎన్నికల్లో తొమ్మిది మునిసిపాలిటీ లను అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో పురపాలికల్లో క్లీన్ స్వీప్ చేయాలని అధిష్టానం నుంచి ఆదేశాలు రావటంతో హస్తం నేతలు దృష్టిసారించారు. దీంతో పాటు పరకాల, జనగామ, భూపాలపల్లి, నర్సంపేట, వర్ధన్నపేట, తొర్రూరు తదితర మునిసిపాలిటీలలో పై చేయి సాధించాలని చూస్తున్నారు.

**త్రిముఖ పోటీ తప్పదా?**

పట్టణ కేంద్రాలలో కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీలతో పాటు మునిసిపాలిటీల్లో బిజెపిగట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉండటంతో త్రిముఖ పోరులో ఎవరికి లాభం అనే చర్చ జరుగుతుందన్నది చర్చనీయాంశంగా మారింది.వరంగల్ నగరంతో పాటు మహబూబాబాద్, భూపాలపల్లి,జనగామలో సిపిఐ, సిపి(ఐ)ఎంకు పట్టు ఉంది. ఈ సారి వాటిలో కొన్ని స్థానాలు దక్కించుకునేందుకు సిద్దంగా ఉన్నాయి. కాగా జనగామ మినహ మిగతా అన్ని మునిసిపాలిటీల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పార్టీ గుర్తులతో జరిగే ఎన్నికలు కావ టంతో ఎమ్మెల్యేలకు కూడా సవాల్ గా మారాయి. బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు కూడా తమ ఉనికి కోసం పురపాలికల్లో పట్టు సాధించేందుక క్యాడర్‌తో సమాలోచనలు చేస్తున్నారు. మొత్తానికి పంచాయతీ ఎన్నికల్లో వచ్చిన ఊపుతో పట్ట ణాల్లో పాగా వేసేందుకు రాజకీయ పార్టీలు ఎత్తులకు పైఎత్తులు వేసే అవకాశం.

**12 మునిసిపాలిటీలు.. 260 వార్డులు**

ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మునిసిపాలిటీలు ఉండగా, ప్రభుత్వం ఈ ఏడాది కొత్తగా మూడింటిని ప్రకటించింది. అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో ఐదు మునిసిపాలిటీలు ఉన్నాయి. మహబూబాబాద్ పాటు తొర్రూరు, మరిపెడ, డోర్నకల్ మునిసిపాలిటీలు ఉండగా, ఈ ఏడాది కొత్తగా కేసముద్రం గ్రామాన్ని మునిసిపాలిటీగా ప్రక టించారు. ఇక వరంగల్ జిల్లాలో నర్సంపేట, వర్ధన్నపేట మునిసిపాలిటీలు ఉన్నాయి. అలాగే హనుమకొండ జిల్లాలో పరకాల, జనగామ జిల్లాలో జనగామ మునిసిపాలిటీ ఉండగా కొత్తగా స్టేషన్ ఘనపూర్ ను మునిసిపాలిటీగా ప్రక టించారు. జయశంకర్ జిల్లాలో భూపాలపల్లి మునిసిపాలిటీ ఉండగా, కొత్తగా ములుగును మునిసిపాలిటీగా ప్రకటించారు. మొత్తం 12 మునిసిపాలిటీల్లో 260 వార్డులు ఉన్నాయి. వీటిలో 3,87,345 జనాభా ఉండగా 49,045 ఎస్టీలు,69,316 ఎస్సీలు ఉన్నారు. మునిసిపాలిటీల్లో బీసీల జనాభాను అధికా రికంగా ప్రకటించలేదు. అయితే మునిసిపాలిటీల్లో బీసీలకు రిజర్వేషన్ ఎంత అనేది ఉత్కంఠగా మారింది. పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చినట్లుగా 17శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారా లేక పెంచుతారా అనేది ఆసక్తికరంగా మారింది.

## హమాలీ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు:** పంచాయతీరాజ్ శాఖ ద్వారా సుమారు 11 లక్షల రూపాయలతో జిల్లా కేంద్రంలో నిర్మించిన నూతన హమాలీ కమ్యూనిటీ భవనాన్ని ఆదివారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు హమాలీ సోదరులు పొద్దున్నే వారి పనులను ప్రారంభించుకొని మధ్యాహ్నం సమయంలో భోజనం చేయడానికి చెట్ల కింద, బయట ప్రదేశాల్లో కూర్చుని సేదతీరడం చూసి వారికి ఒక భవనం ఉంటే వారికి అనుకూలంగా ఉంటుందనే ఉద్దేశంతో నూతన భవనం నిర్మించి వారికి అండగా ఉన్నామని రాబోయే రోజుల్లో కూడా వారికి ఎలాంటి అవసరం ఉన్న సహకరిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, పంచాయతీరాజ్ రాష్ట్ర డైరెక్టర్ బైరెడ్డి భగవాన్‌రెడ్డి, హమాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ములుగు హమాలీ సంఘం అధ్యక్షుడు రాజు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ పెన్షనర్ల సంక్షేమానికి కృషి

### వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య* రిటైర్డ్ కళాశాల అధ్యాపకుల పెన్షనర్స్ డైరీ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ లోని రిటైర్డ్ కళాశాల అధ్యాపకుల పెన్షనర్స్ డే, డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరితో కలసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిటైర్డ్ కళాశాల అధ్యాపకుల సేవలను స్మరించుకొని వారి అనుభవాలు సమాజానికి ఎంతో మార్గదర్శకమని ఎంపీ పేర్కొన్నారు. అనంతరం డైరీని ఆవిష్కరించి, సంఘ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. రిటైర్డ్ కళాశాల అధ్యాపకులు విద్యా రంగానికి అందించిన సేవలు అమూల్యమైనవని, వారి కృషి వల్లే అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. పదవీ విరమణ అనంతరం కూడా అధ్యాపకులు తమ జ్ఞానం, అనుభవాలను సమాజహితానికి వినియోగించుకోవడం అభినందనీయమని అన్నారు. పెన్షనర్ల సంక్షేమానికి మరింత కృషి చేస్తానని ఎంపీ స్పష్టం చేశారు. రిటైర్డ్ కళాశాల అధ్యాపకుల సంఘ భవన అభివృద్ధికి 10 లక్షల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రస్తుతం లీజుపై ఉన్న భవనాన్ని మరో 30 సంవత్సరాల పాటు లీజు పొడిగించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. సీనియర్ సిటిజన్స్ అందరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా మహిళలు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పదవీ విరమణ చేసిన అధ్యాపకులు తమ అనుభవాలు, జ్ఞానాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా కొనసాగించాలన్నారు.వచ్చే పెన్షనర్స్ డే కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావాలని కోరుతూ, ఇలాంటి కార్యక్రమాలు పరస్పర ఆత్మీయతను, ఐక్యతను పెంపొందిస్తాయని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పులి సారంగ పాణి, వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, సెక్రటరీ మల్లారెడ్డి, ఫైనాన్స్ సెక్రటరీ సెక్రెటరీ రాజయ్య, జాయింట్ సెక్రెటరీలు కృష్ణమూర్తి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంధ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



**ప్రజాపక్షం / వరంగల్ :** అంధ విద్యార్థులు అవకాశాలను అంది పుచ్చుకోవాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. డాక్టర్ లూయిస్ బ్రెయిలీ 217వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని వరంగల్ కొత్తవాడ లోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా.సత్య శారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ అంధ విద్యార్థులు అంధులు అనే భావన ను వీడి ఆత్మ స్థైర్యం తో ముందుకు వెళ్లాలని, వైకల్యం అనేది అవయవాలకు మాత్రమేనని లక్ష్యానికి కాదని అంధులు కూడా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఇటీవల భారత అంధ మహిళల జట్టు క్రికెట్ ప్రపంచ కప్ సాధించిందని గుర్తుచేశారు. కార్పొరేషన్ తరపున పాఠశాలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు మౌలిక సదుపాయాలు అందిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో అద్భుతమైన ప్రతిభ పాటవాలు దాగి ఉన్నాయని రాగ యుక్తం గా పాటలు పాడడం తో పాటు చూపూ లేకున్నా మొబైల్ ఫోన్ లో నంబర్ లను నొక్కితే శబ్దం ఆధారం గా నొక్కిన నంబర్ ను గుర్తించి చెప్పడం వారి ప్రతిభకు నిదర్శనం అని విద్యార్థులను మరింత ప్రోత్సహించాలని కలెక్టర్ పాఠశాల యాజమాన్యానికి సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ అంధుల పాఠశాలలో వివిధ అభివృద్ధి పనుల కోసం గతంలో బల్దియా తరపున నిధులను అందించామని గుర్తుచేశారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన కేక్ ను అతిథులు అంధ విద్యార్థులతో కలిసి కట్ చేసి స్వీట్ లను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఉన్నతికి సహకరిస్తున్న పలువురు దాతల ను మేయర్ కలెక్టర్ కమిషనర్ లు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం లో బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డా. రాజారెడ్డి వైద్యులు డా.లక్ష్మీ.నారాయణ, మాజీ కార్పొరేటర్ ఎలుగం లీలావతి, సత్యనారాయణ, పాఠశాలనిర్వాహకులు నలివేల కళ్యాణి, మణిశంకర్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును టిపిసిసినాయకులు ఇ.వి. శ్రీనివాస్ రావు, చిట్ల సత్యనారాయణ, రుద్ర సంతోష్, తూము వినయ్, సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్, గద్వాల్ జిల్లా అధ్యక్షులు మలిచేటి రాజీవ్ రెడ్డి లు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే అసెంబ్లీ వేదికగా మున్నూరు కాపు కార్పొరేషన్ అవసరంపై గళమెత్తి, మున్నూరుకాపు సమాజ విశ్వాసాన్ని సంపాదించిన నాయకుడు దుద్దిళ్ల శ్రీధర్ బాబు అని నాయకులు గుర్తుచేశారు.ప్రస్తుతం ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు, దానికి సంబంధించిన నిధుల కేటాయింపుపై ప్రభుత్వ స్థాయిలో సమగ్రంగా చర్చించి, ముఖ్యమంత్రితో ఈ అంశంపై మాట్లాడాలని కాంగ్రెస్ నాయకులు వినయపూర్వకంగా విన్నవించగా, మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు.అదేవిధంగా, ఉమ్మడి పది జిల్లాలకు చెందిన నాయకులతో ఒక వారంలో విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఈ అంశంపై సమగ్రంగా చర్చించేందుకు సమయం కేటాయించాలని కోరగా, దానిపైనా మంత్రి సానుకూలంగా స్పందించారు.అనంతరం టిపిసిసిఅధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని ప్రస్తావించగా, టిపిసిసిఅధ్యక్షుడు కూడా సానుకూలంగా స్పందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండగా 'ప్రజాపక్షం' దినపత్రిక

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** నిత్యం ప్రజా సమస్యలపై అనేక కథనాలు రాస్తూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాపక్షం దినపత్రిక పనిచేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరు నగర్ లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాపక్షం 2026 నూతన క్యాలెండర్ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాపక్షం పాఠకులకు, యాజమాన్యానికి సిబ్బందికి మండల రిపోర్టర్లకు ఎమ్మెల్యే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పత్రికలు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేయాలని, సమస్యలు ఏదైనా ప్రతిపక్షం ప్రజాపక్షం అనకుండా ప్రజల పక్షాన పత్రికలు నిలవాలని ఆకాంక్షించారు. ప్రజాపక్షం రాబోయే రోజుల్లో మరిన్ని వార్త కథనాలు ప్రజలకు అందిస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు ఆదరణ పొందాలని ఎమ్మెల్యే సత్యనారాయణ రావు ఆకాంక్షించారు. గతంలో ప్రజాపక్షం విశాలాంధ్ర పత్రికగా ఉండేదని రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత విశాలాంధ్ర ఆంధ్రప్రదేశ్ కి పరిమితమైందని, ఆ తర్వాత ప్రజాపక్షం పేరుతో తెలంగాణలో గత ఏడు సంవత్సరాలుగా ప్రజాపక్షం ప్రజల పక్షాన పని చేస్తుందన్నారు. ఉద్యోగ, కార్మిక, వ్యవసాయ, అసంఘటిత రంగ సమస్యలపై నిత్యం వార్తలు అందిస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేర్చే విధంగా ప్రజాపక్షం పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా పక్షం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ చెరుకు సుధాకర్, రేగొండ,మల్హర్, మొగుళ్లపల్లి మండలాల రిపోర్టర్లు అంబాల రవీందర్, జల్లారపు ప్రసాద్, బొల్లేపల్లి రమేష్, సిపిఐ జిల్లా సమితి నాయకులు సోతుకు ప్రవీణ్ కుమార్, క్యాతరాజు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీ విద్యతోనే సమాజంలో మార్పు



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** స్త్రీల విద్య, మహిళల హక్కులపై ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడుగుగులోతు కిషన్ నాయక్ అన్నారు. మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో ఆదివారం సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో హెచ్ డబ్ల్యు ఓ సుజాత అధ్యక్షతన మహిళ చైతన్య మూర్తి క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే జయంతిని గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గూగులోత్ కిషన్ నాయక్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కిషన్ నాయక్ మాట్లాడుతూ రాజ్యాంగంలో మహిళలకు అట్టడుగు వర్గాలకు పీడత శ్రామిక వర్గాలకు హక్కులు కాపాడుకోవడం కోసం విద్య ద్వారానే మార్పు వస్తుందని సమాజంలో మహిళా విలువల కోసం పోరాటానికి సిద్ధం కావాలని గుగులోత్ కిషన్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎఎస్‌డబ్ల్యూ శివప్రసాద్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దొడ్డెల రామ్మూర్తి కళాశాల వసతిగృహ బాలికలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు..



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## మంత్రి పొంగులేటికి శుభాకాంక్షల వెల్లువ




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ప్రజలు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి నూతన సంవత్సర శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పాలేరు నియోజక వర్గ పర్యటన నిమిత్తం ఆదివారం వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్ వద్ద కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్‌దత్ సాదర స్వాగతం పలికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అధికారులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## సిపిఐది వందేళ్ల పోరాట చరిత్ర
### పార్టీ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల



**ప్రజాపక్షం/ ముదిగొండ :** వందేళ్ల సుదీర్ఘ పోరాట చరిత్ర సిపిఐ సొంతమని సుదీర్ఘ పయనంలో అనేక పోరాట విజయాలను పొందిపొందిన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. పోరాట చరిత్రను నేటి తరానికి తెలియజేయడంతో పాటు భవిష్యత్తు పోరాటాలకు యువతను కార్యోన్ముఖులను చేసేందుకు జనవరి 18న శతాబ్ది ఉత్సవ ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం ముదిగొండ మండలంలో సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభ విజయవంతం చేయాలని కోరుతూ జాతా ద్వారా ప్రచారం నిర్వహించారు. సభలో శింగు నర్సింహారావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, ఆరెంపుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.



**తిరుపతమ్మకు నివాళి :** సిపిఐ సీనియర్ సభ్యురాలు గంగాధరి తిరుపతమ్మకు సిపిఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల మరణించిన తిరుపతమ్మ ఇంటికి వెళ్లి ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరుపతమ్మ ఆశయ సాధనకు కృషి చేస్తామని తెలిపారు.

## పోరాటాల జ్ఞాపకాలతో శత జయంతి ఉత్సవాలు : సింగ్



**ప్రజాపక్షం/కూసుమంచి:** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)పుట్టి భారత గడ్డపై నూరేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సీతామహాలక్ష్మి నేతృత్వంలో నక్షత్రాల్లో ప్రారంభమైన సిపిఐ జిల్లా ప్రచార జాతా ఆదివారం కూసుమంచి మండలానికి చేరింది. ఈసందర్భంగా కూసుమంచి మండల కార్యదర్శి భూక్య నరసింహ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం సెంటర్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ప్రచార జాత మండలంలోని గైగోళ్లపల్లి, లాలసింగ్ తండా, సంధ్యతండ మీదుగా తిరుమలాయపాలెం మండలానికి చేరుకుంది. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు కత్తోజు పొందు రంగాచారి, గుండెపొంగు మల్లేష్, మండల కార్యదర్శి భూక్యా నరసింహ, సహాయ కార్యదర్శి జిల్లా లింగయ్య, లాలసింగ్ తండా శాఖ కార్యదర్శి భూక్యా శ్రీకాంత్, గిరిజన సమాఖ్య మండల అధ్యక్షులు వీరన్న నాయక్, నాయకులు జిల్లా నాగరాజు, చెరుకుపల్లి మల్సూర్, గుండెపంగు మధు, జిల్లా రంగమ్మ, విజయ్ పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలు ఉన్నంతకాలం కమ్యూనిస్టులు ఉంటారు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రజల కోసం, ప్రజా సమస్యలపై పోరాడేది భారత కమ్యూనిస్ట్ పార్టీ అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి అన్నారు. సిపిఐ శతవసంతాల ముగింపు భారీ బహిరంగ సభ జనవరి 18న ఖమ్మంలో జరుగు సభను విజయవంతం చేయాలని కోరుతూ ప్రచార జాతా ఆదివారం నేలకొండపల్లి మండలానికి చేరుకుంది. మండల కేంద్రంలో అనంతరం ముజాఫర్‌నగర్ గ్రామంలో సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమం నుండి ప్రస్తుతం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు, కర్నాటి భాను ప్రసాద్, సీతామహాలక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, బాగం నరసింహ రావు, తాళ్లూరి శ్రీమతి, గుగులోతు కాంతమ్మ, బానోతు బాలాజీ, మూడు శ్రీను, గుగులోతు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** పేదలకు మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీలో ముమ్మరంగా పర్యటించారు. టెంపుల్‌సిటిలో రూ.33లక్షల90వేలు, చిన్నతండలో రూ.20లక్షల33వేలు, సూర్యానగర్‌లో రూ.24లక్షల87వేలు, నాల్గవతరగతి ఉద్యోగుల కాలనీలో రూ.24లక్షల87వేలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణపనులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాలలో సిపి సునీల్‌దత్, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ యాకుబ్, ఇరిగేషన్ ఎస్‌ఇ ఎం,వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారులు పుల్లయ్య, హౌజింగ్ పిడి భూక్య శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, పాలేరునియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ భైరు హరినాథ్‌బాబు, కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, అంబటి సుబ్బరావు, తమ్మినేని నవీన్, భూక్య సురేష్‌నాయక్, కళ్లెం వెంకట్‌రెడ్డి, వెంపటి రవి పాల్గొన్నారు.

# పోరాటం లేకుండా సమస్యలు పరిష్కారం కావు

### ఖమ్మం నుంచే పెన్షనర్ల సమర శంఖం
### సంఘం జాతీయ కార్యదర్శి సుధాకర్






**ప్రజాపక్షం/ ఖమ్మం :** పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం నుంచే సమరశంఖం పూరించాలని ఆలిండియా స్టేట్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి. సుధాకర్ పిలుపునిచ్చారు. పోరాటం లేకుండా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని, ప్రభుత్వాల వైఖరి మారాలంటే పోరాటమే శరణ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల సదస్సు ఆదివారం స్థానిక టిఎన్‌జీవో ఫంక్షన్ హాల్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో సుధాకర్ మాట్లాడుతూ పాలక వర్గాలు పెన్షనర్లపై పెట్టే ఖర్చును వృధా ఖర్చుగా భావిస్తున్నాయని ఈ క్రమంలోనే ఓపిఎస్‌ను రద్దు చేశారని ఆయన తెలిపారు. 2014లో రాంలీలా మైదానంలో 10 లక్షల మందితో ర్యాలీ నిర్వహించడం జరిగిందని, ఆ తర్వాత సుప్రీం కోర్టు కూడా పెన్షన్ భిక్ష కాదని ఉద్యోగుల హక్కు అని తీర్పునిచ్చిన సంగతి ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత పెన్షన్ విధానంలో అనేక లోపాలు ఉన్నాయని, పెరుగుదల ఉండదని ఆఖరి 12నెలల వేతనంలో సగం మాత్రమే ఇస్తారని ఆయన తెలిపారు. పెన్షన్ వ్యాలిడేషన్ చట్టం వచ్చిందని రూల్స్‌ను మార్చారని 2026 జనవరి ఒకటి నుంచి ఎనిమిదవ వేతన కమిటీ సిఫారసులను అమలు చేసే అధికారం కేంద్రం తన చేతుల్లోకి తీసుకుందని సుధాకర్ తెలిపారు. కంట్రోల్ పే కమిషన్‌ను అనుసరించి 15 రాష్ట్రాలు పే రీవిజన్‌ను అమలు చేస్తున్నాయని దక్షిణాది రాష్ట్రాలలో సొంత పిఆర్‌సి ఉన్నాయని అయినా కేంద్రం మనకు నష్టం చేసే విధంగా నియమాలను రూపొందిస్తే రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. మార్చి 25ను విద్రోహ దినంగా పెన్షనర్లు పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. జేఏసి నాయకత్వంపై ఉద్యమ బాధ్యత ఉందని రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్దరించాయని ఈ రాష్ట్రంలో కూడా ఓపిఎస్ అమలయ్యేవిధంగా పోరాటం కొనసాగించాలన్నారు. సభలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఐక్య ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని తమిళ నాడులో పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేస్తున్నట్లే తెలంగాణలో కూడా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో అనేక ఉద్యమాలు పురుడు పోసుకున్నాయని పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఖమ్మం వేదికగా ఉద్యమం ఉధృతం చేయాలని రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఐక్య కార్యాచరణకు తమ సంఘం సంపూర్ణ మద్దతునిస్తుందని ఆయన తెలిపారు. ఈ సభలో మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి జయభారతి, తెలంగాణ మహిళా ఛైర్‌పర్సన్ వి.రమాదేవి, సంఘం నాయకులు నాగమణి, శంకర్‌లింగం, రామనోహర్, పురుషోత్తం, టిజిఒ జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, వేలాద్రి, నాయకులు రాయల రవికుమార్, ఐవి భాస్కరాచారి, కనపర్తి వెంకటేశ్వర్లు, గుర్రాల శ్రీనివాసరావు, మేరీ ఏసుపాదం, పెదమళ్ల సత్యనారాయణ, శరత్‌బాబు, ఊడుగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**డైరీ ఆవిష్కరణ, సన్మానం :** సదస్సు అనంతరం పెన్షనర్ల సంఘం డైరీని, క్యాలెండర్‌ను అసోసియేషన్ నాయకులు ఆవిష్కరించారు. సదస్సు సందర్భంగా వివిధ శాఖలకు చెందిన పలువురిని సీనియర్ పెన్షనర్లను ఘనంగా సన్మానించారు.

## పార్టీ బలోపేతానికి కమిటీలు
### ఖమ్మం జిల్లా కమిటీల అబ్జర్వర్ అనిల్‌కుమార్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మండల, డివిజన్ కమిటీలతో పార్టీ బలోపేతమవుతుందని, జనవరి 15 నాటికి కాంగ్రెస్ పార్టీ మండల, డివిజన్ కమిటీలను ఏర్పాటు చేసి వాటి వివరాలను అందించాలని ఖమ్మం జిల్లా కమిటీల అబ్జర్వర్ గాలి అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌కు విచ్చేసిన అనిల్‌కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుతు నూతి సత్యనారాయణగౌడ్, నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వర రావు, మాజీ ఎంఎల్‌ఏ కొండబాల కోటేశ్వరరావు స్వాగతం పలికారు. అనంతరం జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈనెల ఎనిమిదిన గాంధీ భవన్‌లో ఎగ్జిక్యూటీవ్ మీటింగ్ ఉందని ఈలోపు జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలను సంప్రదించి జిల్లా కమిటీ వివరాలను టిపిసిసి అధ్యక్షుడికి అందించనున్నట్లు తెలిపారు. నూతనంగా ఏర్పాటైన కమిటీల ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెజండ్ల సాయికుమార్, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, పుచ్చకాయల వీరభద్రం, చోటా బాబా, బాలాజీ నాయక్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



# బహిరంగ సభకు వేలాదిగా తరలాలి




### సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

**ప్రజాపక్షం/మణుగూరు :** సిపిఐ వంద సంవత్సరాల ముగింపు వేడుకల బహిరంగ సభను విజయవంతం చేయాలని, సిపిఐ పురిటి గడ్డైన మణుగూరు నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున ఖమ్మం తరలిరావాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. ఆదివారం అశ్వాపురం నుండి మణుగూరుకు వస్తున్న సిపిఐ ప్రజా ప్రచార జాతయాత్రను మణుగూరు హనుమాన్ టెంపుల్ వద్ద మండల పట్టణ నాయకులు స్వాగతం పలుకుతూ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాష, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావుకు పూలమాల వేసి స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్గ్యాల సుధాకర్ అధ్యక్షత వహించగా సాబీర్ పాషా మాట్లాడుతూ జనవరి 18న ఖమ్మంలో జరిగే కనీవినీ ఎరుగని బహిరంగ సభకు మణుగూరు పట్టణం మండలం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర సమితి సభ్యులు పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, జిల్లా సమితి సభ్యులు, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మీ నారాయణ, సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, పట్టణ కార్యదర్శి దుగ్గ్యాల సుధాకర్ , సింగరేణి కాలనీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, జిల్లా సమితి సభ్యులు ఏదారి రమేష్, వేరుపుల మల్లికార్జున్, సోందికుటుంబరావు, ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, రైతు సంఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య ఎస్కే సర్వర్, మణుగూరు మండలం మహిళా సమైక్య అధ్యక్షురాలు సమ్మక్క, కార్యదర్శి సుజాత నిర్మల, సాంబాయిగూడెం సర్పంచ్ చీడ ఉషారాణి, రామంజివరం సర్పంచ్ బాడిషా కల్పన, ఉప సర్పంచ్ పులిగల రమేష్, వార్డ్ మెంబర్లు వజ్రా వెంకటేశ్వర్లు, వేర్పుల నరేష్ మండల, పట్టణ కార్యవర్గ సభ్యులు కన్నెబోయిన ప్రసాద్ ఆధర్ల రాములు, కోటేశ్వర రావు, రంజిత్, ప్రజా నాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

# మోడల్ మున్సిపాలిటీగా 'వైరా'ను తీర్చిదిద్దుతా

### ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. ఆదివారం వైరా మున్సిపాలిటీ 20 వార్డుల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ భూమిపూజ నిర్వహించారు. శంకుస్థాపన భూమి పూజ కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ముందు వైరా రింగు రోడ్డు సెంటర్‌లో దివంగత రాజీవ్ గాంధి విగ్రహానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పూలమాల వేశారు. అనంతరం వైరా రిజర్వాయర్ అలుగుల వద్ద దాసాంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి రిజర్వాయర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుండి దాసాంజనేయ స్వామి దేవాలయం వరకు సుమారు కోటి రూపాయల నిధులు మంజూరుతో సిసి రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ అభివృద్ధి తన లక్ష్యమని మున్సిపాలిటీ అభివృద్ధికి మరో రూ.100 కోట్లు నిధులైనా తీసుకొస్తానన్నారు.కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, బొర్రా రాజశేఖర్, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, మాజీ మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, మాజీ మున్సిపాల్‌వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, పొదిల హరినాథ్, ఫణితి సైదులు, పమ్మి అశోక్, వీరంశెట్టి సీతారాములు, రాంపూడి పాలేటి నర్సింహారావు, కొప్పురావూరి శబరి, ఫణితి శ్రీను, కట్ల సంతోష్, దార్న రాజశేఖర్, మిట్టపల్లి నాగి, కొల్లి రమేష్, సయ్యద్ అన్వర్, బిడికె.రత్నం, నంబూరి కనకదుర్గ, బత్తుల గీత, జాలాది రామకృష్ణ, పల్లపు కొండలు, చెరుకూరి కిరణ్, సూర్యదేవర శ్రీధర్, ఐవి.నాగేశ్వరరావు, రేచర్ల మల్లేవ్వరి, రేచర్ల సత్యం, ఆదిఆనందరావు, కంభంపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

## అబాకస్ పోటీలలో చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ఖమ్మం పట్టణంలోని నిర్మల్ హై స్కూల్‌లో ఆదివారం జిల్లా స్థాయిలో జరిగిన అబాకస్ పరీక్షలో సత్తుపల్లి చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. విద్యార్థులను గణిత ఉపాధ్యాయులు బి. శ్రీనివాస్, భువనేశ్వరిలను పాఠశాల ప్రిన్సిపాల్ వై.మురళీకృష్ణ, డైరక్టర్లు ఆర్. సుజాత, ఆర్. రాకేష్, ఎం.రవికుమార్ అధ్యాపక బృందం అభినందించారు.

## ప్రశాంతంగా టెట్ పరీక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లాలో టీచర్ ఎలిజిబులిటి టెస్ట్ (టెట్) రెండవ రోజు ప్రశాంతంగా ముగిసిందని జిల్లా విద్యాశాఖాధికారి చైతన్య జైని తెలిపారు. జిల్లాలో మొత్తం తొమ్మిది కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం సెషన్‌లో 1786 మందికి 1077 మంది అభ్యర్థులు హాజరైనట్లు, మధ్యాహ్నం సెషన్‌లో 2020 మందికి 1615 మంది అభ్యర్థులు హాజరైనట్లు డిఈవో తెలిపారు.

## నేడు బిఆర్‌ఎస్ సన్నాహక సమావేశం


**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బిఆర్‌ఎస్ ఖమ్మం నియోజక వర్గ సన్నాహక సమావేశం సోమవారం జరగనుంది. ఈనెల ఏడున కేటిఆర్ ఖమ్మం పర్యటన సందర్భంగా మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ స్వగృహంలో సమావేశం జరగనుందని మాజీ మంత్రి వ్యక్తిగత సహాయకులు రవికిరణ్ తెలిపారు.

## మిర్చి పంట నష్టపరిచిన వారిపై చర్యలు తీసుకోండి : బిఆర్‌ఎస్

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మిర్చి పంట నష్ట పరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్ నేతలు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో ఇటీవల ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎన్నికైన కొంటెముక్కుల వెంకటేశ్వర్లు తండ్రి శ్రీనివాసరావుకు చెందిన వ్యవసాయ భూమిలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మిర్చి పంటపై కలుపు మందు చల్లారు. ఆదివారం బిఆర్‌ఎస్ నేతలు నష్టపోయిన పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో బిఆర్‌ఎస్ గెలిచిందనే ఆక్రోశంతో పంట పొలాల్లో కలుపు మందు చల్లి పంటను నష్టపరిచారని, బిఆర్‌ఎస్ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి నియోజక వర్గంలోనే ఇటువంటి చర్యలకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో రవికిరణ్, వీరునాయక్, గుత్తా రవి, హరిప్రసాద్, మెంటెం రామారావు, చెరుకూరి ప్రదీప్, ఉపసర్పంచ్ ఉపేందర్, తాతా వెంకటేశ్వర్లు, దొంతు సత్యనారాయణ, నున్నా శ్రీనివాసరావు, భాస్కర్, నగేష్, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# సీతమ్మ సాగర్ భూముల్లో అక్రమ రహదారి





### అనుమతులు లేకుండానే నిర్మాణం

**ప్రజాపక్షం/చర్ల :** సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు సర్వే నిర్వహించి భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించారు. పరిహారం చెల్లించిన భూముల్లో ఇసుక రవాణా కోసం అక్రమంగా రహదారిని నిర్మించిన అధికారులు చోద్యం చూస్తున్న ఘటన చర్ల మండలంలో చోటు చేసుకుంది. గోదావరి నదిపై సీతమ్మ సాగర్ నిర్మాణం కారణంగా ముంపుకు గురవుతున్న భూములను గుర్తించి పరిహారం ఇచ్చారు. అయితే పరిహారం ఇచ్చిన తర్వాత అవి ప్రభుత్వ భూములే అటువంటి భూముల్లో రహదారి నిర్మించారు. ఏజెన్సీ చట్టాల ప్రకారం కానీ ప్రభుత్వ భూ నిబంధనల ప్రకారం కానీ ఈ రహదారి నిర్మాణం పూర్తిగా చట్ట విరుద్ధం తేగడ ఇసుక క్వారీకి సంబంధించి రేంజింగ్ కాంట్రాక్టర్లు తేగడ సమీపంలోని తాలిపేరు ఒడ్డు నుంచి ఎర్రగడ్డ గ్రామం వరకు సుమారు రెండు కిలో మీటర్ల మేర అక్రమ గ్రావెల్ రహదారిని నిర్మించారు. కేవలం ఇసుక రవాణా కోసమే ఈ రహదారిని నిర్మించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఈ భూములు నీటిపారుదల శాఖ ఆధీనంలో ఉన్నాయి. భూ సేకరణ చట్టం 2013 సెక్షన్ 24 ప్రకారం పరిహారం చెల్లించిన భూములు నిర్దిష్టమైన ప్రజా ప్రయోజనానికి మాత్రమే వినియోగించాలి. నీటిపారుదల శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక కాంట్రాక్టర్లు అక్రమ రహదారిని నిర్మించారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో పెసా చట్టం 1996 ప్రకారం రహదారి నిర్మించాలంటే గ్రామసభ తీర్మానం తప్పనిసరి. కరకట్ట నిర్మాణానికి కేటాయించిన భూముల్లో అక్రమ రహదారి వల్ల భవిష్యత్తులో కరకట్ట నిర్మాణానికి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉంది. ప్రకృతి సమతుల్యత కూడా దెబ్బతినే అవకాశం ఉంది. రెవెన్యూ నీటిపారుదల శాఖ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా రహదారిని నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిర్మాణానికి పాల్పడిన వారిపై తగు చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# రీల్

## రజనీకాంత్@173



రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై తలైవర్ రజనీకాంత్ 173 చిత్రం షూటింగ్ ప్రారంభమయింది. సూపర్ స్టార్ రజనీకాంత్, కమల్ హాసన్ కాంబినేషన్‌లో వచ్చే ఈ చిత్రానికి సిబి చక్రవర్తి దర్శకత్వం వహిస్తారు. రజనీకాంత్ హీరోగా కమల్ హాసన్, ఆర్ మహేంద్రన్ నిర్మాణంలో తలైవర్ 173 రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ లెగసీని గ్రాండ్ సెలబ్రేట్ చేసుకోనుంది. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రం మాస్ అప్పీల్, ఎమోషన్, హై క్వాలిటీ మేకింగ్‌తో ప్రేక్షకులని అలరించబోతోంది. ఈ సినిమా చిత్రీకరణ త్వరలో ప్రారంభమవుతుంది. త్వరలోనే తారాగణం, టెక్నికల్ టీం గురించి మరిన్ని వివరాలను రివిల్ చేయనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు స్పెషల్ ట్రీట్‌గా తలైవర్ 173 సినిమాను 2027 పొంగల్ సందర్భంగా థియేటర్లలో విడుదల కానుంది.

## 'జెట్లీ' యాక్షన్ గ్లింప్స్



కమెడియన్ సత్య, తాజాగా నటించిన సినిమా 'జెట్లీ'. రితేష్ రానా దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మించిన ఈ చిత్రంతో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా తెలుగులో పరిచయం కానుంది. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్స్ పోస్టర్స్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా సినిమా గ్లింప్స్‌ను లాంచ్ చేశారు. సత్య వాయిస్‌లో వేమన శతకంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. అకస్మాత్తుగా అల్లకల్లోలం ప్రయాణికులను భయాందోళనకు గురికావడం, తుపాకీ కాల్పులు, హైజాక్ గురించి సూచిస్తూ, సత్య పరిచయం కావడం ఆకట్టుకుందిసత్యవెన్నెల కిషోర్ మధ్య వచ్చే డైలాగ్స్ గ్లింప్స్‌కు మరింత చార్మిన్ యాడ్ చేశాయి. నివ్వు ఏ హీరో అని అడిగినప్పుడు, జనరల్ కంపార్ట్మెంట్ అంటూ సత్య అన్సర్ ఇవ్వడం ప్రేక్షకులకు వెంటనే కనెక్ట్ అయ్యింది. ఈవెంట్‌లో సత్య మాట్లాడుతూ.. రితేష్, చెర్రీతో మళ్ళీ కలిసి వర్క్ చేయడం చాలా ఆనందంగా ఉంది. మా మధ్య మంచి క్రియేటివ్ ఫ్రీడమ్ ఉంటుంది. ఇందులో స్పెషల్ హీరో అంటూ ఏమీ ఉండదు. యాక్షన్‌లో కూడా కామెడీని ఫీల్ అవుతారు. మత్తు వదలరా సక్సెస్ తర్వాత నాకు వచ్చిన అవకాశాలు పెరిగాయి. చెర్రితో సినిమా అనగానే నేను ఇంకేది ఆలోచించలేదు. నేను కథని డైరెక్టర్ నే ఫాలో అవుతాను. ఆ క్యారెక్టర్ తగ్గట్టు స్పాట్లో నాకు ఏదైనా అనిపిస్తే అది చెప్తాను. అయితే మొత్తం అంతా డైరెక్టర్ మీదే ఉంటుంది. ఈ సినిమా కోసం యాక్షన్ చేశాను. నాన్ చాకు ఎలా వాడాలో నేర్చుకున్నాను అన్నారు.





జనవరి 12న విడుదల కానున్న 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా హిట్ కావాలని మొక్కుతూ తిరుమల శ్రీవారిని దర్శించుకున్న డైరెక్టర్ అనిల్ రవి పూడి, నిర్మాత సాహు గారపాటి, గేయ రచయిత రామజోగయ్య శాస్త్రి

## హౌస్‌ఫుల్‌గా రన్ అవుతోంది

-శ్రీ నందు

'సైక్ సిద్ధార్థ' హౌస్ ఫుల్‌గా రన్ అవుతోందని హీరో శ్రీనందు అన్నారు. ఇటీవల విడుదల అయిన ఈ సినిమా సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ నందు మాట్లాడుతూ.. ఈ సక్సెస్ కోసమే 18 ఏళ్లుగా ఎదురు చూశాను. ఒక బ్లాక్ బస్టర్ పోస్టర్‌తో మీ అందరి ముందు మాట్లాడాలని. నేను ఎన్నో సినిమాలు చేశాను కానీ అవి సురేష్ బాబు దగ్గరికి వెళ్లలేదు. ఈ సినిమా వెళ్లిందంటే కారణం డైరెక్టర్ వరుణ్ విజన్. ఈ సినిమా క్రెడిట్ అంతా వరుణ్ కే దక్కుతుంది. నాకు ఈ సినిమా ఇచ్చిన వరుణ్‌కి థాంక్యూ. ఈ సినిమా రైటింగ్ ఎడిటింగ్ స్క్రీన్ ప్లే సౌండ్ డిజైన్ అన్నీ కొత్తగా ఉంటాయి. ప్రతిదీ చాలా ఆలోచించి చేసింది. ఫస్ట్ 100 మందిలో 40 మందికి నచ్చుతుంది. సెకండ్ హాఫ్ 100 మందికి నచ్చుతుంది. 40 మంది కూడా ఈ సినిమాని ఈ సినిమా గురించి జీవితాంతం మాట్లాడుకుంటారు. సినిమా హౌస్ ఫుల్‌గా రన్ అవుతుంది. థియేటర్‌లో ఒక మాస్ సినిమాని ఎంజాయ్ చేస్తున్నట్టుగా చూస్తున్నారు. ఈ సినిమాని ఇంత గ్రాండ్‌గా సెలబ్రేట్ చేస్తున్న ఆడియన్స్ అందరికీ థాంక్యూ సో మచ్. సెకండ్ హాఫ్ ముద్ద పప్పు అవకాయ లాంటింది అందరికీ నచ్చుతుంది. సక్సెస్ అంటే డబ్బులతో పాటు అవకాశాలు రావడం. మాకు అలాంటి అవకాశాలు వస్తున్నాయి. ఇంత మంచి బ్లాక్ బస్టర్ ఇచ్చిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు అన్నారు. ఈ సక్సెస్ మీట్‌లో హీరోయిన్ యామిని భాస్కర్, డైరెక్టర్ వరుణ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వెంకట్ సిద్ధారెడ్డి పాల్గొన్నారు.



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా సాగర్ కె చంద్ర దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ యాక్షన్ ఎంటర్టైనర్ 'టైసన్ నాయుడు'. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాకు సమందించి ఒక పోస్టర్‌ను విడుదల చేశారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తుపాకీని పట్టుకొని, శత్రువుల వైపు గురి పెట్టి నిల్చున్న ఈ పోస్టర్ అదిరిపోయింది. ఈ పోస్టర్‌కి సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది.

## 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్' టీజర్ విడుదల



త్రిగుణ్, పాయల్ రాధా కృష్ణ, అనీష్ కురువిల్లా ప్రధాన పాత్రల్లో చేస్తున్న చిత్రం 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ చెలికాని రచన, దర్శకత్వం వహించారు. సిహెచ్‌విఎస్ఎన్ బాబ్జీ సమర్పణలో లోటస్ క్రియేటివ్ వరక్స్ బ్యానర్‌పై అరవింద్ మండెం నిర్మించారు. అరుణ్ చిలువేరు, ప్రకాష్ చెరుకూరి సంగీతం సమకూర్చారు. ఈ సినిమా టీజర్ గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హీరో త్రిగుణ్ మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా చిన్న సినిమాలన్నీ అద్భుతంగా ఆడుతున్నాయి. అందరికి ఒక హోప్ వచ్చింది. సినిమాలు చూడడం థియేటర్‌కి రావడం చాలా ఆనందంగా ఉంది. తక్కువ టికెట్ ధరల్లో పెడితే ఆడియన్స్ అందరూ వచ్చి చూస్తారని భావిస్తున్నాను. మోడరన్ లైఫ్, పాత పద్ధతిలో ఉన్న వ్యవసాయాన్ని ఎలా కలపొచ్చు అనేది ఈ సినిమాల్లో చాలా ఇంట్రెస్టింగ్‌గా చూపించారు. చాలా ముఖ్యమైన విషయాలు ఇందులో చెప్పాం. మనమందరం కూడా వ్యవసాయం నుంచే వచ్చాము. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే అన్ని తరాలు కూడా వ్యవసాయం నుంచే వచ్చాయి. వ్యవసాయం గురించి ఇంపార్టెంట్ విషయాలు మాట్లాడుతూనే సినిమా చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది. త్వరలోనే రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మధుదీప్, పాయల్, అనీష్ కురివిల్లా, సత్య కృష్ణ, ప్రొడ్యూసర్ అరవింద్, పాల్గొన్నారు.



'సీనియర్స్ సీనియర్సే... ఈ సంక్రాంతికి అన్ని సినిమాలు హిట్ అవ్వాలి. మా సినిమా కూడా హిట్ అయితే హ్యాపీ' అని ఇటీవల రాజాసాబ్ ఈవెంట్‌లో ప్రభాస్ అన్న మాటలివి. ప్రతి సంక్రాంతికి తెలుగు సినిమాల మధ్య పోటీ ఉండటం సహజమే. కానీ ఈ సారి పోటీ కాస్త వెరైటీగా ఉంది. ఈ సారి సంక్రాంతి పోటీ సీనియర్ వర్సెస్ జూనియర్ మధ్య నెలకొంది.

## సంక్రాంతి కొట్లాట

### సీనియర్ V/S జూనియర్










ప్రభాస్ ఇప్పుడు పాన్ వరల్డ్ స్టార్ అవొచ్చు కానీ తెలుగు తెరపై చిరంజీవి కంటే చాలా జూనియర్. రవి తేజ సీనియరే కానీ రవి తేజతో పోల్చుకుంటే చాలా జూనియర్ అయిన శర్వానంద్ కూడా ఈ సంక్రాంతికి పోటీ పడుతున్నాడు. 2025 సంక్రాంతి సినిమాల్లో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది సంక్రాంతికి వస్తున్నాం. వెంకటేష్ హీరోగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా వెంకటేష్ కెరీర్ లోనే పెద్ద హిట్‌గా నిలబడింది. అదే కాన్ఫిడెన్స్ తో మళ్ళీ సంక్రాంతికి జనం ముందుకు అనిల్ రావిపూడి వస్తున్నాడు. మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన 'మన శంకర్ వరప్రసాద్ గారు' పేరుతో నిర్మించిన ఈ సినిమాలో వెంకటేష్ కూడా కనిపిస్తారు. కొన్ని కీలకమైన సన్నివేశాలతో పాటు చిరంజీవి, వెంకటేష్ లపై ఒక మాస్ పాటను కూడా చిత్రీకరించారు. ఈ సినిమాపై చిరంజీవి అభిమానుల్లోనూ, ట్రేడ్ వర్గాల్లోనూ భారీగా అంచనాలు ఉన్నాయి. మన శంకర వరప్రసాద్ గారు సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ ఏడాది సంక్రాంతి బరిలో వస్తున్న తొలి సినిమా రాజాసాబ్. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన ఈ సినిమాలో నిధి అగర్వాల్, రిద్ధికుమార్, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. హర్రర్ జోనర్ లో నిర్మించిన ఈ సినిమా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఇప్పటి వరకు విడుదలైన టీజర్, ట్రైలర్, సాంగ్స్ కు మంచి స్పందన వస్తోంది. అయితే రాజాసాబ్ సినిమా దర్శకుడు మారుతి ఇప్పటి వరకు పెద్ద యాక్టర్ ను హ్యాండిల్ చెయ్యలేదు. మారుతీ కెరీర్ లో పెద్ద నటుణ్ని హ్యాండిల్ చెయ్యడం ఇదే ప్రథమం. అందుకే కాబోలు మారుతి ఎలా తీశాడో అనే అనుమానాలు ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి గత ఏడాది భారీ ఫ్లాప్ లను చూసిన రవితేజ కూడా ఈ సంక్రాంతి బరిలో దిగుతున్నారు. భర్త మహాశయులకు విజ్ఞప్తి పేరుతో వస్తున్న సినిమా ఈనెల 13వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆషిక రంగనాథ్ డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు కిషోర్ తిరుమల దర్శకుడు. ఇది పూర్తిగా రవితేజ ఎంటర్‌టైన్‌మెంట్ మార్క్ సినిమాలా ఉంటుందని ఫిలిం నగర్ టాక్. ఇదే పోటీలో విడుదల అవుతున్న మరో చిత్రం నారి నారి నడుమ మురారి. శర్వానంద్ హీరోగా నటిస్తున్నారు. సామజవరగమన సినిమా దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. శర్వానంద్ సరసన సంయుక్త మీనన్, సాక్షి వైద్య హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా 14న విడుదల కానుంది. పైన పేర్కొన్న హీరోలందరి కంటే జూనియర్ హీరో అయిన నవీన్ పోలిశెట్టి నటించిన అనగనగ ఒకరాజు సినిమా కూడా సంక్రాంతి బరిలో దిగుతోంది. మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటించిన ఈ సినిమాను కూడా 14నే ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. ఇది కూడా ఎంటర్టైన్మెంట్ ప్రధానంగా తెరకెక్కించిన సినిమా. ఈ ఏడాది సంక్రాంతికి మొత్తం అయిదు సినిమాలు విడుదల కానున్నాయి. మరి ఈ అయిదు సినిమాల్లో సంక్రాంతి విజేత హీరో ఎవరు అవుతారో వేచి చూద్దాం.

## వ్యవస్థ సృష్టించిన విపత్తు

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందో అనడానికి ఇది నిదర్శనమని సింగ్ పిటిఐతో అన్నారు. భగీరత్‌పురా ప్రాంతంలో ఈ సంక్షోభం ప్రారంభమైంది. స్థానిక ప్రభుత్వ అధికారులు తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్‌లో భారీ లీక్‌ను కనుగొన్నారు. ఒక పోలీస్ అవుట్‌పోస్ట్‌లోని నీటి పైప్‌లైన్‌పై మరుగుదొడ్డిని నిర్మించిన ప్రాంతంలో నీరు కలుషితమైనట్లు తేలింది. మరుగుదొడ్డి నుండి మురుగునీరు పొంగిపొర్లి నీటి పైప్‌లైన్‌లలోకి చేరడం వల్ల వాంతులు, విరేచనాలు వంటి తీవ్రమైన అనారోగ్యాలు ప్రబలాయని ప్రభుత్వ అధికారులు అంగీకరించారు. అధికారికంగా ఇప్పటివరకు మృతుల సంఖ్య ఆరుగా నిర్ధారించారు. అయితే, మృతుల సంఖ్య 10 నుండి 14మధ్య ఉండవచ్చని, మరో 200 మంది ఆసుపత్రిలో ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. 30 మందికి పైగా రోగులు ఇప్పటికీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లలో ఉన్నారు. 'ఇండోర్‌లోని కలుషిత తాగునీటి సంక్షోభం వ్యవస్థ సృష్టించిన విపత్తు. డబ్బు ఆదా చేయడానికి, కాంట్రాక్టర్లు తాగునీటి పైప్‌లైన్‌లను మురుగు కాలువల పక్కనే వేస్తున్నారు' అని సింగ్ ఆరోపించారు. అవినీతి మొత్తం వ్యవస్థను నాశనం చేసిందని ఆయన ఆరోపించారు. ఇండోర్ విషాదం ఈ అవినీతి వ్యవస్థ యొక్క ప్రత్యక్ష ఫలితమేనని ఆయన అన్నారు. ఇండోర్‌లో ఏటా భూగర్భ జలమట్టాలు పడిపోవడం అత్యంత ఆందోళన కలిగించే విషయని, తాను 1992లో మొదటిసారి ఇండోర్‌ను సందర్శించానని, అప్పుడే ఈ నగరం నర్మదా నది నీటిపై ఎంతకాలం ఆధారపడుతుందని ప్రశ్నించానని సింగ్ అన్నారు. ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా నగరం నర్మదా నీటిపైనే ఆధారపడి ఉందంటే, ప్రభుత్వ వ్యవస్థలోని ప్రజలు ఒక బాధ్యతాయుతమైన నీటి నిర్వహణ యంత్రాంగాన్ని సృష్టించాలనుకోలేదని అర్థమవుతోందని ఆయన పేర్కొన్నారు. 80 కిలోమీటర్ల దూరం నుండి నర్మదా నీటిని ఇండోర్‌కు తీసుకువచ్చే ప్రాజెక్టులో అవినీతికి పెద్ద మొత్తంలో డబ్బు దుర్వినియోగం అవుతోందని ఆ జల సంరక్షకుడు ఆరోపించారు. ఇండోర్ తన నీటి అవసరాల కోసం నర్మదా నదిపై ఆధారపడుతుంది. మున్సిపల్ కార్పొరేషన్ వేసిన పైప్‌లైన్ల ద్వారా, 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న పొరుగున ఉన్న ఖర్గోన్ జిల్లాలోని జలుడ్ నుండి నర్మదా నది నీటిని ఇండోర్‌కు తీసుకువచ్చి, ప్రత్యామ్నాయ రోజులలో ఇళ్లకు సరఫరా చేస్తున్నారు. మున్సిపల్ అధికారుల ప్రకారం, ఈ ప్రాజెక్ట్ కోసం కేవలం విద్యుత్ బిల్లులకే ప్రతి నెలా మున్సిపల్ కార్పొరేషన్ ఖజానా నుండి సుమారు రూ.25 కోట్లు ఖర్చు చేస్తున్నారు. మేయర్ పుష్పమిత్ర భార్గవ చేసిన ప్రకటనల ద్వారా కూడా ఈ ప్రాజెక్ట్‌లో ఉన్న భారీ వ్యయాన్ని అంచనా వేయవచ్చు.

## ట్రంప్ వ్యవహారం

(మొదటి పేజీ తరువాయి)

చంపేశారని ఆ తర్వాత అణు ఆయుధాల గురించి ఎందుకు వెల్లడించడం లేదని నారాయణ ప్రశ్నించారు. వెనుజులాపై దాడి భారత దేశానికి నష్టమని దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఆయిల్ ఎగుమతిని అడ్డంపెట్టుకుని భవిష్యత్తులో అమెరికా ఒత్తిడి తెచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రజాస్వామ్య దేశాలపై విదేశీ శక్తులు దాడి చేసే హక్కు లేదన్నారు. బిజెపి, గాంధీ, నెహ్రూలను చరిత్ర నుండి చెరిపివేయాలని చూస్తుందన్నారు. కార్పొరేట్ సంస్థల కోసమే కమ్యూనిస్టులు పోరాడి సాధించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మార్పు చేయడం వెనక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. గాంధీజీని భౌతికంగా చంపేసిన సంఘ్ పరివార్ అనుకూలురు ఇప్పుడు గాంధీ పేరు మార్చారన్నారు. 40 కుటుంబాల కోసం 28 లక్షల కోట్ల రూపాయల రాయితీ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం 85 కోట్ల మందికి 10లక్షల కోట్లు ఖర్చు చేసేందుకు జంకుతుందని ఆయన తెలిపారు. 40 శాతం రాష్ట్రాలు భరించడం సాధ్యం కాదని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాలు చేతులు ఎత్తేశాయని తెలిపారు. జిఎస్టి రూపంలో దోపిడీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎన్‌ఆర్‌ఈజిఎస్ పథకం మార్పును ఉపసంహరించుకోవాలన్నారు. మూసీనది కలుషితంపై వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సిపిఐ ఆందోళన చేసిందని మూసీ ప్రక్షాళన ఇండ్లు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. శాసన సభను బైకాట్ చేసిన వారు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను చర్చించకుండా వేతనాలు పొందటం ఎలా సాధ్యమవుతుందన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంచాయతీ తగదని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చుని చర్చించాలని కోరారు. పోలవరం, బనకచర్ల సాధ్యం కాదని చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డిల గురుశిష్యుల కథ ముగిసిందన్నారు. తెలంగాణకు ఆంధ్రాలో విలీనమైన ఐదు గ్రామాలను వదిలివేయాలని దీని వల్ల రెండు రాష్ట్రాలకు నష్టం లేదన్నారు. జనవరి 18న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా చారిత్రిక సభ జరుగుతుందని నారాయణ తెలిపారు. లక్షలాది మందితో జరిగే ఈ సభలో దేశ విదేశీ ప్రతినిధులు హాజరు కానున్నారని 15 రోజుల పాటు ప్రచార కార్యక్రమాల్లో భాగంగా సభలు, సమావేశాలు, సదస్సులు జరుగుతాయన్నారు. కమ్యూనిస్టులు పురోగమించక తప్పదని మతోన్మాద శక్తులను అడ్డుకునే శక్తి కమ్యూనిస్టులకు మాత్రమే ఉందన్నారు. మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు,జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి కార్యవర్గ కూర్పుపై 8వ తేదీ నాటికి పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలి

### టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ సంస్థగత పదవులపై దృష్టి సారించిన టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ ఈనెల 8వ తేదీ నాటికి డిసిసి కార్యవర్గ కూర్పుపై పూర్తి స్థాయి నివేదిక అధిష్టానానికి అందజేయాలని డిసిసి అధ్యక్షులకు సూచించారు. ఆదివారం డిసిసి, టిపిసిసి ఉపాధ్యక్షులతో మహేశ్ కుమార్ జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎఐసిసి రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఎఐసిసి కార్యదర్శులు విశ్వనాథన్, సచిన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ మాట్లాడుతూ 8వ తేదీన గాంధీ భవన్‌లో టిపిసిసి విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం ఉంటుందని, ఈసమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ లతో పాటు టిపిసిసి కార్యవర్గం మొత్తం పాల్గొంటారని తెలిపారు. ఆ రోజు నాటికి డిసిసి కార్యవర్గ కూర్పుపై నివేదిక ఇవ్వాలన్నారు. అదేవిధంగా 15వ తేదీ లోగా మండల కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాలు పూర్తి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా జాతీయ ఉపాధి పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించడం పట్ల దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలుచేపట్టాలని ఎఐసిసి పిలుపులో భాగంగా మన్రేగా కార్యక్రమాలు రాష్ట్రంలో విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.






## కదం తొక్కిన కమ్యూనిస్టులు

(మొదటి పేజీ తరువాయి)

పల్లా వెంకట రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నగరంలోని సర్కస్ గ్రౌండ్ నుండి భారీ ర్యాలీ రెవెన్యూ గార్డెన్ వరకు సాగింది. అనంతరం రెవెన్యూ గార్డెన్‌లో జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సభలో వక్తలు మాట్లాడారు. ఈ సందర్భంగా పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ, భారత కమ్యూనిస్టు పార్టీ డిసెంబర్ 26తో వందేళ్లు పూర్తి చేసుకుందని, ఈ దేశంలో వందేళ్లు పూర్తి చేసుకున్న ఏకైక రాజకీయ పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర ఎనలేనిదని కొనియాడారు. దేశ సంపూర్ణ స్వాతంత్య్రం కోసం మొదట పిలుపునిచ్చిన పార్టీ సిపిఐ అని వెంకట రెడ్డి గుర్తు చేశారు. దేశంలోని అన్ని రంగాల్లోని ప్రజలను ప్రజాసంఘాలను ఏర్పాటు చేసి స్వాతంత్ర్య పోరాటంలో బాగస్వాములను చేసిందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ నాయకులు స్వాతంత్ర్య పోరాటంలో బాగస్వాములైనారని, కానీ నేడు దేశంలో అధికారంలో ఉన్న బిజెపి, ఆ పార్టీ నాయకులు అప్పుడు లేరన్నారు. స్వాతంత్ర్య పోరాట అనంతరం తెలంగాణాలో రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దుం మొయినోద్దీన్ లాంటి కమ్యూనిస్టు పార్టీ నాయకులు తెలంగాణ సాయిధ పోరాటానికి పిలుపునిచ్చారని తెలిపారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడి ఈ ప్రాంతంలోని గ్రామాలను వెట్టి నుంచి విముక్తి చేసి లక్షల ఎకరాలు పంచిన చరిత్ర సిపిఐకి ఉందని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ నుంచి గెలిచిన ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజా ప్రయోజనాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంతగానో కృషి చేశారని తెలిపారు. కమ్యూనిస్టుల సూచనతో ప్రవేశ పెట్టిన ఉపాధిహామీ పథకాన్ని ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నీరుగార్చేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. ఉపాధి చట్టంలో సవరణలు చేసి రాష్ట్రాలపై భారాన్ని మోపుతుందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని వెంకటరెడ్డి డిమాండ్ చేశా రు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర గొప్పదని అన్నారు. తెలంగాణ సాయిధ పోరాటంలో పది లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర 3500 గ్రామాలను విముక్తి చేసిన చరిత్ర.. 4500 మంది ప్రాణాలను త్యాగం చేసిన చరిత్ర ఏ పార్టీకి లేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాంటలో కరీంనగర్ కు ప్రత్యేక స్థానముందన్నారు. అనభేరి ప్రభాకర్ రావు లాంటి వాళ్లు పేదల పక్షాన కొట్లాడి తన ప్రాణాలను ఫణంగా పెట్టి అమరుడైనారని గుర్తు చేశారు. రాబోయే పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ సంఖ్యలో గెలిపించుకోవాలని కోరారు. అనంతరం సిపిఐ రాష్ట్ర సమాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ ప్రసంగించారు.



ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కార్యదర్శి సదానందం, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహా, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అందే స్వామి, పొన్నగంటి కేదారి, శంకర్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, కోయడ సృజన్ కుమార్, బోయిన అశోక్ న్యాలపట్ల రాజు, నాగెల్లి లక్ష్మారెడ్డి, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, బోయిన తిరుపతి,పిట్టల సమ్మయ్య, కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, బండ రాజిరెడ్డి, గోవిందుల రవి, కొట్ట అంజలి, ఉమ్మెత్తల రవీందర్ రెడ్డి, కళ్యాణ్, చోక్కల శ్రీశైలం,గజ్జ ఐలయ్య, మౌలానా, మచ్చ రమేష్, బ్రాహ్మణపల్లి యుగంధర్, రామారావు వెంకటేష్, సుజాత,లక్ష్మి మమత, బిర్లా రమ, స్వాతి, పైడిపల్లి వెంకటేష్, బోయిని పటేల్, తదితరులు పాల్గొన్నారు.




డప్పు చప్పుళ్లు, కోలాటాలు, నృత్యాలతో ప్రదర్శన

కరీంనగర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ఉత్సవాల సందర్భంగా పార్టీ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని ప్రధాన కూడళ్లను ఎర్రజెండాలు, తోరణాలతో అలంకరించారు. సర్కస్ గ్రౌండ్ నుండి రెవెన్యూ గార్డెన్ వరకు వేలాది మంది పార్టీ కార్యకర్తలు భారీ ర్యాలీ చేపట్టారు. ర్యాలీలోమహిళలు కోలాటా నృత్యాలతో ముందు వరుసలో నిలువగా డప్పు కళకారులు ఆట పాటలతో అలరించారు. వందల మంది జన సేవాదళ్ వాలంటీర్స్ ఎర్ర జెండాలను చేతబూని ర్యాలీలో వరుస క్రమంలో నిలిచారు. వారిననుసరిస్తూ పార్టీ అగ్ర నాయకులు నినాదాలు చేస్తూ కదిలారు. దీంతో నగరమంతా ఎరుపు రంగును పులుముకున్నట్లుగా కయనిపించింది. కమ్యూనిస్టు పార్టీ నగరంలో చేపట్టిన ర్యాలీతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com